సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 125

శుక్రవారం 26-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

**డిసెంబర్‌కల్లా పేమెంట్ సేవలు**
మెసేజ్ పంపినంత సులువుగా వాట్సాప్ ద్వారా నగదు బదిలీ - బిజినెస్‌లో

**కొత్త స్పాన్సర్ బైజూస్**
భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలిగిన ఒప్పో సంస్థ - స్పోర్ట్స్‌లో

# ఇక్కడొద్దు అక్కడే!



గత నాలుగేళ్లుగా పొరుగు రాష్ట్రాల్లో చదువుకునేందుకు వెళ్లిన విద్యార్థుల సంఖ్య ఇలా..

| 2016-17 | 2017-18 |
|---|---|
| 10,414 | 10,123 |
| **2018-19** | **2019-20** |
| 12,138 | 10 000 (మరో 5,000 మంది దరఖాస్తు చేసుకునేచాన్స్ |

హైదరాబాద్‌లో మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆంజనేయులు తన కుమారుడిని బెంగళూరులోని క్రైస్ట్‌యూనివర్సిటీలో బీఎస్సీలో (కంప్యూటర్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) చేర్చారు.

ప్రైవేటు ఉద్యోగి రాహుల్ కూడా తన కుమారుడిని ఇంటర్మీడియట్ తరువాత అదే యూని వర్సిటీలో బీబీఏలో చేర్పించారు.

## పక్క రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరేందుకు తెలుగు విద్యార్థుల ఆసక్తి

- ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఇతర డిగ్రీ కోర్సుల కోసమూ క్యూ
- తక్కువ ఫీజులు, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలే ప్రధాన కారణం
- ఇక్కడ బోధనా సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరతతో నిరాసక్తత
- ఇంటర్ బోర్డు వద్ద వరుసగా ఏటేటా పెరుగుతున్న మైగ్రేషన్ దరఖాస్తుల సంఖ్య
- ఇంటర్ కాగానే బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీల్లో ఉన్నత చదువుకు వెళ్తున్న విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా మంది తల్లి దండ్రులు ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా... మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి అనే తేడా లేకుండా తమ పిల్లలను ఉన్నతవిద్య చదివించేందుకు పక్క రాష్ట్రాల్లోని విద్యాసంస్థలకు పంపిస్తున్నారు. తమ పిల్లలు తమలా భవిష్యత్తులో ఇబ్బందులు పడొద్దన్న తపనతో మంచి చదువులకోసం ఆలోచిస్తున్న తల్లిదండ్రులకు పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీలు ఊరిస్తున్నాయి. మన సంస్థలతో పోలిస్తే తక్కువ ఫీజులు ఉండడం, నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాల కారణంగా పక్క రాష్ట్రాల్లో ఉన్న కాలేజీల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. డొనేషన్ల కోసం ఎదురుచూస్తున్న మన టాప్ కాలేజీలతో పోలిస్తే ఆయా రాష్ట్రాల్లో ఫీజులు కూడా తక్కువగా ఉండటం ఇందుకు కారణం. డిగ్రీ స్థాయి నుంచే ఉద్యోగావకాశాలు,

మిగతా 2వ పేజీలో ▶

## మన నయాగరా



చుట్టూ అడవి.. కొండల నుంచి జాలువారే జలపాతాలు.. పాలనురుగును తలపించే నీళ్లు.. దిగువకు దూకుతున్న జల సవ్వడులు.. రెప్పకూడా వేయకుండా తనివితీరా చూడాలనిపించే ప్రకృతి సోయగాలు.. ఫొటో చూస్తుంటేనే అదిరిపోతోంది.. నిజంగా అక్కడకు వెళ్లి చూస్తే తన్మయత్వంతో మైమరచిపోవడం ఖాయం అనిపిస్తోంది కదూ! మరి ఇంతటి అందమైన.. మినీ నయాగరాలా కనిపిస్తున్న ఈ జలపాతం ఎక్కడుందో తెలుసా? అచ్చంగా మన గడ్డ మీదే..!

- ఆకుల రాజు, సాక్షి, ఆసిఫాబాద్

2 లో



## 'ట్రిపుల్ తలాక్'కు లోక్‌సభ ఓకే

- మహిళల ఆత్మగౌరవం, లింగ సమానత్వం కోసమే తెచ్చాం: కేంద్రం
- ట్రిపుల్ తలాక్ చెప్పే పురుషుడికి మూడేళ్ల వరకూ జైలుశిక్ష
- బిల్లును స్థాయీసంఘానికి పంపాలని ప్రతిపక్షాల డిమాండ్
- ఒప్పుకోని బీజేపీ.. సభ నుంచి విపక్ష పార్టీల వాకౌట్

5 లో

ఆర్టీఐ బిల్లుకు పార్లమెంటు ఆమోదం










## ముగ్గురు రెబెల్స్‌పై అనర్హత

### కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ సంచలన నిర్ణయం

- కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ కె.ఆర్.రమేశ్ కుమార్ గురువారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన 17 మంది ఎమ్మెల్యేల్లో రమేశ్ జార్కిహోళి, మహేశ్ కుమటల్లి, శంకర్‌లపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేశారు.

5 లో

## బ్రిటన్ హోం మంత్రిగా ప్రీతీ పటేల్



- ముగ్గురు భారత సంతతి ఎంపీలకు కేబినెట్‌లో చోటు
- ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా ఇన్ఫోసిస్ మూర్తి అల్లుడు రిషి
- అలోక్ శర్మకు ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ బాధ్యతలు

- వివరాలు 5లో

## తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

- ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు నలుగురు జడ్జీలు
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

- వివరాలు 4లో

# వా'నర' యుద్ధం



### పల్లెల్లో కర్కోటక మర్కటాలు

- పొలాల్లో పత్తి, వరినాడు మడులను ధ్వంసం చేస్తున్న వైనం
- ఇళ్లలో నిత్యావసరాలనూ ఎత్తుకెళ్తున్న కోతులు
- వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే గ్రామస్తులపై దాడి చేస్తున్న వానరాలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్‌లో చర్యలు
- రూ. 6 లక్షలతో వానరులను ఊరు దాటించాలని నిర్ణయం
- దుమాలలో కోతుల ఏరివేతకు బృందాలు

3 లో

# 1,466 వైద్యారోగ్యశాఖలో పోస్టుల భర్తీ!

### త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో 1,466 పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందులో 257 డాక్టర్, 1,209 పారామెడికల్, ఇతర పోస్టులున్నాయి. నియామకాల ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై జేఎన్టీయూ రిజిస్ట్రార్‌తో వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి ఇటీవల సమావేశం నిర్వహించారు. తాజాగా ఈ నెల 30లోగా ఆయా పోస్టుల విద్యార్హత, దరఖాస్తు రుసుం, పరీక్ష విధానం, సిలబస్ సహా భర్తీ ప్రక్రియకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అందజేయాలని వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయాలని యోచిస్తున్నారు. అయితే బోర్డు ద్వారా ఇప్పటివరకూ ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయలేదు. దీంతో ఇప్పటికే ఉద్యోగాలు భర్తీ చేసిన అనుభవం ఉన్న జేఎన్టీయూ సహాయం తీసుకుంటున్నారు.



## ఇంద్రగంటి కన్నుమూత

- అనారోగ్యంతో శ్రీకాంతశర్మ తుదిశ్వాస
- సాహితీవేత్తగా, అభ్యుదయ కవిగా తెలుగు సాహిత్యంపై ప్రత్యేక ముద్ర
- కుటుంబ సభ్యులకు సాహితీ ప్రముఖుల పరామర్శ

హైదరాబాద్: దాదాపు నాలుగున్నర దశాబ్దాలు సాహిత్య, పత్రిక రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖ రచయిత, కవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ (75) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఆయన స్వగృహంలో గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన నివాసం వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులతోపాటు

మిగతా 2వ పేజీలో ▶

## ఇదంజగత్



మన పార్టీలో ఎవరూ ముందుకు రావడం లేదు! పక్క పార్టీ వాళ్లను అడుగుదామాసార్!

# మర్రి.. తరలేనా మరి?

### సచివాలయ ప్రాంగణంలోని భారీ వృక్షాల ట్రాన్స్‌లొకేషన్

- అటవీ శాఖతో కలిసి చేపట్టే యోచనలో ఆర్ అండ్ బీ
- పాలు లాంటి ద్రవం స్రవించే చెట్లను తరలించే ఆలోచన
- త్వరలో చెట్లపై అటవీ శాఖ అధికారుల బృందం సర్వే

సాక్షి, హైదారబాద్: ఊడలు చాచిన భారీ మర్రి వృక్షాలు.. వేల సంఖ్యలో పక్షులకు ఆవాసం కల్పించే విశాలమైన రావి చెట్లు.. వంద మంది కూర్చున్నా సరిపడా నీడనిచ్చేంతటి భారీ వేప చెట్లు.. మేడి, మామిడిలాంటివి సరేసరి. హుస్సేన్‌సాగర్ ఒడ్డున విశాలమైన 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సచివాలయం ప్రాంగణంలో వృక్షాలు ఓ ప్రత్యేకాకర్షణ. జీ బ్లాక్ కాకుండా మిగతా భవనాల నిర్మాణానికి పూర్వం నుంచి ఉన్న వృక్షాలూ అక్కడ ఠీవిగా నిలిచి ఉన్నాయి. పెద్ద వృక్షాలకు చిన్న చెట్లు జతకూడి ఆ ప్రాంతం ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తాయి. భవనానికి భవనానికి మధ్య ఖాళీ స్థలం ఉండటంతో పెద్ద సంఖ్యలో చెట్లు పెరిగేందుకు అవకాశం కలిగింది. సచివాలయం నలుమూలలా చక్కటి నీడనిచ్చే చెట్లు ఆ భవనాల సముదాయానికి ప్రత్యేక శోభనిస్తున్నాయి. ఇప్పుడు కొత్త సచివాలయం నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ ఈ చెట్ల సంగతేంటి...? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

### చెట్లను తొలగించాల్సిన పరిస్థితి

ఇప్పటివరకు హైదరాబాద్‌లో భారీ చెట్ల ట్రాన్స్‌లొకేషన్ నామమాత్రంగానే సాగుతూ వచ్చింది. ఇప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

పచ్చదనంతో కళకళలాడుతున్న సచివాలయ ప్రాంగణం



# 23 కొత్త జిల్లాల్లో ఈవీఎం గోడౌన్లు

## నిర్మించాలని సీఎస్ ఎస్కే జోషి ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని 23 కొత్త జిల్లాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్‌లను భద్రపరచడానికి అవసరమైన గోడౌన్ల నిర్మాణాన్ని వచ్చే ఏడాది మేలోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం గోడౌన్లను జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త కలెక్టరేట్లలో నిర్మించేలా చూడాలన్నారు. గోడౌన్ల నిర్మాణాలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కన్సల్టెంట్ భన్వర్ లాల్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) రజత్ కుమార్ గురువారం సచివాలయంలో సీఎస్‌తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ జోషి మాట్లాడుతూ ఆర్అండ్‌బీ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలను చేపట్టాలన్నారు. ములుగు, నారాయణపేట్ జిల్లాలలో గోడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన 21 జిల్లాలలో 19 ఆర్అండ్‌బీ ద్వారా, ఒక జిల్లాలో విద్యాశాఖ, మరో జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పనులు చేపడుతున్నారన్నారు. ఆర్అండ్‌బీ చేపడుతున్న పనుల్లో 8 చోట్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని, 5 చోట్ల టెండర్లు పూర్తి అయ్యాయన్నారు.

# ఎంసెట్ లీకేజీపై ప్రభుత్వానికి సీఐడీ నివేదిక!

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన ఎంసెట్–2 (మెడికల్) లీకేజీలో సీఐడీ పోలీసులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. 2016 జూలైలో వెలుగుచూసిన ఈ లీకేజీపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఇటీవలే పోలీసులు 3,500 పేజీలతో చార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చార్జిషీటును కోర్టుకు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. కేసు విచారణ ప్రారంభమయ్యే సమయంలో ఈ మొత్తం వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారని సమాచారం. ఈ కేసు వెలుగుచూసిన కొత్తలో సీఐడీ పోలీసులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. కేసులో మొత్తం 90 మంది నిందితులు, 400 మంది వరకు సాక్షులు ఉన్నారు. నిందితుల్లో ముగ్గురు దర్యాప్తు జరుగుతుండగానే మరణించారు. ఇప్పటివరకు 67 మందిని అరెస్టు చేయగా, మరో 20 మందికిపైగా నిందితులు ఇంత వరకూ పోలీసులకు చిక్కలేదు. నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరించిన సీఐడీ పోలీసులు ఈ కుట్రకు పాల్పడిన వారందరికీ శిక్ష పడుతుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# రెండు రోజులు మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నేడు, రేపు చాలా చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమబెంగాల్ ఉత్తర భాగం, దాని పరిసర ప్రాంతాల్లో 7.6 కి.మీ ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్ కోస్తా తీర ప్రాంతాల్లో నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, గురువారం కోస్గి(మహబూబ్‌నగర్)లో 2 సెం.మీ, కొడంగల్(వికారాబాద్)లో 1 సెం.మీ వర్షం కురిసింది.

# 31 నుంచి ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్

**సాక్షి, హైదరాబాద్:** బీ–ఫార్మసీ, ఫార్మ్–డీ, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్ ఎంట్రన్స్ కౌన్సెలింగ్‌ను ఈనెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. విద్యార్థులు ఈనెల 31, వచ్చే నెల 1వ తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాల పరిశీలన స్లాట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, 2 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు. ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి వచ్చే నెల 6వ తేదీన సీట్లు కేటాయిస్తామన్నారు. సీట్లు పొందిన వారు 6 నుంచి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని వివరించారు.

# అఫిలియేషన్‌కు ఆగస్టు 10 గడువు

## ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో అఫిలియేషన్ లేని జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు తీసుకునేందుకు ఆగస్టు 10 వరకు గడువు విధించినట్లు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. నిర్ణీత గడువులోపు 1,338 ప్రైవేటు కాలేజీలు అక్రెడిటేషన్ తీసుకోకుంటే ఆయా కాలేజీలు చేసుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తామని, ఆయా కాలేజీల్లో చేరిన విద్యార్థుల భవిష్యత్తుకు యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనుబంధ గుర్తింపు విషయంలో బోర్డు కచ్చితమైన చర్యలు చేపట్టాలని, బోర్డు నిబంధనలను పక్కాగా అమలు చేస్తుండటం అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.

# మలావత్ పూర్ణ మహిళలందరికీ స్ఫూర్తి

## యూఎస్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా

**సాక్షి, హైదరాబాద్:** ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన గిరిజన బాలిక మలావత్ పూర్ణ మహిళలందరికీ ఆదర్శమని యూఎస్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా పేర్కొన్నారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో జరిగిన పూర్ణ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అతి చిన్న వయసులో ఎవరెస్టును అధిరోహించిన పూర్ణ ధైర్య సాహసాలు మెచ్చుకోదగ్గవన్నారు. పేద గిరిజన కుటుంబం నుంచి వచ్చిన పూర్ణను ఇంతటి స్థాయికి తీసుకొచ్చిన గిరిజన గురుకుల సొసైటీని ప్రత్యేకంగా అభినందించారు. పూర్ణ డిగ్రీ విద్య చదువుకునేందుకు అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన పూర్ణ ఇప్పుడు వేలాది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. పూర్ణలాంటి మరెంతో మంది విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందిస్తుందని, ఎందరో గురుకుల విద్యార్థులు మంచి స్థాయికి వెళ్లేందుకు చొరవ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశ్రీ శాంతా సిన్హా, పుస్తక రచయిత అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ టీచర్ అవార్డులకు ఆరుగురి పేర్లు

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆరుగురి పేర్లను ప్రతిపాదించినట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తెలిపారు. 33 జిల్లాల డీఈవోలు 80 మంది పేర్లను పంపించారని, అందులో ఆరుగురిని అధికారుల కమిటీ ఎంపిక చేసిందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా అంబారీపేట జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మార్గం రాజేంద్రప్రసాద్, సిద్దిపేట జిల్లా ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పయ్యావుల రామస్వామి, సిద్దిపేట జిల్లా హంతకపేట జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ టి రవీందర్‌రెడ్డి, వరంగల్ రూరల్ జిల్లా మండ్రి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ శంకరబత్తుల సత్యం, మేడ్చల్ జిల్లా జీడిమెట్ల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ బి ఆశారాణి, మహబూబ్‌నగర్ జిల్లా ఎనమన్‌గండ్ల జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ టీఎన్ శ్రీధర్ పేర్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురికి తెలంగాణ కోటాలో అవార్డు వచ్చే అవకాశముందని అన్నారు. ఎంపికైన టీచర్లు సెప్టెంబర్ 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటారని తెలిపారు.

# లండన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

## ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో నిర్వహణ



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను లండన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కార్యవర్గ సభ్యులు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ పోచారం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ బాధ్యతలు చేపట్టాక రాష్ట్రమంతటా నూతనోత్తేజం వచ్చిందన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా తమ సొంత గ్రామం పోచారంలో ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉండేలా సొంత ఖర్చుతో పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. ఎన్ఆర్ఐ తెరాస వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ.. కేటీఆర్‌కు తెరాస పక్షాన, యావత్ ఎన్ఆర్ఐల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ సెల్ యూకే అధ్యక్షుడు అశోక్ దూసరి, అడ్వైజరీ బోర్డు సభ్యుడు దొంతుల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, సత్య చిలుముల, సృజన్‌రెడ్డి, రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రెప్ప వేయనివ్వని సోయగాలు..

# ఈ సప్తగుండాలు

### కుమురంభీం జిల్లా అడవుల్లో కనువిందు చేస్తున్న మిట్టె జలపాతం



లక్ష్మణ గుండం

మనసు దోచే జలపాతాలు, హృదయం పులకరించే ప్రకృతి సోయగాలు చూడాలంటే ఇకపై మనం ఎక్కడికో వెళ్లక్కర్లేదు. దర్జాగా మన గడ్డపైనే వాటిని చూస్తూ తన్మయత్వంతో మైమరచిపోవచ్చు. మదిని కట్టిపడేస్తూ కనువిందు చేస్తున్న ఈ అందాలు.. మన కుమురంభీం జిల్లాలోనే ఉన్నాయి. లింగాపూర్ మండల సమీపంలో ఈ జలపాతాలు హొయలొలికిస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. సప్తగుండాలుగా పిలిచే ఏడు జలపాతాలు మదిని పులకరింపజేస్తున్నాయి. ఇక్కడి దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న రామ గుండం, సీత గుండం, లక్ష్మణ గుండం, భీమ గుండం, సవితి గుండం, చిరుతల గుండం, సప్తగుండం అనే ఏడు గుండాలను కలిపి మిట్టె జలపాతం అని పిలుస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద చేరడంతో ఎత్తైన కొండల నుంచి జలపాతం పరవళ్లు తొక్కుతూ చూపరులను కట్టిపడేస్తోంది. కుమురంభీం జిల్లా కేంద్రానికి 90 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతాన్ని గతంలో పనిచేసిన కలెక్టర్ చంపాలాల్ సందర్శించడంతో మరింత వెలుగులోకి వచ్చింది. అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరజిల్లాల్సిన ఈ ప్రదేశం.. సరైన రోడ్డు మార్గం లేకపోవడం వల్ల ప్రాచుర్యం సంతరించుకోలేకపోతోంది. ఇవే కాకుండా ఈ జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతాల్లో అనేక జలపాతాలు ఉన్నా ఇన్నాళ్లూ అవి బాహ్య ప్రపంచానికి పరిచయం కాలేదు. – సాక్షి, ఆసిఫాబాద్



భీమగుండం



సవితి గుండం

# ఇక్కడొద్దు అక్కడే!

► మొదటి పేజీ తరువాయి

జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలున్నందున విద్యార్థులు కూడా ముందడుగేస్తున్నారు. రెగ్యులర్ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు కూడా పొరుగు రాష్ట్రాలకు ఇంటర్మీడియట్ పూర్తయిన వారే ఎక్కువగా వెళ్తున్నట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. గత నాలుగేళ్లలో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి మైగ్రేషన్ సర్టిఫికెట్లు తీసుకుంటున్న విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరగడమే ఇందుకు నిదర్శనం.

**లోపాలు ఓ కారణమే!**

రాష్ట్రంలోని ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల్లోని లోపాలు కూడా మన విద్యార్థులు ఇతర రాష్ట్రాల బాట పట్టేందుకు ఓ కారణం అవుతోంది. అత్యధిక ఫీజులు, నాణ్యత ప్రమాణాల కొరత కూడా విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు వెళ్లేలా చేస్తున్నాయి. 20–30 టాప్ కాలేజీలు మినహా ఇతర విద్యా సంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. అధ్యాపకుల కొరత కూడా ఎక్కువగా ఉంది. ఆర్టికల్ 371(డీ) ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు మనదగ్గర ప్రవేశాలు కల్పించడం తక్కువే. అయితే గత పదేళ్లుగా నాణ్యత ప్రమాణాలు పెద్దగా పాటించని ఐదారు కాలేజీల్లో బిహార్, అస్సాం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. నిబంధనల ప్రకారం ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడ సీట్లు ఇవ్వకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ.. మిగులు సీట్లలో ప్రవేశాల పేరుతో గతంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అడ్డుపెట్టుకొని ఆ రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అక్కడి ప్రభుత్వాలు కూడా సదరు విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఇస్తుండటంతో యాజమాన్యాలే ఏజెంట్లను ఏర్పాటుచేసుకుని మనీ చేర్చుకుంటున్నారు.

**ఇంజనీరింగ్ ఒక్కటే కాదు..**

ఒకప్పుడు రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల కొరత కారణంగా ఎక్కువ మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఇంజనీరింగ్ చదువుకునే వారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు ఎక్కువగా ఏర్పాటు చేయడంతో తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల తగ్గిపోయింది. అయితే ఈమధ్య కాలంలో మళ్లీ ఇంజనీరింగ్‌తోపాటుగా.. రెగ్యులర్ డిగ్రీ కోర్సులను చదువుకునేందుకు వెళ్తున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. బీబీఏ, బీకాం, బీఎస్సీ వంటి కోర్సులకోసం కూడా ఇతర రాష్ట్రాల కాలేజీలను ఆశ్రయిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు వెళ్తున్నారు. డిగ్రీతోపాటు సివిల్స్ సాధించాలనే లక్ష్యమున్న వారి దృష్టంతా ఢిల్లీ కాలేజీలపై ఉంది. ముంబైలోని సెయింట్ జేవియర్ వంటి విద్యా సంస్థల్లో డిగ్రీ చదువు పూర్తి కాకముందే ఉద్యోగావకాశాలు వస్తుండడం కూడా మన విద్యార్థులు వలస వెళ్లేందుకు కారణమవుతోంది. దీనికితోడు ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టంను (సీబీసీఎస్) అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తుండటంతో విభిన్న రకాల సబ్జెక్టుల కలయికతో విద్యా సంస్థలు కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో బీఎస్సీ (కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్) వంటి కోర్సులను అందుబాటులోకి తేవడం, బీబీఏ, ఎంబీఏ వంటి కోర్సులకు టాప్ వర్సిటీగా పేరు రావడంతో ఆవైపు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.

# ఇంద్రగంటి కన్నుమూత

► మొదటి పేజీ తరువాయి

బంధువులు, సన్నిహితులు శోకసంద్రంలో మునిగారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వెంకటరత్నమ్మ దంపతుల మూడో కొడుకు శ్రీకాంత శర్మ. విజయవాడలో చాలా కాలంపాటు ఆయన జర్నలిస్టుగా పనిచేశారు. ఇంద్రగంటి భార్య ప్రముఖ రచయిత్రి జానకీబాల, కొడుకు ప్రముఖ సినీ దర్శకులు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ. కాగా, గురువారం సాయంత్రం అల్వాల్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం, సినీనటులు నరేష్, తనికెళ్ల భరణి, షఫి, పవిత్రలోకేష్, సాహిత్య రంగ ప్రముఖులు శ్రీరమణ, పతంజలిశాస్త్రి, సుధామ, శారదాశ్రీనివాస్ తదితరులు ఇంద్రగంటి పార్థివ దేహం వద్ద నివాళులర్పించి, మోహనకృష్ణ, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**అభ్యుదయ కవి, సాహితీవేత్త..**

1944 మే 29న జన్మించిన ఇంద్రగంటికి.. తండ్రి హనుమచ్ఛాస్త్రి సుప్రసిద్ధ కవి కావడంతో సహజంగానే సాహిత్యం ఒంటబట్టింది. విద్యార్థి దశ నుంచే ఆయన రచనావ్యాసాంగాన్ని చేపట్టారు. చిన్నవయసులోనే అభ్యుదయ కవిగా ప్రసిద్ధులయ్యారు. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా పని చేశారు. 1976లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సహాయ సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించారు. రేడియోలో నాటికలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలకు ప్రాణం పోశారు. ఆ తర్వాత ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకులుగా కూడా ఇంద్రగంటి శ్రీకాంత శర్మ పనిచేశారు. ఇటీవలే ఆయన 'ఇంటిపేరు ఇంద్రగంటి'పేరుతో తన ఆత్మకథను వెలువరించారు. గత యాభై సంవత్సరాల్లో తానెరిగిన సాహిత్య జీవితాన్ని, అలాగే తన కుటుంబ విశేషాలను, రచయితగా తన అనుభవాలను కలగలిపి ఈ ఆత్మ కథ రాసి 2018 జనవరిలో విడుదల చేశారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో కవిత్వం, విమర్శలు, నాటకాలు, నవలలు, 20కిపైగా పుస్తకాలు రాశారు. రచయితగా, కవిగా, పాత్రికేయుడిగా, సంపాదకులుగా ఆయన సాహిత్యరంగంలో చేసిన సేవలకుగాను పలు జాతీయ స్థాయి పురస్కారాలు, వివిధ సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో గుడిపాటి వెంకటాచలం, కృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీశ్రీ, బుచ్చిబాబు, బాల గంగాధర్ తిలక్, విశ్వనాథశాస్త్రి, అజంతా రచనలతో ఆయన బాగా ప్రభావితమయ్యారు. 'ఈ ప్రపంచంలో సర్వవిశ్వాసాలకి, చర్యలకి, వ్యక్తి కేంద్రమని నేను నమ్ముతాను. సెయింట్ కావచ్చు, సిన్నర్ కావచ్చు. వ్యక్తి సమూహాలను శాసిస్తాడని నా విశ్వాసం అయితే ఏ ఒక్క విశ్వాసమూ పరిపూర్ణ సత్యం కాదు. సాపేక్ష సత్యమే. అందుచేత సాహిత్య పఠనం, రచనా వ్యాసాంగంలోకి మనసు పెట్టే వాళ్లు, తమ మనసులకుండే కిటికీలు తెరిచిపెట్టడం అవసరం. పాత విశ్వాసాలు కొట్టుకుపోవాల్సి రావచ్చు. కొత్త విశ్వాసాలు దూసుకురావచ్చు. మనసులోకి వెలుతురుతాకే అవకాశం ముఖ్యం. దాన్ని మూసి పెట్టకూడదు'అని ఓ సందర్భంలో ఇంద్రగంటి శ్రీకాంత శర్మ చేసిన ప్రతిపాదన నేటి రచయితలకు ఓ దీపస్తంభం లాంటిది.

### నెలవంక నుంచి సమ్మోహనం వరకు

శ్రీకాంత శర్మ 20కి పైగా సినిమాలకు పాటలు కూడా రాశారు. జంధ్యాల దర్శకత్వం వహించిన 'నెలవంక'చిత్రంలో 6పాటలు రాశారు. ఇందులో 'ఏది మతం'పాటకు జాతీయ అవార్డు వస్తుందని అనుకున్నారు. ఆ తర్వాత జంధ్యాల దర్శకత్వంలోనే 'పుత్తడిబొమ్మ'సినిమాకు రెండు పాటలు, 'రావు–గోపాలరావు'చిత్రంలో ఓ పాట రాశారు. 'కృష్ణమూర్తి కుక్కపిల్లలు'అనే టెలీఫిలిం కోసం ఓ పాట రాశారు. తనయుడు మోహనకృష్ణ దర్శకత్వం వహించిన 'గోల్కొండ హైస్కూల్'సినిమాలో 'ఏనాటివో రాగాలు'పాటను, 'అంతకు ముందు ఆ తర్వాత'చిత్రంలో 'నా అనురాగం'పాటను, 'సమ్మోహనం'లో 'మనసైనదేదో'పాటను రాశారు. 74 సంవత్సరాల వయసులో ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ 'సమ్మోహనం'కోసం ఆయన రాసిన ఫుల్ రొమాంటిక్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది.

# మర్రి.. తరలేనా మరి?

► మొదటి పేజీ తరువాయి

తొలిసారి పెద్ద ఎత్తున ఆ ప్రక్రియ చేపట్టే సందర్భం ఏర్పడింది. సచివాలయం ప్రాంగణంలో 30 వరకు భారీ వృక్షాలు సహా అన్నీ కలిపి దాదాపు 300 వరకు చెట్లున్నాయి. ఇప్పుడు సచివాలయంలోని భవనాలను తొలగించి విశాలమైన 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవన సముదాయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న విషయం తెలిసిందే. అక్కడికి నిత్యం వేల సంఖ్యలో సందర్శకులు వస్తున్నందున వాహనాలు నిలిపేందుకు కూడా భారీ పార్కింగ్ యార్డు అవసరమవుతుంది. వీటి నిర్మాణానికి సంబంధించి ప్లాన్‌కు ప్రస్తుతం ఉన్న చెట్లు అడ్డుగా మారనున్నాయి. దీంతో వాటిని కచ్చితంగా తొలగించాల్సి ఉంది. ఇంతకాలం ఆ ప్రాంతానికి ప్రత్యేక ఆహ్లాదాన్ని, అందాన్ని పంచిన ఈ చెట్లను అడ్డంగా నరికివేస్తే పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావటం ఖాయం. దీంతో వాటిల్లో ముఖ్యమైన చెట్లను నరికేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి రోడ్లు భవనాల శాఖ ఆ బాధ్యతను అటవీ శాఖకు అప్పగించబోతోంది. త్వరలో అటవీ శాఖ ఆ చెట్లను లెక్కించి తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

**పాలుగారే చెట్లయితే ఓకే:** అభివృద్ధి చెందిన దేశాల తరహాలో మనదేశంలో చెట్ల ట్రాన్స్‌లొకేషన్ ప్రక్రియకు అంతగా ప్రాధాన్యమివ్వలేదు. అభివృద్ధి పనులకు అడ్డొచ్చిన మహా వృక్షాలను కూడా నిర్దాక్షిణ్యంగా నరికేయటమే జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో చెట్లను వేరే ప్రాంతాలకు తరలించే ట్రాన్స్‌లొకేషన్ ప్రక్రియ చేపట్టినా విజయవంతమైన దాఖలాలు చాలా తక్కువ. చెట్టు కొమ్మలన్నింటిని తొలగించి వేర్లతో కూడిన మొండాన్ని మాత్రమే తరలిస్తున్నారు. మళ్లీ ఆ మొదలుకు పూర్వపు రీతిలో కొమ్మలు పెరిగేందుకు ఏళ్లు పడుతోంది. అలా కాకుండా చెట్టు మొత్తాన్ని తరలించే పరిజ్ఞానం మనవద్ద లేదు. కానీ సచివాలయంలో భారీ వృక్షాలను ప్రత్యేక పద్ధతిలో అదే ప్రాంగణంలో మరోచోటకు తరలించేందుకు సిద్ధమని అటవీశాఖ అధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు. కొన్ని రకాల చెట్లు పాలు లాంటి ద్రవం స్రవిస్తూ ఉంటాయని.. ఆకునో, కొమ్మనో తుంపితే ఆ తెల్లటి ద్రవం కారుతుందని వెల్లడించారు. ఇలాంటి చెట్లు ట్రాన్స్‌లొకేషన్‌కు అనువైనవని ఆయన చెబుతున్నారు. ట్రాన్స్‌లొకేషన్ చేసిన తర్వాత బతికే ఉండేందుకు చెట్లకు కొన్ని ప్రత్యేక గుణాలు అవసరం. అవి ఈ ద్రవం స్రవించే చెట్లలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కాకుండా వేప కూడా ఆ గుణాలను కలిగి ఉంటుంది. అయితే అన్నింటిని ఇలా తరలించలేమని, కొన్ని వదిలేయటం తప్ప చేసేదేమీ ఉండదని వ్యాఖ్యానించారు. భవన నిర్మాణాలు లేని చోట్ల ఉన్న చెట్లను అలాగే ఉంచి తదుపరి ప్రణాళికలు వేసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. పాత గేటు వైపు ఎక్కువ స్థలం పార్కింగ్, ఉద్యానవనాలకే వదిలేసే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతంలోని చెట్లు అలాగే ఉంచేలా డిజైన్ రూపొందించాలని పేర్కొంటున్నారు. తాము కూడా అలాంటి ఆలోచనతోనే ఉన్నామని రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.



సచివాలయం ఆవరణంలోని ఓ వృక్షం

### త్వరలో సర్వే..

సచివాలయ నిర్మాణ వైశాల్యం, నిర్మించే ప్రాంతం, డిజైన్ ఖరారయ్యాక ఆ వివరాలను రోడ్లు భవనాల శాఖ అధికారులు అటవీ శాఖకు అందజేయనున్నారు. అప్పుడు ఆ శాఖ నుంచి ఓ బృందం వచ్చి చెట్ల సంఖ్యను తేల్చనుంది. ఆ తర్వాత అటవీశాఖ సాంకేతిక అధికారుల బృందం వచ్చి ట్రాన్స్‌లొకేషన్‌కు వీలుగా ఉన్న చెట్లను గుర్తించి వాటిల్లో ఎన్నింటిని పక్కకు తరలించనున్నారో తేలుస్తుంది. ఆ మేరకు చర్యలు తీసుకోనున్నారు.

# కిషన్‌రెడ్డిని కలసిన కొడుముంజ బాధితులు

**సాక్షి, న్యూఢిల్లీ:** గత నెల రెండో తేదీన కొడుముంజలో జరిగిన దాడి వ్యవహారంలో టీఆర్ఎస్ నేతల ప్రోద్బలంతో బాధితులపైనే కేసులు పెట్టి వేధించారని, దీనిపై వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డిని గురువారం ఇక్కడ కలిశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌తో కలిసి దాదాపు 15 మంది గౌడ కులస్తులు మంత్రిని కలిశారు. జూన్ 2వ తేదీన గ్రామంలోని పెద్దమ్మ గుడి వద్ద పెద్దరాగుల రాజు, మమత పూజకు వెళ్లగా, భూమళ్ల లక్ష్మణ్, రెడ్డ వేని పర్శరాం, నరేష్ అక్కడికి వచ్చి రాజు, అతడి భార్యను దూషించి దాడి చేశారని, ఈ దాడిలో రాజుకు మద్దతుగా నిలిచిన పెద్దరాగుల ప్రసాద్‌ను కూడా కొట్టారని, అతడి చేయి విరిగిందని వివరించారు. గౌడ కులస్తులు వెళ్లి వేములవాడ రూరల్ సీఐ వద్ద ఫిర్యాదు చేయగా, అదే సమయంలో ఫోన్ కాల్ అందుకున్న సీఐ, భూమళ్ల లక్ష్మణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరించారని వివరించారు. పావుగంట తరువాత భూమళ్ల లక్ష్మణ్, పర్శరాం, నరేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐతో మంతనాలు జరిపారని వివరించారు. టీఆర్ఎస్ నేత అయిన భూమళ్ల లక్ష్మణ్ ప్రోద్బలంతో బాధితుడైన పెద్దరాగుల ప్రసాద్‌సహా మరో 20 మందిపై 307 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని వివరించారు. స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా సీఐ పనిచేశారని వివరించారు.

# గేమ్స్‌తో సామాజిక చైతన్యం రావాలి



'గేమ్స్ ఫర్ గుడ్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేథరిన్ హడ్డా

## అమెరికన్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా ● ఘనంగా 'గేమ్స్ ఫర్ గుడ్' ప్రారంభోత్సవం

**సాక్షి, హైదరాబాద్:**

ప్రజా జీవనాన్ని ప్రభావితం చేసేలా, సామాజిక చైతన్యాన్ని పెంచేలా ఆధునిక పద్ధతిలో గేమ్స్ రూపొందించాలని అమెరికన్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని టీహబ్‌లో 4 రోజులపాటు జరగనున్న 'గేమ్స్ ఫర్ గుడ్' కార్యక్రమాన్ని ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌తో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గేమింగ్ కోసం కార్యక్రమం నిర్వహించడం 30 ఏళ్ల అమెరికన్ కాన్సులేట్ చరిత్రలో ఇదే తొలిసారని వెల్లడించారు. 'గేమ్స్ ఫర్ గుడ్'మంచి సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్లు పెరుగుతున్న దరిమిలా అంతర్జాతీయంగా గేమింగ్‌కు చక్కటి ఆదరణ ఏర్పడిందన్నారు. సామాజిక మార్పుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రపంచాన్ని వేధిస్తోన్న శరణార్థులు, వాతావరణ మార్పులు, మానవ అక్రమ రవాణా, వ్యాధులు తదితర సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం పెంచేలా గేమ్స్ ఉండాలని సూచించారు. వినోదం, సృజనాత్మకతతోపాటు సామాజిక చైతన్యానికి గేమింగ్ రంగం చక్కటి వేదిక కావాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల సంస్కృతి, సంబంధాలను పెంపొందించేలా గేమ్‌లు రూపొందించాలని యువ గేమ్ డిజైనర్లకు ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం చాలా సంతోషకరమని, ఇక్కడ అత్యున్నత విద్యాసంస్థలకు తోడు అమెరికాకు చెందిన 130 కంపెనీలు ఉన్నాయని గుర్తు చేశారు. టీ హబ్ అద్భుతాలకు చిరునామాగా.. నూతన ఆవిష్కరణలకు నిలయంగా మారిందని ప్రశంసించారు.

**భారత సవాళ్లను దృష్టిలో ఉంచుకోండి**

'భారత్ చాలా వైవిధ్యమున్న దేశం. ఇక్కడి జీవనశైలి, ఆచార వ్యవహారాలు, సవాళ్లను దృష్టిలో ఉంచుకుని గేమ్‌లు రూపొందించాలి. భారతీయులు ఇంటిని అత్యంత పరిశుభ్రంగా ఉంచుకుంటారు. కానీ బయటికెళ్లగానే ఆ విషయాన్ని మర్చిపోతారు. ఇక్కడి ప్రభుత్వాలు పారిశుద్ధ్యం కోసం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నాయి. నీటి ఎద్దడి, పర్యావరణంపై చైతన్యం పెంచేలా గేమ్స్ ఉండాలి. గేమింగ్ రంగానికి మంచి భవిష్యత్తు ఉంది. డిజిటల్ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతూ.. 20 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇప్పటిదాకా హైదరాబాద్ కంపెనీలు విదేశీ గేమ్‌ల రూపకల్పన కోసం పనిచేశాయి. గత రెండు, మూడేళ్లుగా ఆ పరిస్థితిలో మార్పువచ్చి.. మనవాళ్లే కొత్త పాత్రలు రూపొందిస్తున్నారు. చోటా భీమ్, బాహుబలి పాత్రలకు ప్రాణం పోసి వినూత్న ఆవిష్కరణలకు చిరునామాగా నిలవడమే దీనికి నిదర్శనం. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్‌లోనూ హైదరాబాద్ ఇప్పటికే తన ఘనతను చాటుకుంది'అని హడ్డా వెల్లడించారు. అంతకు ముందు కార్యక్రమంలో గేమింగ్ నిపుణులు శాన్ బుచర్డ్, విజయ్ లక్ష్మణ్, కవితా వేమూరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వా'నర' యుద్ధం

## పల్లెల్లో కర్కోటక మర్కటాలు


బొప్పాపూర్‌లో ఓ ఇంటిపై కోతులు

- ఇళ్లను గుల్ల చేస్తున్న కోతులు
- కోతుల పట్టివేతకు విరాళాల సేకరణ
- రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్‌లో చర్యలు

**ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల):** 'కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టు'అన్నది సామెత. చిన్న కొబ్బరిచిప్ప దొరికితేనే నానా హంగామా చేసే కోతి దండుగట్టి ఊర్ల మీద పడితే... ఇక అంతే! పల్లె వాసులకు తిప్పలేతిప్పలు. వనం విడిచిన కోతులు జనం మీద పడ్డాయి. ఇల్లు పీకి పందిరేస్తున్నాయి. కోతిచేష్టలకు ప్రజలు చేష్టలుడిగి చూస్తున్నారు. శతమర్కటం.. పితలాటకం.. అన్నట్లుగా ఉంది పరిస్థితి. 'వానర'కం చూపిస్తున్నాయి. వాటి బారిన పడి పలువురు గాయపడ్డారు. కొన్ని ఊళ్లల్లో చిన్నపాటి వా'నర'యుద్ధం సాగుతోంది. రోజూ వాటితో 'మేమేగలేం'అంటున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్, దుమాల గ్రామస్తులు. వారి బాధను గ్రామపంచాయతీ పాలకవర్గాలకు విన్నించారు. దీంతో వానరాలపై ఆయా గ్రామాల ప్రజలు యుద్ధం ప్రకటించారు.

**కోతులదాడిలో పలువురికి గాయాలు**

బొప్పాపూర్, దుమాలలో కోతులు ఇండ్లలోకి ప్రవేశించి నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించేవారిపై ఎదురుదాడికి దిగుతున్నాయి. వారం క్రితం బొప్పాపూర్‌కు చెందిన బత్తుల తులసి, గడ్డం అరవింద్, మస్కూరి మల్లవ్వ, లక్ష్మి, శ్రీలత, రామవ్వ, మల్లయ్యలపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయలకు గురయ్యారు.

**దుమాలలో ప్రత్యేక బృందాలు**

దుమాలలో కూడా కోతుల బాధలు తీవ్రమయ్యాయి. వ్యవసాయ పొలాల్లో కూరగాయలు, పత్తి, వరినారు మడులను ధ్వంసం చేస్తున్నాయి. వాటిని నివారించేందుకు గత నెల 29న గ్రామస్తులు ఇంటికొకరి చొప్పున బయలుదేరి కోతులను తరిమికొట్టారు. వారం పాటు పనులు వదులుకుని వానర వేటలో పడ్డారు. పొలిమేర దాటించారు. రానున్న కాలంలో కోతుల నుంచి రక్షణ కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక బోనులతో కోతుల పట్టివేత**

కోతులను పట్టుకోవడానికి ప్రత్యేక బోనులను ఏర్పాటు చేస్తున్నారు. బోన్లలో పల్లీలు చల్లి కోతులను పట్టుకునేందుకు వేటగాళ్లను రప్పిస్తున్నారు. పట్టుకున్న కోతులను అటవీ ప్రాంతంలో వదిలి పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

**విరాళాల సేకరణ**

కోతుల ఏరివేతకు బొప్పాపూర్‌లో గ్రామస్తులు విరాళాలు సేకరిస్తున్నారు. రూ.6 లక్షలు ఖర్చు చేసి వాటిని ఊరు దాటించాలని సర్పంచ్ ఆధ్వర్యంలో వారం క్రితం గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ముందుగా సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి తన వంతుగా రూ.50 వేలు అందజేశారు. అనంతరం ఇంటికి రూ.350 చొప్పున మరో రూ.3 లక్షలు పోగు చేయాలని నిర్ణయించారు. మిగతా రూ.2.50 లక్షలు పాలకవర్గ సభ్యులు ఇవ్వాలని తీర్మానించారు. కామారెడ్డి జిల్లా బీబీపేట నుంచి ప్రత్యేకంగా కోతులను బంధించే నిపుణులను రప్పిస్తున్నారు. వారికి రూ.3.50 లక్షలు ఖర్చు కానుంది.


దుమాలలో కోతులను తరిమేందుకు కర్రలతో సిద్ధంగా ఉన్న గ్రామస్తులు

### ఖర్చయినా పర్వాలేదు



కోతులతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. రోజూ వాటికి కాపలా ఉండవలసి వస్తోంది. ఖర్చు అయినా పర్వాలేదు. వానరులను ఊరు దాటిస్తే సంతోషం. ఖర్చుల కోసం గ్రామస్తులు విరాళాలు పోగు చేస్తున్నారు.

*– వంగ పద్మ, గృహిణి, బొప్పాపూర్*

### ప్రత్యేక బోను ఏర్పాటు



గ్రామంలోకి వచ్చే కోతులను పట్టడానికి ప్రత్యేక బోనులను ఏర్పాటు చేస్తున్నాం. రూ.6 లక్షలు ఖర్చు పెట్టి కోతులను ఊరు దాటించాలని నిర్ణయించాం. నేను రూ.50 వేలు విరాళం ఇచ్చాను. ప్రతి కుటుంబం నుంచి రూ.350 చొప్పున విరాళాలు సేకరిస్తున్నాం.

*– కొండపురం బాల్‌రెడ్డి, సర్పంచ్, రాచర్లబొప్పాపూర్*

### పంటపొలాల మీద పడకుండా...



కోతులు పంటపొలాల మీద పడకుండా అడవిలోకి తరిమికొట్టడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారం రోజులు గ్రామస్తులంతా కష్టపడి కోతులను వనంలోకి తరలించాం. యువకులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కోతుల నుంచి రక్షించే పనిలో నిమగ్నమయ్యారు.

*– కదిరె రజిత, సర్పంచ్, దుమాల*

## చెత్త 'శుద్ధి'లో తెలంగాణకు రెండో స్థానం

**సాక్షి, హైదరాబాద్:** ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్)లో తెలంగాణ మంచి పురోగతి కనబరుస్తోంది. దేశంలోనే రెండోస్థానంలో నిలిచి రికార్డు సాధించింది. 2018 నవంబర్ నాటికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు శుద్ధి చేసిన ఘనవ్యర్థాల గణాంకాలను ఇటీవల కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ విడుదల చేసింది. ఈ జాబితాలో ఛత్తీస్‌గఢ్ ముందు వరుసలో ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఏటా 6,01,885 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, అందులో 84 శాతం ఘన వ్యర్థాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. తెలంగాణలో 26,90,415 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా.. ఇందులో 73% వ్యర్థాలు శుద్ధికి నోచుకుంటున్నాయి. పెద్ద రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంది. అడ్డగోలుగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నా.. వాటి శుద్ధిలో చతికిలపడ్డాయి. పశ్చిమబెంగాల్ అత్యంత తక్కువగా 5 శాతం, జమ్ము, కశ్మీర్ 8 శాతం ప్రాసెసింగ్ చేస్తున్నాయి. మహారాష్ట్రలో అత్యంత ఎక్కువగా ఏటా 8,22,38,050 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి.

## క్రమశిక్షణతో పనిచేయండి

### ఉత్తమ ప్రధానోపాధ్యాయులకు అభినందనలు: జనార్దన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను విద్యాశాఖ అభినందించింది. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారులతోనూ, ప్రతి జిల్లా నుంచి ఉత్తమంగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను కార్యదర్శికి వివరించగా, వారిని అభినందించడంతోపాటు మరింత క్రమశిక్షణతో పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఆగస్టులో హాజరు మాసోత్సవాలను నిర్వహించాలని జిల్లా విద్యాధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గతేడాది 100 శాతం హాజరు కలిగి ఉన్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించాలని సూచించారు. ఆగస్టు 8న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులందరూ నులి పురుగుల నివారణ మాత్రలను తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుదలకు, పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన ఆదిలాబాద్‌లోని ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ సింగ్ ఇలావత్, ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయరావు, వనపర్తి జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిలను ఆయన అభినందించారు.

## పేదరిక నిర్మూలనతోనే సమగ్రాభివృద్ధి


కొప్పుల ఈశ్వర్

**సాక్షి, హైదరాబాద్:** పేదరిక నిర్మూలనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ దిశగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలంగాణ పునర్‌నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. గురువారం సచివాలయంలో క్రైస్తవ, సిక్కు సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను ఓటు బ్యాంకు కోణంలోనే చూశాయని, కానీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అనేక కొత్త పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తోందని మంత్రి వివరించారు. మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న కృషిని యావద్దేశం అభినందిస్తోందన్నారు. లక్షా ముప్పై వేల మందికి పైగా మైనారిటీ విద్యార్థులకు గురుకులాల ద్వారా విద్యను అందిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

## బ్యానర్లు లేకుండా బోనాలు చేసుకోలేమా?: హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** బోనాల పండుగ సందర్భంగా అనధికారికంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వంటివి ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది. బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపునకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తోందంటూ కాచిగూడకు చెందిన సురేష్ కుమార్ దాఖలు చేసిన రిట్‌ను గురువారం న్యాయమూర్తి పి.నవీన్‌రావు విచారిస్తూ.. ఏ పండుగ అయినా ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా ఎందుకు నిర్వహించుకోలేరని ప్రశ్నించారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల గతంలో ఛత్రినాక ప్రాంతంలో ఒకరు మరణించారని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ అసోసియేషన్ ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను తొలగించేందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం రూ. లక్షను జీహెచ్‌ఎంసీకి జమ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## ఉద్యోగం కోసం ఎనిమిదేళ్లు.. వేతనం కోసం మూడేళ్లు..

### మనస్తాపంతో వీఆర్‌ఏ ఆత్మహత్య

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట మృతదేహంతో ధర్నా

**మంథని:** వారసత్వం కింద రావాల్సిన ఉద్యోగం కోసం ఎనిమిదేళ్లు.. వేతనం కోసం మూడేళ్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వీఆర్‌ఏ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గువ్వల రామక్క వారసత్వంగా వీఆర్‌ఏ ఉద్యోగాన్ని ఆమె మనువడు గువ్వల మహేందర్ (27)కు కేటాయిస్తూ మూడేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ ప్రొసీడింగ్ జారీ చేశారు. అప్పటి నుంచి మహేందర్ మంథని తహసీల్దార్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్నాడు. ఈ ఉద్యోగం కోసం అతను ఎనిమిదేళ్లు కాళ్లరిగేలా తిరిగి సాధించాడు. అయితే.. వేతనం కోసం మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఇవ్వకపోవడంతో ఓసారి పురుగుల మందు డబ్బాతో కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎప్పటికైనా వేతనం రాకుండా పోతుందా అనే ఆశతో అప్పులు చేశాడు. అయితే.. మూడేళ్లుగా అధికారులు ఎటూ తేల్చకపోవడం.. మరోవైపు రుణదాతల ఒత్తిడి ఎక్కువ కావడంతో కలత చెందిన మహేందర్.. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో పొలం వద్దకు వెళ్లి తాను చనిపోతున్నానని సోదరుడు రాజుకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకునే సరికి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో మహేందర్‌ను ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.


మహేందర్ (ఫైల్)

**మృతదేహంతో ధర్నా**

కాగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మహేందర్ చనిపోయాడని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు బైఠాయించారు. ఇద్దరు అధికారులు అందుబాటులో లేకపోవడంతో మంథని సీఐ, ఎస్సై హామీతో వారు ఆందోళన విరమించారు. కాగా, మహేందర్ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు.

## సాఫ్ట్‌నెట్ ద్వారా ప్రజాప్రతినిధులకు శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** ఆగస్టు 1 నుంచి డిసెంబర్ చివరి వరకు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులకు సొసైటీ ఫర్ తెలంగాణ స్టేట్ నెట్‌వర్క్ (సాఫ్ట్‌నెట్) నిపుణ ఛానెల్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీఎస్‌ఐఆర్‌డీ) సిద్ధమవుతోంది. ఆరు నెలల క్రితమే గ్రామ పంచాయతీ ఎన్నికలు, ఇటీవల మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ముగిసి కొత్త పాలక మండళ్లు ఏర్పడిన నేపథ్యంలో వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో భాగంగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులకు సాఫ్ట్‌నెట్ కేబుల్ టీవీ ప్రసారాల ద్వారా ప్రతి గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు టీఎస్‌ఐఆర్‌డీ ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసం అన్ని మండల పరిషత్‌లు, ఎంపీపీలు, ,గ్రామ పంచాయతీల్లో ప్రసారాల కోసం కేబుల్ టీవీలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించింది.

**షెడ్యూల్ ఇదీ:** ఆగస్టు 1న హరితహారం, 8న స్వచ్ఛ భారత్, ఓడీఎఫ్, 22న జాతీయ ఉపాధి హామీ, 29న కొత్త పంచాయతీరాజ్ చట్టం, సెప్టెంబర్ 5న పంచాయతీ, ఎంపీపీ, జెడ్పీపీల్లో నిర్వహించే పనులు, 12న కేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యక్రమాలు, 19న మండల ప్రజాపరిషత్ సమావేశాలు, 26న ఎంపీపీల విధులు, బాధ్యతలు, అక్టోబర్ 3న జెడ్పీపీ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ మీటింగ్‌లు, 10న జెడ్పీపీల విధులు, బాధ్యతలు ఇలా డిసెంబర్ ఆఖరు వరకు వివిధ అంశాలపై సాఫ్ట్‌నెట్ ద్వారా తరగతులు నిర్వహించేందుకు టీఎస్‌ఐఆర్‌డీ షెడ్యూల్‌ను రూపొందించింది.

## 27 లక్షల హెక్టార్లలో పంటల సాగు

### వరి మినహా సాగు సంతృప్తికరం

### పదేళ్ల పంటల వివరాలు ఇవ్వాలని అధికారులకు సీఎస్ ఆదేశం


ఎస్‌కే జోషి

**సాక్షి, హైదరాబాద్:** వర్షాకాల సీజన్‌లో 27 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారని, వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో ఆగస్టులో మంచి వర్షాలతో పంటల సాగు సాధారణ స్థితికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. గురువారం సచివాలయంలో వాతావరణ పరిస్థితులు, పంటల పరిస్థితి, రైతు బీమాపై అధికారులతో సీఎస్ సమీక్షించారు. వివిధ జిల్లాలలో పంటల సాగు మొత్తం ఖరీఫ్ సీజన్ సాధారణ విస్తీర్ణంలో 64 శాతం వరకు చేరుకుందని, వరి మినహా మిగతా పంటల సాగు ప్రస్తుతం సంతృప్తికరంగా ఉందని అధికారులు సీఎస్‌కు వివరించారు. అదే విధంగా ఐదు జిల్లాలలో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా జిల్లాలలో వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంటల ప్రస్తుత పరిస్థితి, విత్తనాలు, ఎరువుల లభ్యతపై సీఎస్ ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్‌లలో సరైన ఇన్‌ఫ్లోలు లేవని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, పంటల సాగుపై ఆగస్టు 13న మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. గత పదేళ్లకు సంబంధించి జిల్లాల వారీగా పంటలు ఎలా పండాయో, భూగర్భ జలాలు, రిజర్వాయర్ల నీటి మట్టాల పరిస్థితిపై నెలల వారీగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## కామెంట్ చేస్తే కటకటాలే!

- పదేళ్ల చిన్నారిపై కామెంట్ చేసిన వారికి జైలు శిక్ష
- చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు తీర్పు

**సాక్షి, హైదరాబాద్:** 'ఈ పిల్ల చూడు మస్తుగ ఉంది..'ఈ కామెంట్ చేసిన వారికి నగరంలోని చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు ఏం శిక్ష విధించిందో తెలుసా? 14 నెలల జైలు శిక్ష! చిన్నారులపై జరిగే నేరాలనే కాదు.. వారిపై చేసే అనుచిత వ్యాఖ్యల్నీ న్యాయస్థానాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయని అనడానికి ఈ ఉదంతమే సాక్షి. పదేళ్ల చిన్నారిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్య చేసిన ఇద్దరిపై నమోదైన కేసును విచారించిన న్యాయస్థానం ఓ నిందితుడిని దోషిగా తేలుస్తూ 14 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మరొకరు పరారీలో ఉండటంతో అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

**2013లో ఏం జరిగిందంటే..**

వెస్ట్ మారేడ్‌పల్లిలోని సామ్రాట్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బాలిక (10) కుటుంబం నివసిస్తోంది. దీనికి ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లో కె.వెంకట్రామిరెడ్డి (41), అతడి స్నేహితుడు ఉండేవారు. వీరిద్దరూ సినీ రంగంలో కార్మికులుగా పనిచేస్తున్నారు. 2013 నవంబర్ 3న దీపావళి నేపథ్యంలో ఆ బాలిక తమ ఇంటి ముందు టపాకాయలు కాలుస్తోంది. బాలికను చూస్తూ విచక్షణ కోల్పోయిన వారిద్దరూ 'ఆ పిల్ల చూడు మస్తుగ ఉంది'అని కామెంట్ చేశారు. ఇది విన్న బాలిక తండ్రి అభ్యంతరం వ్యక్తం చేయగా.. ఆయనతో ఘర్షణకు దిగిన వారిద్దరూ ప్రాణాలు తీస్తామంటూ బెదిరించి జారుకున్నారు. ఇదిలా ఉండగా వారిద్దరూ వ్యభిచారం నిర్వహిస్తున్నారని కొందరు చెప్పడంతో బాలిక తండ్రి, మరో వ్యక్తి కలిసి వెంకట్రామిరెడ్డి సెల్‌ఫోన్ నంబర్ తీసుకున్నారు. విటుల మాదిరిగా ఫోన్ చేయగా లక్ష్మీనగర్ చౌరస్తాకి రమ్మని చెప్పాడు. అక్కడ బాలిక తండ్రిని చూసి వారిద్దరూ పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికుల సాయంతో పట్టుకుని చితకబాదారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు వీరిపై ఐపీసీలోని 509, 506లతో పాటు పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) యాక్ట్‌లోని 12 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉండగా వెంకట్రామిరెడ్డిపై



హాకా భవన్‌లోని చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు వేరుగా విచారణ జరిపింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు 'ఆ పిల్ల చూడు మస్తుగ ఉంది'అని అన్నందుకు పోక్సో యాక్ట్ కింద వెంకట్రామిరెడ్డిపై నేరం నిరూపణ కావడంతో దోషిగా ప్రకటించింది. అతడికి 14 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సునీత తీర్పు ఇచ్చారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని పట్టుకోవడానికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. కాగా, ఈ తీర్పు చిన్నారులు, మహిళలు, యువతుల్ని అభ్యంతరకర కామెంట్లు చేస్తూ వేధించే వారికి ఓ హెచ్చరిక లాంటిదని అధికారులు వ్యాఖ్యానించారు.


సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED URGENTLY
GYNAECOLOGISTS M.S.,/D.G.O.
Terms & Conditions Negotiable
RADHAKRISHNAN HOSPITALS
B.T.Seeta Infertility Centre
ROJA LINE, PRAKASH NAGAR, KURNOOL.
Whatsapp / Cell: 94402 51360
email: krishnanradha493@gmail.com.

XCEL
Right Path :: Right Life
www.xcelgroupindia.com
Walk in Interview
Freelance Sales Professionals Required
We are seeking dynamic and enthusiastic Freelance Sales Professionals to promote our Industry-Leading Jobs-Matching & Recruitment Services in Telangana. Graduates with or without experience can apply. No age limit. M/F. Good communication skills are a must.
Graduates (MBA) with 2-3 years experience (preferably Education and Insurance Sectors) or those with previous experience in the Recruitment Industry are highly preferred.
We Offer: Full Training & Support, Attractive incentives - Best in the Industry.
The opportunity to work alongside some of the best-known companies in India Be a part of the Jobs Revolution!
Walk-in or send your resume.
TERREXO OFFICIAL BRANDING PARTNER
XCEL Institute of Management & Career Counceling
Corp. off: # 118, Maheswari Chambers (1st floor)
Somajiguda, Hyd. Ph: 040 - 48557557 / 40112444.
Email: info@xcelgroupindia.com

Looking for Ad Professionals with a Drive to Excel
As we embark on a mission to streamline our operations and expand our horizons, we are looking for Ad Professionals who are result-oriented and driven by the zeal to excel to work at the following of our branches at HYD, KMM, VZG, KKD, RJY, ELR, VJA, GNT, ONG, NLR, TPT.
DGM, AGM, RM & BM
PG / MBA with proven competence in administration, business promotion credit control, Accounts, Exp. 10 yrs in mktg/Admin., Age: 35-45 yrs
HR Manager (For Gnt, Vja, Hyd & VZG)
MHRM / MBA (HR), 10 yrs Exp. with Admin Skills. Age : 33 to 45 yrs
Business Managers / Executives
PG/Graduates with 6 yrs exp. in Mktg., two wheeler is a must. Age: 28-35 yrs
Accounts Managers / Accountants
B.Com / M.Com with 10 yrs exp., well-versed in Computer Accounting Procedures
Personal Secretary to M.D.
Post Graduation in English / Telugu, Clarity of Vision and work efficiency, 10 yrs exp., Computer knowledge is a must. Age: 32 to 38 yrs
Copywriters cum Proof Readers
MA Telugu / English, Preference to Journalism background, and similar experience. Age: 30-45 yrs
Art Directors - Hyd, Gnt, VJA & VZG
Qualified professionals with good designing skills - from conceptualization to execution - and previous ad agency exp. on Mac Platform. Age: 33-45 yrs
Graphic Designers / DTP Operators
Inter / Degree ability to handle Indesign, Photoshop, Illustrator & QuarkXpress on Mac Platform, Telugu Typing is a must., 8 yrs exp., Age: 28-35 yrs
Interested Candidates may send their Resume along with Photo & Certificates to hoadvtjobs@gmail.com
KALYANI ADS www.kalyaniads.com ✆ 98489 13116

SyndicateBank
www.syndicatebank.in
ఎక్కువ చెల్లించడం ఎందుకు?
సిండికేట్‌బ్యాంక్ గృహ రుణానికి మారండి - తగ్గించిన ఈఎంఐల ద్వారా డబ్బు ఆదా చేసుకోండి
8.60% p.a.
టాప్-అప్ సదుపాయం





సిండికేట్ టేక్- ఓవర్ ప్రత్యేకతలు
• ఈజీ ప్రాసెసింగ్ – వేగవంతమైన రుణ మంజూరు
• ప్రాసెసింగ్ – డాక్యుమెంటేషన్ ఛార్జీల రద్దు
• ముందస్తు- చెల్లింపు ఛార్జీలు ఉండవు
టోల్ ఫ్రీ: 1800 3011 3333 | 1800 208 3333

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
టెండరు ప్రకటన : తేది.16.07.2019
NIT Ref. No. 28 to 42/DMFT & 2BHK/19-20 (1వ పిలుపు)P.R. రీజియన్, వరంగల్‌లో 2BHK ఇళ్ళ నిర్మాణము, రోడ్డు పనుల నిర్మాణము చేపట్టేందుకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : రూ.4127.44 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది : 01.08.2019 సా.9.00గం. నుండి 14.08.2019 మ.3.00గం. వరకు. ఫోన్ నం. 0870–2578114. తదుపరి వివరాల కోసం www.eprocurement.gov.in ను దర్శించండి.
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్
DIPR RO. No.729-DP/CL/ADVT/1/2019-20, Dt: 25.7.2019

తెలంగాణ ఫుడ్స్, IDA నాచారం, హైదరాబాద్ - 500076
ఫోన్: 27152207, 08 & 09
నోటిఫికేషన్ నం. TF/GG/Tenders/286/RM/స్పైసెస్ & ప్యాకింగ్ మెటీరియల్స్ 2019–20
మెసర్స్ తెలంగాణ ఫుడ్స్ కోసం రా మెటీరియల్స్ స్పైసెస్ మరియు ప్యాకింగ్ మెటీరియల్స్ సేకరణ కోసం వివిధ ఏజెన్సీల నుండి తెలంగాణ ఫుడ్స్ టెండర్లు కోరుతోంది. వివరాల కోసం వెబ్ సైట్ https://tender.eprocurement.gov.in ను 26.07.2019 మ.1.00గం. నుండి దర్శించండి. బిడ్ల దాఖలు ముగింపు తేది 08.08.2019న సా. 5.00గం.వరకు.
సం/– జనరల్ మేనేజర్, తెలంగాణ ఫుడ్స్ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ) నాచారం, హైదరాబాద్–500076
DIPR RO. No.270-PP/CL/Advt/1/2019-20, Dt: 25.07.2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ, ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 7/2019-20 తేది:22.07.2019
పని వివరణ : ఖమ్మం టౌన్ వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనం నిర్మాణము. ECV: రూ 10.10 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల జారీ: 26.07.2019 నుండి 02.08.2019 మ. 3.00 గం. వరకు . దాఖలు కోసం ఆఖరు తేది మరియు సమయం: 02.08.2019 మ. 3.30గం॥ వరకు. బిడ్ తెరుచు తేది: 02.08.2019 సా.4.00గం. తరువాత 2) NIT No. 8/2019-20, తేది. 23.07.2019. పని వివరణ: ఖమ్మం జిల్లాలోని ఖమ్మం వద్ద జిల్లా కోర్ట్ కాంప్లెక్స్ ఆవరణలో మరమ్మతు పనులు. ECV: రూ 24.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల జారీ: 30.07.2019 నుండి 06.08.2019 మ. 3.00 వరకు. దాఖలు కోసం ఆఖరు తేది మరియు సమయం: 06–08–2019 మ. 3.30గం వరకు. బిడ్ తెరుచు తేది: 06.08.2019 సా. 4.00గం. తరువాత ఫోన్ నం.: 9440818085. తదుపరి వివరాలు ఇప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement లో చూడవచ్చును సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, R&B డివిజన్, ఖమ్మం
DIPR RO. No. 739-DP/CL/Advt/1/2019-20, Dt: 25.7.2019

TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSEAMCET-2019 (Bi.P.C. STREAM) ADMISSION NOTIFICATON
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING
The Qualified candidates of TSEAMCET-2019 (Bi.P.C) desirous of seeking Admission into B. Pharmacy, Pharm D and Bio-Technology Courses are informed that the Admission counselling process will commence on 31-07-2019. Minority candidates who have not qualified or not appeared in TSEAMCET-2019 (Bi.P.C), but passed and secured required percentage of marks in qualifying examination can also attend for counselling to consider them for admission into minority colleges in leftover vacancies. further details and counselling schedule, can be seen in the website : https://tseamcetb.nic.in on 30-07-2019.
Date : 24.07.2019 Navin Mittal, IAS
Place : Hyderabad Convenor, TSEAMCET-2019 (Bi.P.C) & CTE
DIPR RO. No.734-DP/CL/ADVT/1/2019-20, Dt: 25.7.2019

# ఖాళీ చేయాలని ఆర్ అండ్ బీ చెప్పిందా?

## స్వయంగా వచ్చి వివరణ ఇవ్వాలని ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఆదేశం

- ఎర్రమంజిల్ భవనాల కేసు నేటికి వాయిదా
- విధానపరమైన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోకూడదని 'సుప్రీం' తీర్పు చెప్పింది: ఏజీ
- తీర్పును ఉదహరించి మంచిపని చేస్తున్నారు: ఏజీని అభినందించిన ధర్మాసనం



**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీ భవనాలు వినియోగానికి యోగ్యంగా లేవని ఆర్అండ్‌బీ శాఖ ఇచ్చిన నివేదిక గురించి స్వయంగా వివరించేందుకు ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి శుక్రవారం జరిగే విచారణకు హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. ఆర్అండ్‌బీ నివేదిక ఇచ్చి ఉంటే.. అసెంబ్లీ భవనాలు ఎంతకాలం వినియోగానికి యోగ్యంగా ఉన్నాయి, భవనం ఖాళీ చేయాలని నివేదికలో ఉందా, కొత్త అసెంబ్లీ నిర్మాణానికి సంబంధించి ఎంత స్థలం కావాలి, నిర్మాణ ప్రణాళిక వంటి విషయాలను వివరించేందుకు స్వయంగా హాజరుకావాలని ఆయనను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చి రాష్ట్ర చట్టసభల భవన సముదాయాన్ని నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట గురువారం కూడా వాదనలు జరిగాయి. ఏ నిబంధనల మేరకు ఇప్పుడున్న అసెంబ్లీ భవనాలను వినియోగించరాదని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేబినెట్ అజెండాలో పొందుపర్చిన అంశాలు తెలియజేయాలని పేర్కొంది. కొత్త అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో, ఎంత స్థలంలో నిర్మిస్తారో, భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన ఏవిధంగా చేశారో వివరించాలని కోరింది. ఇప్పుడున్న అసెంబ్లీ భవనాలు నిజాం కాలంలో నిర్మించినవని, టౌన్‌హాల్ నిమిత్తం నిర్మించిన వాటిలో అసెంబ్లీ కొనసాగుతోందని ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదించారు. ఆర్అండ్‌బీ అధ్యయనంలో అసెంబ్లీ భవనాలు సురక్షితంగా లేవని తేలిందన్నారు. 'పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదా'అని ధర్మాసనం అడిగిన ప్రశ్నకు ఏజీ సమాధానం ఇస్తూ 'ఇప్పటికే పలుమార్లు మరమ్మతులు చేయడం జరిగింది, అదే మాదిరిగా కొనసాగించడం క్షేమదాయకం కాదు'అని అన్నారు. ఎర్రమంజిల్ పురాతన భవనాల జాబితాలో లేదని, అక్కడ శాసనసభ భవనాల సముదాయాన్ని నిర్మించాలనేది ప్రభుత్వ విధాన నిర్ణయం కాబట్టి న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదని గట్టిగా చెప్పారు. విధానపరమైన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవడం తగదంటూ సుప్రీంకోర్టుతో పాటు, రాజస్థాన్ హైకోర్టు తీర్పులను ఆయన ఉదహరించగా, ఇలాంటి తీర్పును ఉదహరించి మంచిపని చేస్తున్నారని అదనపు ఏజీని ధర్మాసనం అభినందించింది.

అసెంబ్లీ నిర్మాణానికి ప్లానింగ్ లేకుండా హెచ్ఎండీఏ నుంచి అనుమతి తీసుకోలేమని అదనపు ఏజీ చెప్పగానే.. ఎవరైనా ఇల్లు నిర్మించుకోవాలంటే ఇంజినీర్ దగ్గరకు వెళ్లి ఫలానా సౌకర్యాలు ఉండేలా ప్లాన్ వేయించుకుంటారని, ఇక్కడేమో ప్లానే లేదని ప్రభుత్వం చెబుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై అదనపు ఏజీ కల్పించుకుని.. ప్లాన్ రూపొందించాలని హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి ప్రాంతాలకు చెందిన కన్సల్టెన్సీలకు బాధ్యతలు ఇచ్చామని, దీనిపై ప్రభుత్వానికి కూడా సమాచారం లేదన్నారు. ఎన్ని ఎకరాల భూమి అవసరమని నిర్ణయించారనే ప్రశ్నకు.. 17 ఎకరాల్లో నిర్మించాలని యోచిస్తున్నామని, ఇప్పుడున్న చట్టసభ సభ్యుల సంఖ్య మరో పాతికేళ్లకు రెట్టింపు కావచ్చునని, అప్పటి అవసరాలకు అనుగుణంగా, కారు పార్కింగ్, అధికారిక సమావేశాలకు వీలుగా కొత్త చట్టసభల సముదాయాన్ని నిర్మించాలన్నది ప్రభుత్వ విధానమని అదనపు ఏజీ బదులిచ్చారు. కన్సల్టెన్సీల నుంచి ప్లాన్‌లు వచ్చాక వాటిలో ప్రభుత్వం ఆమోదించే దాని ఆధారంగా హెచ్ఎండీఏ నుంచి అనుమతి తీసుకుంటామని చెప్పారు. విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.



## సైకిల్ వీల్ గొర్రు..!

పత్తి చేనులో కలుపు తీయడం ఒడవని.. తీరని పనే అని చెప్పాలి. ఇటు పశువులు లేక, అటు కూలీలు దొరక్కపోతే.. ఇంకేముంది ఇంటిల్లిపాదీ చేనులోకి దిగాల్సిందే. అయితే ఆ పనిని తానొక్కడే కొంచెం తేలికగా ఎందుకు చేసుకోకూడదు.. అని అనిపించింది ఓ రైతుకు.. ఇంకేముంది బాగా ఆలోచించి చిన్నపిల్లలు ఆడుకునే సైకిల్‌కుండే చక్రం, చిన్న ఇనుప ముక్కలు, ఓ రాడ్ కలిపి వెల్డింగ్ షాపులో ఇలా ఓ గొర్రు యంత్రం చేయించాడు. దానితో ఎవరి సాయం లేకుండానే తన పనికానిస్తున్నాడు. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపురం మండలం గూనిపర్తికి చెందిన రైతు కూచన నర్సింగం ఇలా సైకిల్ వీల్ గొర్రును రూపొందించాడు. దీని తయారీకి రూ.3,200 ఖర్చయినట్లు చెప్పాడు.

*– సంపెట వెంకటేశ్వర్లు, వరంగల్ అర్బన్ జిల్లా*

## రేపట్నుంచి ఇంటింటికీ కాంగ్రెస్: ఉత్తమ్



**సాక్షి, హైదరాబాద్:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ నెల 27 నుంచి 30 వరకు ఇంటింటికీ కాంగ్రెస్, వాడవాడలా కాంగ్రెస్ జెండా కార్యక్రమాన్ని నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త తన ఇంటిపైన, ప్రతి వాడలోనూ పార్టీ జెండాను అవిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల కోసం శుక్రవారం అన్ని మున్సిపల్ కేంద్రాల్లో కార్యకర్తలు సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఆ నిధులను రాష్ట్రం వినియోగించుకోలేదు

### మాజీ మంత్రి, బీజేపీ నేత డీకే అరుణ



**సాక్షి, హైదరాబాద్:** గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నిధులను ఇస్తున్నా వినియోగించుకోలేని రాష్ట్రం మన దేనని మాజీ మంత్రి, బీజేపీ నేత డీకే అరుణ పేర్కొన్నారు. సర్పంచుల ఎన్నికలు పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా నూతన చట్టం ప్రకారం చెక్ పవర్ అందించే ప్రక్రియను పూర్తి చేయలేదని, సర్పంచ్‌ల అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం హరించి వేసిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2015 నుంచి కేంద్రం రూ.వేల కోట్లను గ్రాంట్స్ రూపంలో ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోలేదని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, బోర్లు వేసుకుందామనుకుంటే నిధులు డ్రా చేసే పరిస్థితి సర్పంచులకు లేకుండా పోయిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. చెక్ పవర్ ముగ్గురి మధ్య ఉండటం వల్ల అభివృద్ధి కుంటుబడే అవకాశం ఉందన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌కు కలిపి చెక్ పవర్ ఇవ్వడం వల్ల ఇబ్బందులు వస్తాయన్నారు. సర్పంచ్‌లు ఏకగ్రీవంగా గెలిచిన గ్రామాలకు ఇప్పటివరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. హరితహారం కింద నాటిన మొక్కలు, అందులో బతికి ఉన్నవి ఎన్నో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నేతలు సుభాష్, సుధాకరశర్మ పాల్గొన్నారు.

## గవర్నర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

### మున్సిపల్ బిల్లును తిప్పి పంపడంపై కె.లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మున్సిపల్ బిల్లుకు సవరణలు చేయాలని గవర్నర్ నరసింహన్ తిప్పి పంపించడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ బిల్లు అప్రజాస్వామిక, నియంతృత్వ పోకడలతో కూడుకొని ఉందని తెలిపారు. రాజ్యాంగంలోని 73, 74 సవరణలకు తూట్లు పొడిచేలా మున్సిపల్ చైర్మన్లను తొలగించే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇవ్వడం సరికాదన్నారు. దొడ్డి దారిన ఆర్డినెన్స్ కాకుండా, తిరిగి అసెంబ్లీలోనే చర్చించి సవరణలు చేయాలని సూచించారు. చింతమడక తరహాలోనే అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఆర్థిక సాయం అందించాలన్నారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారన్నారు. అనేక గ్రామాల్లో రోడ్డు సదుపాయాలు లేక గర్భిణిలను కట్టెలపై మోసుకుంటూ ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితులున్నాయన్నారు. సీఎం దత్తత తీసుకున్న అంకాపూర్ గ్రామస్తులు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం సీఎంను కలవడానికి వస్తే వారిని అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు.

# గ్యాస్ ఉంటే కిరోసిన్ కట్

- 8,160 లీటర్ల నుంచి 3,576 లీటర్ల మేర కేంద్ర కోటా తగ్గింపు
- దీపం కనెక్షన్‌దారులు, ఎల్పీజీ లేనివారికి యథావిధిగా కొనసాగింపు
- అందుకనుగుణంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని పేదలకు చేరాల్సిన రాయితీ కిరోసిన్ పక్కదారి పడుతున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దశలవారీగా కిరోసిన్ పంపిణీని ఎత్తివేసే చర్యల్లో భాగంగా కోటాను గణనీయంగా తగ్గించింది. రాష్ట్రానికి సరఫరా చేస్తున్న కిరోసిన్ కోటాను కేంద్రం తగ్గించడంతో దానికి అనుగుణంగా రాష్ట్రం ఎల్పీజీ దారులకు కిరోసిన్ సరఫరాను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 87 లక్షల రేషన్ కార్డులుండగా, 2.79 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్కో కార్డుపై నెలకు లీటర్ కిరోసిన్‌ని రూ.29కి ఎల్పీజీ, దీపం కనెక్షన్లు ఉన్న అందరికీ సరఫరా చేస్తున్నారు. నిజానికి లీటర్ కిరోసిన్ ధర రూ.40 మేర ఉండగా, రూ.11 మేర కేంద్ర ప్రభుత్వం రాయితీ భరిస్తోంది. రాష్ట్రంలో ప్రతి నెలా కేంద్రం 8,160 లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తోంది. అయితే ఈ నెల నుంచి కోటాను 3,576 లీటర్లకు తగ్గించింది. దీంతో కిరోసిన్‌ను పూర్తిస్థాయిలో సరఫరా చేయడం కష్టతరంగా మారింది. తగ్గించిన కోటాకు అనుగుణంగా ఎల్పీజీ దారులకు ఈ సరఫరాను ఆగస్టు నుంచి పూర్తిగా నిలిపివేస్తూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సభర్వాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీపం కనెక్షన్ దారులకు, ఎల్పీజీ కనెక్షన్ లేనివారికి యథావిధిగా కిరోసిన్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. దీనికి అనుగుణంగా జిల్లాల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం దేశంలోనూ, రాష్ట్రంలోనూ నూటికి 95 శాతం మంది దీపం, వంట పొయ్యిలు వాడటం లేదు. దాదాపు ప్రతి ఒక్కరికీ గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నా యి. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాయితీ సరఫరాను పూర్తిగా నిలిపివేయాలని కేంద్రం భావించింది. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థిక సలహాదారు సైతం ప్రభుత్వానికి తమ సిఫారసులు పంపారు. అయితే ఒకేమారు కాకుండా విడతల వారీగా దీన్ని ఎత్తివేసే అవకాశముందని పౌరసరఫరా శాఖ వర్గాలు వెల్లడించాయి.

## తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

### సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో ముగ్గురు న్యాయమూర్తుల నియామకానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టి.వినోద్‌కుమార్, ఎ.అభిషేక్‌రెడ్డి, కె.లక్ష్మణ్ పేర్లను న్యాయమూర్తుల పోస్టులకు కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానం చేసింది. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు ఆర్.రఘునందన్‌రావు, బట్టు దేవానంద్, డి.రమేశ్, ఎన్.జయసూర్యలను సిఫారసు చేసింది. ఉమ్మడి హైకోర్టులో అప్పటి హైకోర్టు కొలీజియం 2018 అక్టోబర్ 9న ఈ ఏడుగురు పేర్లను న్యాయమూర్తుల పోస్టులకు సిఫారసు చేసింది. అనంతరం సుప్రీంకోర్టు కొలీజియం వీరి నియామకాలకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి, గవర్నర్ అభిప్రాయాలను తీసుకుంది. అలాగే ఏపీ, తెలంగాణ హైకోర్టు వ్యవహారాలతో పరిచయమున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అభిప్రాయాలను సైతం తెలుసుకుంది. తాజాగా ఈ ఏడుగురితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణలతో కూడిన కొలీజియం గురువారం ముఖాముఖి సమావేశమైంది. అనంతరం రెండు రాష్ట్రాల హైకోర్టులకు వీరి పేర్లను సిఫారసు చేసింది.

# 2న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- వీఆర్వోల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం
- సీఎం వ్యాఖ్యలు బాధాకరం.. సామాజిక భద్రత కోల్పోయాం

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ ఉద్యోగులను చులకన చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేర్కొంది. వీఆర్వోలను లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేయడంతో సామాజిక భద్రతను కోల్పోయామని వాపోయింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ వీఆర్వోల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఇప్పటికే వర్క్ టు రూల్‌ను పాటిస్తున్న వీఆర్వోలు.. ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఆగస్టు 2న అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేయాలని తీర్మానించినట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గరికె ఉపేంద్రరావు, హరాలే సుధాకర్‌రావు తెలిపారు. ధరణిలో సాంకేతికపరమైన లోపాలు, సమగ్ర భూ సర్వే నిర్వహించకపోవడం, వివాదాస్పద భూముల సమస్యలకు పరిష్కార మార్గం కనుగొనకపోవడం.. రాష్ట్ర మొత్తం ఒకే సర్వర్‌పై 584 మండలాలు, 11,673 రెవెన్యూ గ్రామాల భూముల వివరాలను ఏకకాలంలో ఇంటర్నెట్‌లో నమోదు చేయడంలో తలెత్తిన ఇబ్బందులకు వీఆర్వోలను బాధ్యులను చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. భూరికార్డుల ప్రక్షాళనను శాస్త్రీయంగా చేయకుండా గడువు నిర్దేశించడమే ఈ లోపాలకు కారణమని అన్నారు. ఆఖరికి తహసీల్దార్‌కు ఉన్న అధికారాలను రికార్డుల ప్రక్షాళనలో ఆర్డీఓ, జేసీలకు కట్టబెట్టడంతో త్వరితగతిన సమస్యలు పరిష్కారం కాలేదని, దీనికి తోడు రైతు బంధు, రైతు బీమా ప్రకటించడం.. వీటికి పాస్‌పుస్తకాలు తప్పనిసరి కావడంతో రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి పెరిగిందని అన్నారు. ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా అవినీతిపరులుగా చిత్రీకరించడం ఆవేదనకు గురిచేసిందని, గ్రామ బాధ్యతలు, సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించే వీఆర్వోలను ఇతర శాఖల్లో విలీనం చేస్తామని సంకేతాలివ్వడంతో ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీఆర్వో వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆత్మగౌరవ పోరాటానికి అండగా నిలవాలని ఉపేంద్రరావు, సుధాకర్‌రావు కోరారు.

# ప్రతిఘటన పోరాటాలే శరణ్యం

- రాజ్యాంగ పరిరక్షణపై పలువురు వక్తలు
- రాజ్‌బహదూర్ గౌర్ శత జయంతి ఉత్సవాల ముగింపు
- గౌర్ సమావేశ మందిరాన్ని ప్రారంభించిన సురవరం, విగ్రహం ఆవిష్కరించిన బూర్గుల నరసింగరావు

సాక్షి, హైదరాబాద్

రాజ్యాంగ పరిరక్షణతో పాటు లౌకికవాదం, ప్రజాస్వామ్య రక్షణకు ప్రతిఘటన పోరాటాలే శరణ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలో రోజు రోజుకు ఫాసిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని, దీనిపై పోరాటం చేయడం ద్వారానే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మికనేత డా.రాజ్‌బహదూర్ గౌర్‌కు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు. ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం రాజ్‌బహదూర్ గౌర్ శత జయంతి ఉత్సవాల ముగింపు సభలో సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ..గౌర్ స్ఫూర్తిదాయక నాయకుడని, తెలంగాణ సాయుధ పోరాటంలో గొప్ప పాత్రను పోషించారని కొనియాడారు. మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, మోదీ అభిప్రాయాలతో ఏకీభవించని వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని పేర్కొన్నారు. దళితులు, మేధావులు, ఆలోచనపరులపై దాడులు పెరుగుతున్నాయని ప్రతిఘటన లేకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేమన్నారు. ఏఐటీయూసి జాతీయ ప్రధానకార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ మాట్లాడుతూ..జీవితాన్ని కార్మికోద్యమానికి ధారపోసిన గొప్పయోధుడు గౌర్ అని అన్నారు. అంతకుముందు మఖ్దూం భవన్‌లో ఆవరణలో నిర్మించిన రాజ్‌బహదూర్‌గౌర్ సమావేశ మందిరాన్ని గురువారం ఉదయం సురవరం సుధాకరరెడ్డి ప్రారంభించగా, అక్కడ ఏర్పాటు చేసిన గౌర్ విగ్రహాన్ని బూర్గుల నరసింగరావు ఆవిష్కరించారు. త్యాగధనులు, పోరాట యోధుల త్యాగాలు, స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరముందని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కార్మికోద్యమ నిర్మాత గౌర్ అని నరసింగరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌర్ జయంతి ఉత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకరరావు, కోశాధికారి డా. డి.సుధాకర్, గౌర్ సోదరి అవదేశ్‌రాణి, ఏపీ సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ నాయకులు అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌బహదూర్ గౌర్ శత జయంతి ఉత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న సురవరం

# భావితరాల కోసమే ముందడుగు

- ఆల్మట్టి ఎత్తు పెంచే పనులు పూర్తయితే కృష్ణా బేసిన్‌లో ఆయకట్టు ఎండమావే
- కేసీఆర్‌తో కలిసి గోదావరి జలాల తరలింపే ఇందుకు ప్రత్యామ్నాయం
- శాసనసభలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

**సాక్షి, అమరావతి:** 'తెలుగువాళ్లం ఎక్కడ ఉన్నా సరే ఇచ్చిపుచ్చుకునే గుణం ఉండాలి. కలిసి పని చేసుకునే వాతావరణం ఉండాలి. ఒకరికి తోడుగా మరొకరు నిలబడాలి. నిజంగా ఆ భావన రావడం సంతోషం. తెలుగు రాష్ట్రాల భావితరాల ప్రయోజనాల కోసమే శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు గోదావరి జలాలను తరలించాలని నేను.. తెలంగాణ సీఎం కేసీఆర్ నిర్ణయించాం. తెలంగాణ భూభాగం నుంచి గోదావరి జలాలను తరలిస్తే అవి మన వరకూ వస్తాయా? అంటూ ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన సందేహాలు సహేతుకమైనవే. నిజంగా నీళ్లు రావు అనుకున్నప్పుడు ఇద్దరు ముఖ్యమంత్రులూ కలిసి ఎందుకు ముందడుగు వేయాలని అనుకుంటారు? మనం తీసుకునే నిర్ణయం వల్ల భావితరాలపై ప్రభావం ఉంటుంది. నిర్ణయం తీసుకోకపోవడం కూడా భావితరాలపై ప్రభావం చూపుతుందనే విషయాన్ని మరచి పోకూడదు. రాష్ట్రానికి మంచి చేయాలనే ఆరాటంతోనే నిర్ణయాలు తీసుకుంటున్నాం.. మంచి జరగదని అనుకుంటే ఆ పని ఎందుకు చేస్తాం? కచ్చితంగా చేయం'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయానికి గోదావరి జలాలు తరలిస్తే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న ఈర్ష్యతోనే ప్రతిపక్ష సభ్యులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గోదావరి జలాల మళ్లింపుపై శాసనసభలో గురువారం జరిగిన స్వల్ప కాలిక చర్చలో జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిలు మాట్లాడిన తర్వాత సీఎం వైఎస్ జగన్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే..



### తెలంగాణతో సఖ్యత అవసరం

'ఇవ్వాళ్టి నుంచి పది సంవత్సరాలు ముందుకు వెళ్తే.. ఎలా ఉంటుందో ఊహించుకోవడానికే భయం వేస్తుంది. నీటి వినియోగం పెరుగుతోంది. నీటిపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోంది. మరో వైపు నీటి లభ్యత తగ్గుతోంది. కృష్ణా నది నుంచి శ్రీశైలంలోకి 1,200 టీఎంసీలకు గాను 400 టీఎంసీలు కూడా రావడం లేదు. గత పది సంవత్సరాల లెక్కలను ఒకసారి పరిశీలిస్తే.. సగటున ఏడాదికి 600 టీఎంసీలు మాత్రమే శ్రీశైలానికి వచ్చాయి. గత ఐదేళ్లలో శ్రీశైలానికి వచ్చిన నీళ్లు 400 టీఎంసీలకు పడిపోయాయి. ఆల్మట్టి జలాశయం ఆనకట్ట ఎత్తును 519 నుంచి 524 మీటర్లకు పెంచే పనులు పూర్తయితే పరిస్థితి ఏమిటని ఆలోచన చేస్తేనే భయం వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వంతో సఖ్యతగా ఉండటం ఎంత అవసరమో మనందరం ఆలోచించాలి. ఒక్కటైతే చెప్తున్నా.. కేసీఆర్ మంచి వారు.. మంచి చేయడానికి ముందడుగు వేస్తున్నారు. దానికి హర్షించాల్సింది పోయి వక్రీకరించడం ఎంత వరకు ధర్మం?.

### ఇరు రాష్ట్రాల ప్రయోజనాల కోసం కలిసికట్టుగా..

శ్రీశైలం జలాశయం సామర్థ్యం 215 టీఎంసీలు. నాగార్జునసాగర్ సామర్థ్యం 315 టీఎంసీలు. ఈ ప్రాజెక్టులను గోదావరి జలాలతో నింపుకోవచ్చు. కేవలం 190 టీఎంసీల సామర్థ్యం ఉన్న పోలవరం ప్రాజెక్టును కట్టడానికి అక్షరాలా రూ.55 వేల కోట్లు అవసరమని లెక్కకడుతున్నారు. ఇక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు కట్టాలంటే ఎంత ఖర్చవుతుంది? శ్రీశైలం,నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఉమ్మడి ఆస్తులు. రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు ఇందులో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కలిసికట్టుగా అడుగులు ముందుకు వేస్తేనే ఇరు రాష్ట్రాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆలోచిస్తున్నాం. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు గోదావరి జలాలను తరలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలు.. తెలంగాణలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది. తెలంగాణ భూభాగం నుంచి గోదావరి జలాలను తరలిస్తే.. అవి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు చేరవేమో అని ప్రతిపక్ష సభ్యులు వ్యక్తం చేసిన అనుమానాలను పరిగణనలోకి తీసుకుంటాం. అలాంటి పరిస్థితులు రాకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు నీటిని ఎలా తీసుకెళ్లాలనే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రితో, తెలంగాణ నీటిపారుదల అధికారులతో మన మంత్రులు, అధికారులు చర్చిస్తున్నారు.

### ఈర్ష్యతోనే ప్రతిపక్షం రాద్ధాంతం

ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన, ఎండిపోతున్న ప్రాంతాలకు నీళ్లివ్వాలన్న ఆలోచన ప్రతిపక్షానికి లేదు. జిల్లాలకు జిల్లాలు కరవు కాటకాలతో అల్లాడుతున్నా ఫర్వాలేదు.. మాకు రాజకీయాలు మాత్రమే కావాలన్న రీతిలో ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. గోదావరి జలాలను శ్రీశైలంకు.. అక్కడి నుంచి నాగార్జునసాగర్‌కు తరలిస్తే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న ఈర్ష్య తప్ప ప్రతిపక్ష సభ్యుల మాటల్లో ఇంకేమీ కన్పించడం లేదు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాట్లాడినంత సేపు మేం అడ్డుతగలకుండా విన్నాం. మేం మాట్లాడుతున్నప్పుడు మాత్రం.. మా మాటలు మైకుల్లో విన్పించకుండా చేయాలనే దుర్బిద్ధితో దుర్మార్గంగా, అన్యాయంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు అసలు మనిషేనా? ఈ మనిషిని చూస్తే దెయ్యం, రాక్షసి గుర్తుకు వస్తాయి తప్ప మనిషి గుర్తుకు రాడు' అని ఏపీ సీఎం జగన్ అన్నారు.

# ఇస్మార్ట్ మీటర్స్!

## హైదరాబాద్‌లో త్వరలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు

- విద్యుత్ వాడకంపై వినియోగదారుడికి ఎప్పటికప్పుడు సమాచారం
- శ్లాబ్ రేటు మారకుండా అలర్ట్‌లు..
- నిర్దేశిత సమయానికే ఆటోమెటిక్‌గా మీటర్ రీడింగ్
- ఎస్ఎంఎస్ ద్వారా సెల్‌ఫోన్‌కు బిల్లు వివరాలు
- పైలట్ ప్రాజెక్టుగా జీడిమెట్ల ఎంపిక
- సింగిల్ ఫేజ్ కనెక్షన్లకు 8,800 స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** మీ ఇంట్లో విద్యుత్‌వాడకం ఎలా ఉందో ఎప్పటికప్పుడు మీకు తెలిసిపోతే..! మీ సెల్‌ఫోన్‌కే ఏరోజుకారోజు కరెంట్ రీడింగ్ ఎస్ఎంఎస్ ద్వారా వచ్చేస్తే...! అధిక వినియోగం వల్ల శ్లాబ్ రేటు మారుతుందంటూ మిమ్మల్ని ముందుగానే అప్రమత్తం చేస్తే... నగరంలో త్వరలో ఏర్పాటు కానున్న స్మార్ట్ విద్యుత్ మీటర్ల ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఈ సౌలభ్యాలన్నీ అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు మంజూరు చేసిన స్మార్ట్‌గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద జీడిమెట్ల డివిజన్ ఎంపికైంది. దీంతో రూ. 41.82 కోట్లతో సింగిల్ ఫేజ్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్ నిర్ణయించింది. ఈసీఐఎల్ సహకారంతో ఇప్పటికే 8,800 సింగిల్ ఫేజ్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను అమర్చింది.

### ఏమిటి లాభం...

వినియోగదారుడు ఏ సమయంలో ఎంత విద్యుత్ ఖర్చు చేశాడు? పీక్ అవర్, నాన్ ఫీక్ అవర్‌లో ఎంత విద్యుత్ వాడకం జరిగింది? వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు ద్వారా కలగనుంది. అలాగే పవర్ ఎక్స్ఛేంజిలో భాగంగా ఆయా పీక్ అవర్స్‌లో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ప్రభుత్వాలు చెల్లిస్తున్న శ్లాబ్ రేటు ఎంత? విద్యుత్ హెచ్చు తగ్గులతోపాటు లోడ్‌ను ఎలా మేనేజ్ చేయాలి? వంటి అనేక ప్రశ్నలకు స్మార్ట్ మీటర్‌తో జవాబు లభిస్తుందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అభిప్రాయపడుతోంది.

### ఎలా పనిచేస్తుంది...

కేంద్ర కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ సర్వర్‌కు స్మార్ట్ మీటర్లను అనుసంధానించడం ద్వారా కరెంట్ వినియోగం, బిల్లు, కరెంట్ కోతలు, ఇతర సాంకేతిక సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్‌ల రూపంలో వినియోగదారుని సెల్‌ఫోన్‌కు సమాచారం అందుతుంది. అంతేకాదు విద్యుత్ వినియోగం విషయంలో కన్జ్యూమర్ బిహేవియర్‌ను అంచనా వేసి శ్లాబ్ రేటు మారకుండా ముందే హెచ్చరికలు జారీ చేస్తుంది. తద్వారా విద్యుత్ వినియోగం పెరగకుండా వినియోగదారుడు జాగ్రత్తపడే అవకాశం కల్పించనుంది. మరో నెల రోజుల్లో ఈ మీటర్ల పనితీరు అమల్లోకి రానుంది.



### ఆటోమేటిగ్గా బిల్లింగ్

ప్రస్తుతం మీటర్ రీడింగ్ మాన్యువల్‌గా జరుగుతుంది. నిర్దేశిత తేదీకి రెండు, మూడు రోజుల ఆలస్యంగా మీటర్ రీడింగ్ నమోదు జరుగుతుండటంతో శ్లాబ్ రేట్ మారుతోంది. ఫలితంగా విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. దీనివల్ల వాడిన విద్యుత్ కంటే వినియోగదారులు ఎక్కువగా బిల్లు చెల్లించాల్సి వస్తుంది. వినియోగదారులకు ఇది భారంగా మారుతుండటమే కాదు.. మీటర్ రీడింగ్ సిబ్బందితో ఘర్షణలకు దిగుతున్న సందర్భాలూ లేకపోలేదు. అదే స్మార్ట్ మీటర్ ఏర్పాటు వల్ల ఈ సమస్యలన్నింటికీ చెక్ చెప్పొచ్చని డిస్కం భావిస్తోంది. రోజువారీ విద్యుత్ అవసరాలు, వినియోగంపై ముందే అంచనాకు రావడం వల్ల శ్లాబ్ రేట్ మారకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంది. అంతేకాదు నిర్దేశిత సమయానికి మీటర్ రీడింగ్ నమోదు కావడంతోపాటు ఆటోమెటిగ్గా వినియోగదారుని సెల్‌ఫోన్‌కు బిల్లింగ్ జనరేట్ అవుతుంది. దీనివల్ల సిబ్బంది సమస్య సంస్థకు ఉండదని, సకాలంలో బిల్లు రాలేదనే ఆందోళన వినియోగదారులకూ ఉండదని విద్యుత్‌రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ‘ట్రిపుల్ తలాక్’కు లోక్‌సభ ఓకే

**మహిళల ఆత్మగౌరవం, లింగ సమానత్వం కోసమే తెస్తున్నామన్న కేంద్రం**

- ట్రిపుల్ తలాక్ చెప్పే పురుషుడికి మూడేళ్ల వరకూ జైలుశిక్ష
- అధికార బీజేపీ, విపక్ష పార్టీల మధ్య వాడివేడిగా సాగిన చర్చ
- బిల్లును స్థాయీసంఘానికి పంపాలని ప్రతిపక్షాల డిమాండ్
- ఒప్పుకోని బీజేపీ.. సభ నుంచి విపక్ష పార్టీల వాకౌట్


లోక్‌సభలో మాట్లాడుతున్న న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ:** ముస్లిం మతస్తులు పాటిస్తున్న ట్రిపుల్ తలాక్ సంప్రదాయాన్ని శిక్షార్హం చేస్తూ రూపొందించిన బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదముద్ర వేసింది. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ చెల్లదని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కేంద్రం ముస్లిం మహిళల(వివాహ హక్కుల రక్షణ) బిల్లు–2019ను తీసుకొచ్చింది. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే ఇతర పార్టీలు వ్యతిరేకించాయి. ఈ బిల్లును పరిశీలించేందుకు వీలుగా స్థాయీ సంఘానికి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా, కేంద్రం అంగీకరించలేదు. ఈ సందర్భంగా ఇటు బీజేపీ, అటు విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టరాదన్న ప్రతిపక్షాల డివిజన్‌ను 302–82 తేడాతో లోక్‌సభ తిరస్కరించింది. అలాగే ట్రిపుల్ తలాక్ చెప్పే ముస్లిం పురుషులకు మూడేళ్లవరకూ జైలుశిక్ష విధించే సవరణకు లోక్‌సభ 302–78 మెజారిటీతో ఆమోదం తెలిపింది. ఈ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని బీజేపీ తమ ఎంపీలకు విప్ జారీచేసింది. ట్రిపుల్ తలాక్ బిల్లుపై స్పందించేందుకు మహిళా ఎంపీలైన పూనమ్ మహాజన్, అపరజితా సేన్, మీనాక్షి లేఖీలను మోహరించింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన పలు సవరణలు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. 16వ లోక్‌సభ ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించినప్పటికీ రాజ్యసభలో ఆమోదం పొందకపోవడం, ఆర్డినెన్స్ గడువు ముగిసిపోవడంతో కేంద్రం మరోసారి బిల్లును ప్రవేశపెట్టింది.

**మొహమ్మద్ ప్రవక్తే వ్యతిరేకించారు..**

సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చాక కూడా ట్రిపుల్ తలాక్ కేసులు నమోదయ్యాయని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..‘2017, జనవరి నుంచి ఇప్పటివరకూ 574 ట్రిపుల్ తలాక్ కేసులు నమోదుకాగా, ఆర్డినెన్స్ జారీచేశాక 101 కేసులు నమోదయ్యాయి. వరకట్న వేధింపుల నిరోధక చట్టం లేదా గృహహింస చట్టం కింద హిందువులు, ముస్లింలు జైలుకు వెళితే ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ట్రిపుల్ తలాక్ విషయంలోనే అభ్యంతరాలు ఎందుకు? ట్రిపుల్ తలాక్‌ను నియంత్రించేందుకే ఇందులో మూడేళ్ల జైలుశిక్షను చేర్చాం. ఈ ఆచారాన్ని మొహమ్మద్ ప్రవక్త కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లును ఆపేయాలన్న దురుద్దేశంతోనే స్థాయీ సంఘానికి పంపాలని ప్రతిపక్షాలు అంటున్నాయి. ట్రిపుల్ తలాక్‌పై 20 ఇస్లామిక్ దేశాల్లో నియంత్రణ ఉంది. భారత్‌లాంటి లౌకికవాద దేశంలో ఎందుకుండకూడదు?’ అని ప్రశ్నించారు. ఈ బిల్లును మహిళల ఆత్మగౌరవం, లింగ సమానత్వం కోసమే తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు.

**ముస్లిం పురుషులే లక్ష్యం: కాంగ్రెస్**

ట్రిపుల్ తలాక్‌కు జైలుశిక్ష పడేలా చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు చెప్పలేదని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ తెలిపారు. ముస్లిం మహిళలతో పాటు భర్తలు వదిలేసిన హిందూ, పార్సీ మహిళలకు కూడా రక్షణ కల్పించాలని కోరారు. ముస్లింలతో పోల్చుకుంటే హిందువుల్లో విడాకుల కేసులు ఎక్కువని మరో కాంగ్రెస్ నేత మొహమ్మద్ జావేద్ చెప్పారు. ముస్లిం పురుషులను జైలుకు పంపించడమే లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్ అన్నది అనాగరికమేననీ, అయితే కేంద్రం తెచ్చిన బిల్లుపై తాము సుముఖంగా లేమని సీపీఎం నేత ఏ.ఎం.షరీఫ్ అన్నారు.

**డిప్యూటీ స్పీకర్‌పై ఆజంఖాన్ అనుచిత వ్యాఖ్యలు**

వివాదాలకు కేరాఫ్‌గా మారిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) నేత ఆజంఖాన్ గురువారం నోరు జారారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రమాదేవిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఆజంఖాన్ మాట్లాడుతుండగా, కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారు. సహనం కోల్పోయిన ఆజంఖాన్ నఖ్వీవైపు చూస్తూ..‘మీరు అటూఇటూ కాని మాటలు మాట్లాడవద్దు’ అని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రమాదేవి స్పందిస్తూ..‘మీరు కూడా అటూఇటూ చూడకుండా స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి మాట్లాడండి’ అని కోరారు. వెంటనే ఆజంఖాన్ రమాదేవిని ఉద్దేశించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో సభలో గందరగోళం చెలరేగింది. ఈ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేయగా, ఆజంఖాన్ తిరస్కరించారు. రమాదేవి తనకు సోదరిలాంటివారనీ, తప్పుగా మాట్లాడుంటే రాజీనామా చేసేందుకైనా సిద్ధమన్నారు. ఆయన వ్యాఖ్యలను డెప్యూటీ స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. మరోవైపు ఆజంఖాన్‌కు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ మద్దతుగా నిలిచారు. ఆజంఖాన్ వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ ఖండించింది.

## ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రస్థానం

- **2016, ఫిబ్రవరి 5:** ట్రిపుల్ తలాక్, నిఖా హలాల, బహుభార్యత్వాల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లలో కక్షిదారులకు సహకరించాల్సిందిగా సుప్రీం కోర్టు అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గిని కోరింది.
- **మార్చి 28:** మహిళలకు సంబంధించి పెళ్లి, విడాకులు తదితర అంశాలపై అతున్నత స్థాయి కమిటీ నివేదికను సమర్పించాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.
- **అక్టోబర్ 7:** ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. లైంగిక సమానత్వం, లౌకికవాదం ఆధారంగా ఈ ట్రిపుల్ తలాక్‌పై పరిశీలన జరపాలని కోరింది.
- **2017, ఫిబ్రవరి 16:** ట్రిపుల్ తలాక్, నిఖా హలాల పిటిషన్లపై విచారణ జరపడానికి సుప్రీం కోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.
- **మార్చి 27:** ట్రిపుల్ తలాక్ విషయం న్యాయస్థానం పరిధిలోకి రాదని, ఆ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకోడానికి వీల్లేదని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సుప్రీం కోర్టుకు తెలిపింది.
- **మే 18:** ట్రిపుల్ తలాక్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు రిజర్వు చేసింది.
- **ఆగస్టు 22:** ట్రిపుల్ తలాక్ చట్టవిరుద్ధమంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.ఐదుగురు న్యాయమూర్తుల్లో ముగ్గురు దీన్ని చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై చట్టం చేయాలని ధర్మాసనం కేంద్రానికి సూచించింది.
- **డిసెంబర్:** ట్రిపుల్ తలాక్‌ను శిక్షార్హమైన నేరంగా పేర్కొంటూ రూపొందించిన ‘ముస్లిం మహిళల బిల్లును లోక్‌సభ ఆమోదించింది.
- **2018, ఆగస్టు 9:** కేంద్రం ట్రిపుల్ తలాక్ బిల్లుకు సవరణలు చేసింది. నిందితులకు బెయిలు పొందే అవకాశం కల్పిస్తూ ఈ సవరణలు చేశారు.
- **ఆగస్టు 10:** ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. అయితే, బిల్లు సభ ఆమోదం పొందలేదు.
- **సెప్టెంబర్ 19:** ట్రిపుల్ తలాక్‌పై రూపొందించిన ఆర్డినెన్సును కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ట్రిపుల్ తలాక్‌ను శిక్షార్హమైన నేరంగా, మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా ఈ ఆర్డినెన్సును రూపొందించారు.
- **డిసెంబర్ 31:** రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును మళ్లీ ప్రతిపక్షం అడ్డుకుంది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండు చేసింది.

## వివాహవ్యవస్థ నాశనమవుతుంది: ఒవైసీ



కేంద్రం తీసుకొచ్చిన ట్రిపుల్ తలాక్ బిల్లును ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా తప్పుపట్టారు. ‘ఇస్లామ్‌లో 9 రకాల తలాక్ పద్ధతులు ఉన్నాయి. ఒకవేళ ఈ చట్టం ప్రకారం ముస్లిం భర్త జైలుకు వెళితే ఆయన భార్య పోషణను ఎవరు చూసుకోవాలి? మీరు(కేంద్ర ప్రభుత్వం) వివాహ వ్యవస్థనే నాశనం చేయాలనుకుంటున్నారు. ముస్లిం మహిళలను రోడ్డుపై పడేయాలనుకుంటున్నారు. ముస్లిం మహిళల హక్కులపై అంత ప్రేమున్న బీజేపీ ప్రభుత్వం 2013 ముజఫర్‌పూర్ అల్లర్లలో అత్యాచారాలకు గురైన ముస్లిం మహిళలకు ఎందుకు న్యాయం చేయట్లేదు. ఈ అకృత్యాలకు సంబంధించి ఇప్పటి వరకూ దోషులకు శిక్షపడలేదు. జల్లికట్టును నిషేధిస్తూ చట్టాన్ని తెచ్చిన మీరు ముస్లింల మూకహత్యలను నిరోధిస్తూ చట్టం తీసుకురావడంలో మాత్రం విఫలమయ్యారు. మహిళల హక్కులపై నిజంగా బీజేపీకి అంత ప్రేముంటే ప్రత్యేక విమానంలో తమ మహిళా ఎంపీలను శబరిమలకు తీసుకెళ్లాలి’ అని ఒవైసీ చురకలు అంటించారు.

# ఆర్టీఐ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

- రశీదులపై ఎంపీలతో సంతకాలు చేయించిన సీఎం రమేశ్
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్
- సమాచార కమిషన్‌పై మోదీ పగ తీర్చుకుంటున్నారు: జైరాం రమేశ్


మాట్లాడుతున్న జైరాం రమేశ్

**న్యూఢిల్లీ:** సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టానికి కేంద్రం తీసుకొచ్చిన సవరణల బిల్లును రాజ్యసభ గురువారం ఆమోదించింది. ‘సమాచార హక్కు (సవరణ) బిల్లు–2019’ని లోక్‌సభ సోమవారమే ఆమోదించగా, తాజాగా రాజ్యసభ కూడా ఆమోదించడంతో ఆ బిల్లు పార్లమెంటులో గట్టెక్కింది. అయితే ఈ బిల్లును క్షుణ్నంగా పరిశీలించేందుకు ఎంపిక కమిటీకి పంపాల్సిందేనని రాజ్యసభలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు పట్టుబట్టడంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చివరకు బిల్లును ఎంపిక కమిటీకి పంపాలా? వద్దా? అనే విషయంపై ఓటింగ్ నిర్వహించగా, ఆ ఓటింగ్ సమయంలో తమకు అనుకూలంగా ఓటు వేయాల్సిందిగా ఎంపీలను మంత్రులు, అధికార పార్టీ సభ్యులు భయపెట్టేందుకు ప్రయత్నించారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఇటీవలే టీడీపీ నుంచి బీజేపీలో చేరిన సీఎం రమేశ్, ఓటు రశీదులను తీసుకెళ్లి సభ్యుల చేత వాటిపై సంతకాలు చేయిస్తుండటం కనిపించడంతో ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రతిస్పందించాయి. విపక్ష సభ్యులు సీఎం రమేశ్‌తో గొడవకు దిగి, ఆయన చేతుల్లో నుంచి ఆ రశీదులను లాక్కునేందుకు కూడా ప్రయత్నించారు. అధికార పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో 303 సీట్లను ఎలా గెలిచిందో మనకు సభలోనే సాక్ష్యం కనిపిస్తోందని రాజ్యసభలో ప్రతిపక్షనేత గులాం నబీ ఆజాద్ అన్నారు. సీఎం రమేశ్ చర్యను వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులంతా వెల్‌లోకి వచ్చి ఆందోళనలు చేస్తూ నిరసన తెలిపారు. సిబ్బంది, శిక్షణ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టంలో గతంలో ఉన్న లోటుపాట్లను తమ ప్రభుత్వం సరిచేస్తోందని చెప్పుకొచ్చారు. అయితే ఆజాద్ మాట్లాడుతూ ‘మీరు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు. మీ మీద మాకు నమ్మకం లేదు. కాబట్టి మేం బయటకు వెళ్లిపోతున్నాం’ అని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ మాట్లాడుతూ సమాచార కమిషనర్లు గతంలో ప్రభుత్వానికి, ప్రధానికి వ్యతిరేకంగా పలు తీర్పులు ఇచ్చినందున, ఇప్పుడు మోదీ సమాచార కమిషన్‌పై పగ తీర్చుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తోపాటు తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ తదితర ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును, సభలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ బయటకు వెళ్లిపోయాయి. అనంతరం ఓట్లు లెక్కపెట్టగా, బిల్లును ఎంపిక కమిటీకి పంపవద్దని 117 ఓట్లు, పంపాలని 75 ఓట్లు వచ్చినట్లు తెలిసింది. దీంతో విపక్ష సభ్యులెవరూ సభలో లేకపోవడంతో సవరణ బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) సహా సమాచార కమిషనర్లందరి పదవీ కాలం, వేతనాలను కేంద్రమే నిర్ణయించేలా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయి.

# న్యాయం.. 23 ఏళ్లు వాయిదా!

**శ్రీనగర్:** వారి జీవితంలోని విలువైన కాలమంతా జైలు నాలుగు గోడలమధ్యే గడిచిపోయింది. దాదాపు 23 ఏళ్ల పాటు జైళ్లో నిర్బంధించి, ఇప్పుడు తీరిగ్గా నిర్దోషులేనంటూ వారిని విడుదల చేశారు. కశ్మీర్‌కు చెందిన మొహమ్మద్ అలీ భట్, లతీఫ్ అహ్మద్ వాజా, మీర్జా నాసర్ హుస్సేన్‌ల విషాదమిది. లజపతినగర్ మార్కెట్ పేలుళ్లలో హస్తం ఉందంటూ వీరిని మొదట 1996లో ఢిల్లీ పోలీసులు నేపాల్‌లో అరెస్ట్ చేశారు. అనంతరం ఓ బస్సును పేల్చారనే ఆరోపణలపై రాజస్తాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లజపత్ నగర్ కేసుకు సంబంధించి వీరిని 2012లో ఢిల్లీ హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. రాజస్తాన్ బస్సు కేసు నుంచి బయటపడకపోవడంతో ఆ తరువాతా వారు జైల్లోనే మగ్గాల్సి వచ్చింది. తాజాగా రాజస్తాన్ హైకోర్టు సైతం వారిని నిర్దోషులంటూ తీర్పు ఇవ్వడంతో.. ఎట్టకేలకు 23 ఏళ్ల విలువైన జీవితాన్ని కోల్పోయిన అనంతరం స్వేచ్ఛాప్రపంచంలోకి రాగలిగారు.

కశ్మీరీ ఉపకరణాలను అమ్మి జీవనం గడిపేందుకు నేపాల్ వెళ్లిన వారిని 1996లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ‘నేపాల్‌లో ఉన్న సామాన్యులమైన మేం ఢిల్లీలో, రాజస్తాన్‌లో బాంబు పేలుళ్లకెలా బాధ్యులమవుతాం? మమ్మల్ని చిత్రహింసలు పెట్టారు. తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించుకుని మమ్మల్ని బలిపశువులను చేశారు’ అని శ్రీనగర్‌కు చెందిన వాజా ఆవేదన వ్యక్తం చేశారు. భట్ జైళ్లో ఉన్న సమయంలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయాడు. ఇంటికి వెళ్లగానే మొదట భట్ స్మశానవాటికకు వెళ్లి తన తల్లిదండ్రుల సమాధుల వద్ద చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. ‘నా సగం జీవితాన్ని కోల్పోయాను. నాకు జరిగిన అన్యాయానికి ఎవరు బాధ్యులు?’ అనే భట్ ప్రశ్నకు ఎవరి వద్దా సమాధానం లేదు. మాలాంటి అమాయకులు ఇంకా జైళ్లలో చాలామంది ఉన్నారని ఈ ముగ్గురు చెబుతున్నారు.

## 7 వరకు పార్లమెంటు సమావేశాలు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత పార్లమెంటు సమావేశాలను ఆగస్టు 7వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. లోక్‌సభలో గురువారం ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందగానే ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పీకర్ ఓం బిర్లాకు తెలిపారు. కీలకమైన 17 బిల్లులను ఆమోదించాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అనంతరం సభ పొడిగింపు నిర్ణయాన్ని స్పీకర్ సభలో ప్రకటించారు. రాజ్యసభలో దీనికి సంబంధించి శుక్రవారం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ప్రతిపాదన పెట్టనున్నారు. జూన్ 17న ప్రారంభమైన సమావేశాలు జూలై 26తో ముగియాల్సి ఉంది. విపక్షాలు కోరుకుంటున్నట్లే పార్లమెంటు సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహిస్తున్నామని సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యానించారు. కాగా, సమావేశాల పొడిగింపును విపక్ష కాంగ్రెస్, టీఎంసీలు వ్యతిరేకిస్తున్నాయి. ‘ఇదేం కాలేజ్ క్యాంపస్ కాదు.. పవిత్రమైన పార్లమెంటు. ఇలా ఆఖరి నిమిషంలో నిర్ణయాలను ప్రకటించడమేంటి?’ అని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ మండిపడ్డారు.

## ఉత్తర కొరియా మళ్లీ క్షిపణి ప్రయోగం

**సియోల్:** కొన్నాళ్లుగా నిశ్శబ్దంగా ఉన్న ఉత్తర కొరియా మరోసారి క్షిపణి ప్రయోగాలను చేపట్టింది. తక్కువ దూరాలను ఛేదించే రెండు స్వల్ప శ్రేణి క్షిపణులను ఆ దేశం గురువారం సముద్రంలోకి ప్రయోగించింది. ఇప్పటివరకు న్యూక్లియర్ పరీక్షల నిలుపుదలపై అమెరికాతో ఉత్తర కొరియా జరుపుతున్న చర్చలు తాజా ప్రయోగంతో సంక్లిష్టమవ్వనున్నాయి. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌ల మధ్య కుదిరిన అణు నిరోధక చర్చల తర్వాత జరిగిన మొదటి క్షిపణి ప్రయోగం ఇదే. క్షిపణుల ప్రయోగాన్ని చేపట్టినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ధ్రువీకరించారు. కొత్త రకం క్షిపణులుగా కనిపిస్తున్న వీటిలో ఒకటి 430 కిలోమీటర్ల దూరం వెళ్లగా.. రెండోది 690 కిలోమీటర్లు వెళ్లినట్లు సియోల్‌లోని అధికారి తెలిపినట్లు సమాచారం.

## అమెరికాలో మళ్లీ మరణశిక్షల అమలు

**వాషింగ్టన్:** దాదాపు రెండు దశాబ్దాల విరామం తర్వాత అమెరికాలో మళ్లీ మరణ శిక్షలను అమలు చేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హీనమైన నేరాలకు పాల్పడిన ఐదుగురికి ఇప్పటికే మరణశిక్షను విధించి, ఎప్పుడు అమలుచేయాలనే తేదీలను కూడా ఖరారు చేసింది. అమెరికా అటార్నీ జనరల్ విలియం బార్ ఓ ప్రకటన చేస్తూ, ‘నీచమైన నేరాలకు పాల్పడిన వారికి మరణ శిక్ష విధించాలని న్యాయ శాఖ ఎప్పటి నుంచో గత ప్రభుత్వాలను కూడా కోరుతూ వచ్చింది. చట్టాలు సరిగ్గా అమలయ్యేలా న్యాయ విభాగం చూస్తుంది. బాధితులకు, వారి కుటుంబాలకు న్యాయం చేకూర్చాల్సిన బాధ్యత ఆ విభాగంపై ఉంది’ అని తెలిపారు. మరణ శిక్షలను అమలు చేయాలంటూ జైళ్ల శాఖను విలియం ఇప్పటికే ఆదేశించారు. అమెరికాలో మరణశిక్ష అంటే మన దగ్గరలా ఉరిశిక్ష విధించకుండా, విషపూరిత మందులు ఇచ్చి నేరస్తులు చనిపోయేలా చేస్తారు.

## మహిళ కడుపులో నగలు, నాణేలు


కడుపులోంచి తీసిన నగలు, నాణేలను చూపుతున్న వైద్యుడు

**రామ్‌పుర్‌హట్:** కడుపునొప్పితో ఆసుపత్రికి వెళ్లిన ఓ మహిళకు శస్త్రచికిత్స చేసిన వైద్యులు.. ఆమె కడుపులో ఉన్న 1.5 కేజీల ఆభరణాలు, నాణేలను చూసి విస్తుపోయారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లా రామ్‌పురహట్‌లో చోటుచేసుకుంది. మర్‌గ్రామ్‌కు చెందిన మానసికస్థితి సరిగా లేని 26 ఏళ్ల ఓ మహిళ కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను నగరంలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులోంచి బంగారం, కాంస్యం, రాగితో చేసిన గొలుసులు, దుద్దులు, ముక్కుపుడకలు, గాజులు వంటి 1.5 కేజీల ఆభరణాలు, రూ.5, రూ.10 విలువ గల 90 నాణేలను బయటికి తీసినట్లు వైద్యులు తెలిపారు.

## చైనా నేవీకి నిధులు, వనరుల మళ్లింపు

**భారత్ జాగ్రత్తగా గమనించాలి: కరమ్ వీర్**


మాట్లాడుతున్న కరమ్‌వీర్ సింగ్ (మధ్య వ్యక్తి)

**న్యూఢిల్లీ:** చైనా ఆర్మీలోని వివిధ ఇతర విభాగాల నుంచి నిధులు, వనరులను భారీ స్థాయిలో నౌకాదళానికి మళ్లించారని భారత నేవీ చీఫ్ అడ్మిరల్ కరమ్‌వీర్ సింగ్ గురువారం చెప్పారు. ఈ విషయాన్ని భారత్ జాగ్రత్తగా గమనించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. సైనిక అభివృద్ధిపై చైనా రక్షణ శాఖ బుధవారమే ఓ శ్వేతపత్రం విడుదల చేసింది. తన మిలటరీ అభివృద్ధిని ఇండియా, అమెరికా, రష్యాల అభివృద్ధితో చైనా ఈ శ్వేతపత్రంలో పోల్చింది. అందులోని వివరాలను పరిశీలించిన మీదట కరమ్‌వీర్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిక్కీ నిర్వహించిన ‘నౌకల నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం’ అనే కార్యక్రమంలో కరమ్‌వీర్ సింగ్ ప్రసంగించేందుకు వచ్చి, అక్కడి విలేకరులతోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. ‘చైనా తన శ్వేత పత్రంలోనే కాదు. గతంలోనూ ఈ వివరాలు చెప్పింది. ఆర్మీలోని ఇతర విభాగాల నుంచి నిధులను, వనరులను నౌకాదళానికి వారు మళ్లించారు. ప్రపంచ శక్తిగా ఎదగాలన్న ఉద్దేశంతోనే వాళ్లు ఇలా చేశారు. మనం దీనిని జాగ్రత్తగా గమనిస్తూ, మనకున్న బడ్జెట్, పరిమితుల్లోనే ఎలా స్పందించగలమో ఆలోచించాలి’ అని అన్నారు. అనంతరం వేదికపై కరమ్‌వీర్ ప్రసంగిస్తూ 2024 కల్లా 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న ప్రభుత్వ లక్ష్యానికి, నౌకా నిర్మాణ రంగం ఎంతగానో చేయూతనివ్వగలదని పేర్కొన్నారు.

# ముగ్గురు రెబెల్స్‌పై అనర్హత వేటు

- కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ కుమార్ సంచలన నిర్ణయం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రమేశ్, మహేశ్, శంకర్‌లపై అనర్హత


మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ రమేశ్

**సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ కె.ఆర్.రమేశ్ కుమార్ గురువారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన 17 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలైన రమేశ్ జార్కిహోళి, మహేశ్ కుమటల్లి, శంకర్‌లపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేసినట్లు స్పీకర్ తెలిపారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా రాజీనామాలు ఇవ్వలేదనీ, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్(ఫిరాయింపుల నిరోధక చట్టం)ను ఉల్లంఘించారని స్పష్టం చేశారు. ప్రస్తుత శాసనసభ కాలం ముగిసే వరకూ (2023) వీరు ఎన్నికల్లో పోటీ చేసేందుకు, సభలో పదవులు చేపట్టేందుకు అనర్హులని తేల్చిచెప్పారు. మిగిలిన 14 మంది ఎమ్మెల్యేల రాజీనామాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు. అసెంబ్లీలో ఇటీవల జరిగిన విశ్వాసపరీక్షలో కుమారస్వామి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఓడిపోవటం తెలిసిందే. తన నిర్ణయంపై రెబెల్స్ కోర్టులకు వెళ్లే అవకాశముందన్నారు. ఆర్థిక బిల్లుకు గనక ఈ నెల 31లోగా ఆమోదం లభించకపోతే ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని, అప్పుడు అసెంబ్లీని సస్పెండ్ చేయడం లేదా రాష్ట్రపతి పాలన విధించడం తప్ప మరో ప్రత్యామ్నాయం ఉండదని చెప్పారాయన. మరోవైపు తమ రాజీనామాలపై స్పీకర్ ముందు హాజరై వివరణ ఇచ్చేందుకు 4 వారాల గడువు కావాలని రెబెల్స్ కోరారు.

**యెడ్డీ జోరుకు షా బ్రేక్..**

బీజేపీ కర్ణాటక చీఫ్ యడ్యూరప్ప, నేతలు జగదీశ్ షెట్టర్, అరవింద్ లింబావలి, మధుస్వామి, బసవరాజ్ బొమ్మై గురువారం ఢిల్లీ చేరారు. పార్టీ అధ్యక్షుడు అమిత్ షాతో ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించారు. అయితే మిగిలిన 14 మంది రెబెల్ ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ రమేశ్ కుమార్ తుది నిర్ణయం తీసుకున్న తరవాతే ముందుకెళ్లాలనీ, అప్పటి వరకూ ఓపికపట్టాలని యడ్యూరప్పకు షా సూచించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

## జిల్లాల్లో ‘పోక్సో’ ప్రత్యేక కోర్టులు



**న్యూఢిల్లీ:** చిన్నారులపై లైంగిక నేరాలకు సంబంధించి గురువారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. లైంగిక నేరాల నుంచి చిన్నారులను రక్షించే చట్టం(పోక్సో) కింద 100కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైన జిల్లాల్లో, పూర్తిగా కేంద్ర నిధులతో 60 రోజుల్లోపు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేంద్ర నిధులతో ఏర్పాటయ్యే ఈ కోర్టులు ప్రత్యేకంగా పోక్సో కేసులను మాత్రమే విచారించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే, చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించి అవగాహన కల్పించేలా, అలాంటి నేరాలు శిక్షార్హమని తెలిపేలా ఒక చిన్న వీడియోను అన్ని సినిమాహాళ్లలో సినిమా ప్రదర్శనకు ముందు చూపాలని ఆదేశించింది. అన్ని టీవీ చానళ్లలోనూ తప్పనిసరిగా ఆ క్లిప్పింగ్‌ను చూపాలని స్పష్టం చేసింది. ఆ వీడియోలో ‘చైల్డ్ హెల్ప్‌లైన్’ నంబరును పొందుపర్చాలని పేర్కొంది. ఫోరెన్సిక్ నివేదిక ఆలస్యం కావడంతో దర్యాప్తులో జాప్యం చోటు చేసుకుంటోందని సీనియర్ న్యాయవాది గిరి పేర్కొనడంపై స్పందిస్తూ.. ప్రతీ జిల్లాలో పోక్సో కేసుల కోసం ప్రత్యేకంగా ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈలోగా ఫోరెన్సిక్ ల్యాబ్‌లు.. పోక్సో కేసుల నివేదికలను సాధ్యమైనంత త్వరగా అందించాలన్నారు. జడ్జీల నియామకం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బంది, చిన్నారులకు అనుకూలంగా ఉండే కోర్టు భవనాల్లో మౌలిక వసతులు.. ఇవన్నీ కేంద్ర నిధుల ద్వారానే జరగాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 26వ తేదీకి వాయిదా వేసింది.

# బ్రిటన్ హోం మంత్రిగా ప్రీతీ పటేల్

- ముగ్గురు భారత సంతతి ఎంపీలకు కేబినెట్‌లో చోటు
- ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా ఇన్ఫోసిస్ మూర్తి అల్లుడు రిషి
- అలోక్ శర్మకు ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ బాధ్యతలు


ప్రీతీ పటేల్


రిషి సునక్


అలోక్ శర్మ

**లండన్:** బ్రిటన్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ముగ్గురు భారత సంతతి ఎంపీలకు కీలక మంత్రి పదవులు దక్కాయి. బ్రెగ్జిట్‌పై వివాదం కారణంగా ఆ దేశ ప్రధాని బాధ్యతల నుంచి థెరెసా మే దిగిపోవడంతో కొత్త ప్రధానిగా బోరిస్ జాన్సన్ ఎన్నిక కావడం తెలిసిందే. రాణి ఎలిజబెత్ బుధవారం సాయంత్రమే జాన్సన్‌ను కొత్త ప్రధానిగా నియమించారు. ఆ వెంటనే మంత్రివర్గంలో జాన్సన్ మార్పులు చేశారు. మొత్తం ముగ్గురు భారత సంతతికి చెందిన ఎంపీలకు జాన్సన్ తన టీమ్‌లో స్థానం కల్పించారు. ప్రీతీ పటేల్, రిషి సునక్, అలోక్ శర్మ అనే భారత సంతతి ఎంపీలు కొత్త కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. వీరిలో రిషి సునక్, ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడైన ఎన్.ఆర్.నారాయణ మూర్తికి స్వయానా అల్లుడు. వీరంతా గతంలో జాన్సన్ వెన్నంటే ఉండి ప్రచారాన్ని ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. వీరు ముగ్గురూ గురువారం కొత్త కేబినెట్ తొలి సమావేశానికి హాజరయ్యారు. అక్టోబర్ 31లోపు బ్రెగ్జిట్ ప్రక్రియను పూర్తి చేయడమే తమ లక్ష్యమని జాన్సన్ స్పష్టం చేశారు. బ్రెగ్జిట్‌పై యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో ఎలాంటి ఒప్పందమూ లేకుండానైనా సరే, అక్టోబర్ 31లోపు బ్రెగ్జిట్ ప్రక్రియను ప్రారంభిస్తామన్న హామీతో జాన్సన్‌కు ప్రధాని పదవి లభించింది. మొత్తం 31 మంది సభ్యులతో మంత్రివర్గాన్ని ప్రకటించారు. వారంతా బ్రెగ్జిట్ ప్రక్రియలో తనకు సహకరిస్తారని జాన్సన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**హోంమంత్రిగా ప్రీతీ పటేల్**

బోరిస్ జాన్సన్ కేబినెట్‌లో కీలక పదవి దక్కిన భారత సంతతి వ్యక్తి ప్రీతీ పటేలేనని చెప్పుకోవాలి. గుజరాత్‌కు చెందిన తల్లిదండ్రులకు బ్రిటన్‌లోనే జన్మించిన ప్రీతీ పటేల్ (47) హోం మంత్రిగా నియమితులయ్యారు. బ్రెగ్జిట్‌పై థెరెసా మే విధానాలను ప్రీతి తూర్పారపట్టేవారు. బ్రిటన్‌లో భారతీయ కుటుంబాలు నిర్వహించే కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతూ ఉంటారు. భారత ప్రధాని మోదీకి ప్రీతి బ్రిటన్‌లో కీలకమద్దతుదారు. బ్రిటన్ ప్రధాని ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు. ఇక అలోక్ శర్మకు ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ శాఖ బాధ్యతలిచ్చారు. 2010 నుంచి అలోక్‌శర్మ ఎంపీగా ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. రీడింగ్ వెస్ట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అలోక్ శర్మ జన్మించారు. అలోక్‌కు అయిదేళ్లప్పుడే ఆ కుటుంబం బ్రిటన్‌కు వెళ్లింది.

**ఆర్థిక శాఖ సహాయ మంత్రి రిషి**

రిషి సునక్ (39) ట్రెజరీ విభాగానికి చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. రిషి కన్జర్వేటివ్ పార్టీ ఎంపీగా రిచ్‌మాండ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రిషి తండ్రి భారత్‌లోని పంజాబ్‌కు చెందినవారు. రిషి సునక్ బ్రిటన్‌లోనే పుట్టారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ వైద్య రంగానికి చెందినవారు. కాలిఫోర్నియాలో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుతుండగా ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతామూర్తితో పరిచయం ప్రేమగా మారింది. ఆ తర్వాత వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**భారత్‌తో జాన్సన్‌కీ అనుబంధం**



ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌కు కూడా భారత్‌తో ఒకప్పుడు అందమైన అనుబంధమే ఉంది. ఆయన మొదటి భార్య మరీనా వీలర్ భారత సంతతికి చెందిన మహిళ. ఆమె తండ్రి చార్లెస్ వీలర్ బీబీసీ ఢిల్లీ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ఆయన రెండో భార్య దీప్ సింగ్ ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్న సరోగోధకు చెందినవారు. దేశ విభజన తర్వాత వారి కుటుంబం భారత్‌కు వచ్చి స్థిరపడింది. దీప్ సింగ్ మొదటి భర్త ప్రముఖ బాక్సర్ సర్ శోభా సింగ్ కుమారుల్లో ఒకరైన దల్జీత్. దల్జీత్ ప్రముఖ రచయిత కుష్వంత్ సింగ్ సోదరుడు. బోరిస్ జాన్సన్, మరీనా దంపతులు భారత్‌కు చాలా సార్లు వచ్చారు. దల్జీత్‌సింగ్ కుటుంబంతో కూడా జాన్సన్ సంబంధాలు కొనసాగించారు. 2017 ఎన్నికల సమయంలో బ్రిస్టల్‌లో గురుద్వారాలో మాట్లాడుతూ భారత్‌కు వెళ్లినప్పుడల్లా తమ బంధువులకి స్కాచ్ విస్కీ తీసుకువెళుతుండేవాడినని చెప్పి వివాదాల్లో కూడా ఇరుక్కున్నారు.

సాక్షి
శుక్రవారం, జూలై, 26

# ఈ నేరాలు ఆగుతాయా?

లైంగిక నేరగాళ్ల నుంచి పసి పిల్లలను కాపాడటం కోసం 2012లో వచ్చిన 'పిల్లలపై లైంగిక నేరాల నిరోధక(పోక్సో) చట్టం'లో మరిన్ని కఠినమైన నిబంధనలు జోడిస్తూ తీసుకొచ్చిన సవరణ బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. అది లోక్‌సభ పరిశీలనకు రాబోతోంది. ఇటీవల పసి పిల్లలపై లైంగిక నేరాలు, వేధింపులు విపరీతంగా పెరిగాయి. కొన్ని నేరాలైతే ఊహకందనివి. వాటి వివరాలు విన్నప్పుడు ఆ నేరగాళ్లు అసలు మనుషులా, మృగాలా అన్న సందేహం కూడా కలుగుతుంది. నిరుడు జమ్మూలోని కథువాలో అసిఫా అనే ఎనిమిదేళ్ల బాలికపై సాగిన అకృత్యం అటువంటిదే. సంచార తెగకు చెందినవారిని భయభ్రాంతుల్ని చేసి వెళ్లగొట్టే ఉద్దేశంతో ఆ బాలికను అపహరించి, హింసించడంతోపాటు డ్రగ్స్ ప్రయోగించారు. ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. చివరకు రాళ్లతో కొట్టి చంపారు. మధ్యయుగాల నాటి ఆటవిక సంస్కృతి ఒకపక్క, ఆధునికత తెస్తున్న విశృంఖలత్వం మరోపక్క పెరగడంతో దేశంలో నానాటికీ ఈ మాదిరి నేరాలు పెరుగుతున్నాయి. 2012లో తీసుకొచ్చిన కఠిన చట్టం కథువా వంటి ఉదంతాలను నిరోధించలేకపోయింది. లోకమంటే పూర్తిగా తెలియని బాల్యంపై సాగే నేరాలు వారిపై జీవితాంతం ప్రభావం చూపుతాయి. వారు అందరిలా సాధారణ జీవనం కొనసాగించలేని నిస్సహాయతకు లోనై, జీవచ్ఛవాలుగా మారుతారు. కనుక కఠిన శిక్షలకు అవకాశం ఉండే చట్టం అమల్లోకొస్తే ఈ తరహా నేరాలు సమసిపోగలవని అందరూ విశ్వసిస్తారు. అందుకే కావొచ్చు... రాజ్యసభలో ఒకరిద్దరు మినహా అందరూ సవరణ బిల్లును స్వాగతించారు. ఈ బిల్లు పసిపిల్లలపై తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించాలని ప్రతిపాదించింది. అలాగే వివిధ లైంగిక నేరాలకు ఇప్పుడున్న శిక్షలను మరింతగా పెంచింది. వాటితోపాటు పసిపిల్లలతో నీలిచిత్రాలు తీసేవారికి, వాటిని వ్యాప్తి చేసేవారికి విధించే జైలుశిక్ష, జరిమానాలను భారీగా పెంచింది. ఈ చట్టం అమల్లోకొస్తే నేరగాళ్లకు 20 ఏళ్ల కఠినశిక్ష మొదలు... మరణించేవరకూ జైల్లో ఉండేలా జీవితఖైదు విధించడానికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది.

అయితే నేరాలు జరిగేది చట్టాలు లేకపోవడం వల్లనో, ఉన్నా అవి అత్యంత కఠినంగా లేకపోవడం వల్లనో కాదు. అసలు ఆ చట్టాలంటేనే భయభక్తులు లేకపోవడం వల్ల. డబ్బు, పలుకుబడి ఉంటే సులభంగా తప్పించుకోగలమన్న భరోసా ఉండటం వల్ల. నేరం జరిగాక సత్వరం నేరగాళ్లను పట్టుకుంటే... వారిపై పకడ్బందీ సాక్ష్యాధారాలు సేకరించి సాధ్యమైనంత త్వరగా శిక్షించగలిగితే నేర గాళ్ల వెన్నులో చలిపుడుతుంది. నేరం చేయాలంటే భయపడే స్థితి ఏర్పడుతుంది. దురదృష్టవశాత్తూ మన దేశంలో ఆ పరిస్థితి లేదు. పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు మంత్రులు చెప్పే స్థాయిలో క్షేత్ర స్థాయి ఆచరణ ఉండటం లేదు. నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి నేతృత్వంలోని ఫౌండేషన్ ఇటీవల వెలువరించిన నివేదికే ఇందుకు సాక్ష్యం. ఇంతవరకూ ఢిల్లీలో పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో శిక్షలు పడిన ఉదంతాలు కేవలం 9 శాతం మాత్రమేనని ఆ నివేదిక తెలియజేసింది. ఇదే తీరు కొనసాగితే ఇప్పుడున్న పెండింగ్ కేసుల్లోని బాధితులు న్యాయం కోసం 2029 వరకూ వేచిచూడక తప్పదని వివరించింది. అత్యాచార బాధితుల్లో కేవలం 15 శాతంమందికి మాత్రమే ఇంతవరకూ నష్టపరిహారం అందింది. దాదాపు 40 శాతంమందికి అసలు చట్టపరమైన సాయం లభించలేదు. ఈ కేసుల్లో దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, విచారణలు అత్యంత దయనీయంగా ఉన్నాయి. 2016లో మొత్తం 36,022 కేసులు నమోదైతే, అప్పటికే ఉన్న పెండింగ్ కేసుల సంఖ్య 12,000. మొత్తం ఈ 48,000 కేసుల్లో ఆ ఏడాది పోలీసులు చార్జిషీటు దాఖలు చేసినవి దాదాపు 33,000. న్యాయస్థానాల్లోనూ ఇదే స్థితి ఉంది. 2016నాటికి 70,000 కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటికి కొత్తగా ఈ 33,000 కేసులూ వచ్చి చేరాయి. కనుక వాటి ముందున్న కేసుల సంఖ్య లక్ష దాటింది. కానీ ఆ ఏడాది 11,000 కేసుల్లో మాత్రమే తీర్పులు వెలువడ్డాయి. విషాదమేమంటే వీటిలో కేవలం 3 శాతం కేసుల్లో... అంటే 330 కేసుల్లో మాత్రమే నేరగాళ్లకు శిక్ష పడింది. మిగిలిన కేసుల్లో అందరూ నిర్దోషులుగా విడుదలయ్యారు. ఇలా ఏటా పెండింగ్ కేసుల సంఖ్య అపరిమితంగా పెరుగుతుంటే... తీర్పులు వెలువడ్డ అత్యధిక కేసుల్లో నేరగాళ్లు నిర్దోషులుగా విడుదలవుతుంటే చట్టాలంటే భయభక్తులెలా ఉంటాయి? పిల్లలు భద్రంగా ఎలా ఉంటారు?

మృగాళ్ల బారినపడుతున్న బాలబాలికల్లో అత్యధిక శాతం మంది నిరుపేద కుటుంబాలకు చెందినవారు. కనుక ఆ కుటుంబాలకు చదువుసంధ్యలు అంతంతమాత్రం. ఈ రెండు కారణాలవల్లా నేరగాళ్లు పోలీసుల్ని సులభంగా ప్రభావితం చేస్తున్నారు. ఏళ్ల తరబడి కేసులు తెమలకుండా చూస్తున్నారు. ఇక రాజకీయ పలుకుబడి ఉంటే చెప్పనవసరమే లేదు. కథువా ఉదంతంలో అప్పటి పీడీపీ–బీజేపీ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు నిందితులకు మద్దతుగా జరిగిన ర్యాలీలో పాల్గొని వారిని వెనకేసుకొచ్చారు. అక్కడి బార్ అసోసియేషన్, హిందూ ఏక్తామంచ్ వంటి సంస్థలు సైతం ఆ ర్యాలీలో పాల్గొన్నాయి. మరణశిక్ష వంటి కఠినమైన శిక్ష ఉండటం వల్ల మంచి కంటే చెడే అధికంగా జరుగుతుంది. నేరగాళ్లలో అత్యధికులు బాధిత కుటుంబానికి తెలిసినవారో, సన్నిహితులో అయి ఉంటారు. కనుక తమవారికి మరణశిక్ష పడుతుందన్న సందేహంతో ఆ కుటుంబాలు అసలు ఫిర్యాదు చేయడానికే వెనకాడతాయి. పోక్సో కేసుల కోసం 1,023 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు నెలకొల్పుతామని బిల్లు ప్రవేశపెడుతూ కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి స్మృతి ఇరానీ చెప్పారు. మంచిదే. కానీ ఇవి మరింతగా పెంచాలి. దాంతోపాటు మనుషుల్లో నీచాభిరుచుల్ని ప్రేరేపించి, మానవ బలహీనతలతో వ్యాపారం చేసే రకరకాల ధోరణులను రూపుమాపాలి. అప్పుడు మాత్రమే మన దేశంలో బాల్యం సురక్షితంగా, భద్రంగా ఉండగలుగుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, తిథి బ.నవమి ప.3.24 వరకు, తదుపరి దశమి నక్షత్రం భరణి ప.3.40 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం తె.4.02 నుంచి 5.43 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం ఉ.8.13 నుంచి 9.04 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.22 వరకు, అమృతఘడియలు... ఉ.10.35 నుంచి 12.16 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

# ఎర్రజెండాకు దళిత 'స్పృహ'!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

**గత 95 ఏళ్లుగా భారత కమ్యూనిస్టు పార్టీల (సీపీఐ, సీపీఎం) ప్రధాన కార్యదర్శిగా ఒక్కరంటే ఒక్క దళితనేత కూడా ఎంపికైన చరిత్ర లేదు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంలతో సహా ఏ పాలకపార్టీ కూడా దళితులను నాయకత్వ స్థానాల్లోకి ఎదిగించని తరుణంలో డి. రాజాకు సీపీఐ అత్యున్నత స్థానం కట్టబెట్టడంతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సుదీర్ఘ కాల పక్షపాతం నుంచి విముక్తి చేసినట్లయింది. సీపీఐ ప్రధాన కార్యదర్శిగా డి. రాజా నియామకం చారిత్రాత్మక చర్య. విజ్ఞత కలిగిన కమ్యూనిస్టుగా, సిద్ధాంతవేత్తగా, స్ఫూర్తి దాయక మూర్తిగా ఎదిగిన ఈ దళిత నాయకుడి ఎంపిక వామపక్ష–అంబేడ్కర్ వాదుల్లో ఒక నూతన స్ఫూర్తిని కలిగించే చర్య. ఈ రెండు పక్షాలతో రాజా సజీవ సంబంధాలను కొనసాగించడం భవిష్యత్ ఐక్యతకు బలం చేకూరుస్తుంది కూడా. తన సొంత ప్రతిభాపాటవాలపై ఆధారపడి ఎదిగివచ్చిన డి. రాజా అందరి ప్రశంసలకు అర్హుడు.**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా డి. రాజా నియామకం ఒక చారిత్రాత్మక చర్య. భారత జాతీయ కమ్యూనిస్టు నేతగానే కాకుండా, విజ్ఞత కలిగిన కమ్యూనిస్టుగా, సిద్ధాంతవేత్తగా, స్ఫూర్తిదాయక మూర్తిగా ఎదిగిన దళిత నాయకుడు డి. రాజా. మండల్ అనుకూల, వ్యతిరేక ఉద్యమాలు భారత రాజకీయ చరిత్రను మార్చివేసిన తర్వాత, వామపక్షాల నుంచి దళిత బహుజనులకు, కమ్యూనిస్టులకు మధ్య సాధికారిక స్వరంతో చర్చలు జరిపిన ఏకైక నేత డి. రాజానే.

దామోదరం సంజీవయ్య తర్వాత కాంగ్రెస్ పార్టీలో సైతం పార్టీ అధ్యక్షుడిగా దళితుడికి అవకాశం ఇచ్చిన చరిత్ర లేదు. భారతీయ జనతా పార్టీ బంగారు లక్ష్మణ్‌ని పార్టీ అధ్యక్షుడిగా ప్రోత్సహించింది కానీ ఆయన తన సొంత సామర్థ్యం ప్రాతిపదికన అత్యున్నత పదవికి ఎంపిక కాలేదన్నది అందరికీ తెలిసిందే. కానీ స్టింగ్ ఆపరేషన్‌లో కేవలం లక్ష రూపాయలు తీసుకుంటూ పట్టుబడిన బంగారు లక్ష్మణ్ చివరకు దాదాపుగా జైలులోనే మృతి చెందాల్సి రావడం విషాదకరం.

భారత రాష్ట్రపతి పదవిలో అయిదేళ్ల పూర్తికాలం సౌఖ్యంగా గడిపిన ఏకైక దళిత నేత కె.ఆర్. నారాయణన్. ఈయన స్వతహాగా మేధావి. మరో దళిత నేత రామ్‌నాథ్ కోవింద్ ప్రస్తుతం రాష్ట్రపతిగా వ్యవహరిస్తున్నారు కానీ ఆయన పదవీ విరమణ సమయానికి రాష్ట్రపతి పదవిపై, దేశ చిత్రపటంపై ఎలాంటి ముద్ర వేయనున్నారో చూడటానికి మనం వేచి ఉండాల్సిందే.

కానీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1962లో తొలిసారిగా విడిపోయింది. తర్వాత మావోయిస్టు గ్రూపుల చీలికలతో మరోసారి చీలిపోయింది. ఇలా పలుసార్లు కమ్యూనిస్టు పార్టీలో చీలికలు ఏర్పడ్డాయి. తదనంతర కాలంలో సభ్యుల పరంగా, ఎన్నికల పరంగా సీపీఎం పెద్ద పాత్ర పోషించినప్పటికీ సీపీఐ కమ్యూనిస్టు సిద్ధాంత చుక్కానిగా కొనసాగుతూ వస్తోంది.



### చారిత్రక తప్పిదానికి సవరణ

మండల్ ఉద్యమం, అంబేడ్కర్ భావజాలం భారతీయ దళిత–బహుజనుల సామాజిక, రాజకీయ ప్రతిపత్తిని మార్చివేసిన తర్వాత, దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు నైతికంగా వెనుకంజ వేసి దెబ్బతిన్నాయి. 1925లో దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత దాదాపుగా గత 95 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీల (సీపీఐ, సీపీఎం) ప్రధాన కార్యదర్శిగా ఒక్కరంటే ఒక్క దళితనేత కూడా ఎంపికైన చరిత్ర లేదు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంలతో సహా ఏ పాలకపార్టీ కూడా డి. రాజా వంటి నేతను తమ పార్టీల నిర్మాణంలో ఎదిగించని, రూపొందించని తరుణంలో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా డి.రాజాకు అత్యున్నత స్థానం కట్టబెట్టడం అనేది కమ్యూనిస్టు ఉద్యమాన్ని పక్షపాతం, దురభిమానాల నుంచి విముక్తి చేసినట్లయింది.

డి. రాజా ఇంతటి అత్యున్నత స్థానాన్ని సాధించుకున్నప్పటికీ, దీనికి గాను ఆయన పార్టీని నిజంగా అభినందించాల్సి ఉంది. ఎందుకంటే సీపీఎం నేటివరకు ఒక్కరంటే ఒక్క దళిత్‌ని/ఆదివాసీని తన పొలిట్ బ్యూరోలోకి తీసుకోలేకపోయింది. కాబట్టే దళితులు, ఆదివాసులు సీపీఎం, ఆరెస్సెస్ మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదని భావిస్తున్నారు. సీపీఎం లాగా, ఆరెస్సెస్ కూడా తన అత్యున్నత స్థానంలోకి ఒక దళితుడిని, ఆదివాసీని ప్రోత్సహించలేదు. (బంగారు లక్ష్మణ్ మినహాయింపు). కమ్యూనిస్టులు మాటల్లో కాకుండా చేతల్లో తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. దిగువ కులాలకు చెందిన ప్రజారాశులు.. ప్రతి ఒక్కరినీ వారి చేతల ద్వారానే అంచనా వేయగలిగినటు వంటి తమ సొంత మేధావులను తయారు చేసుకున్నాయని కమ్యూనిస్టులు తప్పకుండా అవగాహన చేసుకోవాలి.

### కార్మికులు–అగ్రకుల నాయకత్వం

కమ్యూనిస్టు ఉద్యమాలు ప్రజాసముద్రంలోని అలలు వంటి వారయినట్లయితే, దాని నేతలు ఆ అలల నుంచి పుట్టుకొచ్చిన నురుగు లాంటివారని చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్ తొలి ప్రధానమంత్రి చౌఎన్‌లై పేర్కొన్నారు. కానీ భారతదేశంలో తొలినుంచి జరుగుతూ వచ్చింది ఏమిటంటే దళిత బహుజన సామాజిక బృందాలనుంచి కార్మికులుగా, కర్షకులుగా, కూలీలుగా అలలు పుట్టుకొస్తే, నాయకులు మాత్రం ఆ అలలతో సంబంధం లేని ఎగువ కులాల నుంచి పుట్టుకొచ్చారు.

కనీసం తొలినాళ్లనుంచి పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు నాయకత్వం దళిత బహుజన శ్రేణులనుంచి పుట్టుకొచ్చి ఉంటే బాగుండేది. కానీ వారలా చేయలేదు. దీంతో కమ్యూనిస్టు పార్టీలోని ఎగువ కులాలకు చెందిన నాయకులు ఉద్దేశపూర్వకంగానే దళిత, ఆదివాసీ కార్యకర్తలను క్షేత్ర స్థాయిలోనే ఉంచి, అలలపైన నురగలాగా మారడానికి వారిని అనుమతించలేదన్న అభిప్రాయాన్ని కలిగించారు.

ఈ క్రమంలో కార్మిక వర్గం వెలుపలి నుంచే మేధోనాయకత్వం పుట్టుకొస్తుందని చెప్పిన లెనిన్ సూత్రీకరణలపైనే భారతీయ కమ్యూనిస్టు నాయకులు విశ్వాసం ఉంచుతూ వచ్చారు. ఉదాహరణకు భారతదేశంలోని బ్రాహ్మణ జనాభా ఎన్నడూ కమ్యూనిస్టు ఉద్యమ మద్దతుదారులుగా లేరు. కానీ కమ్యూనిస్టు మేధో నాయకులు మాత్రం బ్రాహ్మణులనుంచి వచ్చారు. బ్రాహ్మణులు మాత్రం ఎల్లప్పుడూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీతోనే కలిసి ఉండేవారు. ఎందుకంటే వీటి సంస్థాగత నిర్మాణాలు వారి సామాజిక–ఆధ్యాత్మిక హృదయానికి, ఆలోచనలకు అతి దగ్గరగా ఉండేవి మరి.

దీనికి భిన్నంగా, దళిత్, ఓబీసీలకు చెందిన ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీల పక్షాన్నే ఉండేవారు కానీ వీరినుంచి మేధోగత నాయకులు ఎదిగి వచ్చేవారు కాదు. బహుశా కమ్యూనిస్టు పార్టీల్లోని క్షేత్ర స్థాయి ప్రజానీకానికి తగిన విద్య, మేధో పరిపక్వత లేకపోవడం ఒక సమస్యే కావచ్చు. ఈ పరిమితి ఉన్నప్పటికీ, సాధారణ ప్రజా రాశులనుంచి నాయకులకు శిక్షణ నివ్వడంపై కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టి ఉండాలి.

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వంటి ఉన్నత విద్యా సంస్థలలో అలాంటి చక్కటి మేధోవంతమైన యువత పుట్టుకొచ్చే సమయానికి, వాటిలో అంబేడ్కరిజం బలపడింది. దీంతో దళిత్, ఓబీసీలకు చెందిన యువత వామపక్ష భావాలవైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, కమ్యూనిస్టు పార్టీల్లోని అగ్రశ్రేణి నేతలు దిగువ కులాలనుంచి నాయకులు ఆవిర్భవించడానికి అనుమతించడం లేదన్న అనుమానం క్రమేణా వారిలో పెరుగుతూ వచ్చింది. అందుకే ఆనాటి నుంచి వారు అగ్రకుల కమ్యూనిస్టు నాయకులను అనుమానించడం మొదలుపెట్టారు. అయితే డి.రాజా సీపీఐలో అత్యున్నత స్థాయికి ఎదగడం అనేది వామపక్ష అంబేడ్కర్ వాదుల్లో ఖచ్చితంగా ఒక కొత్త వాతావరణాన్ని కలిగిస్తుంది. ఈ రెండు పక్షాలలో రాజా సజీవ సంబంధాలను కొనసాగించడం కూడా దీనికి కారణం కావచ్చు.

### ప్రతిభాపాటవాలతోనే ఉన్నతి

పెరియార్ ఈవీఆర్ రామస్వామి కాలం నుంచి దిగువ కులాల నాయకత్వం బలంగా రూపొందిన సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్న తమిళనాడు నుంచి డి.రాజా పుట్టుకొచ్చారు. డీఎంకే దివంగత నేత ఎం. కరుణానిధి నాయీ బ్రాహ్మణ సామాజిక బృందం నుంచి ఎదిగివచ్చారు. (ఈయన పూర్వీకులు ఆలయ సంగీత విద్వాంసులుగా, గాయకులుగా జీవించేవారు) ఇప్పుడు డి. రాజా తమిళనాడులోని దళిత కమ్యూనిటీ నుంచి ఎదిగివచ్చారు. అయినంతమాత్రాన రాజా స్వీయ ప్రతిభను కానీ, మన సావాచా కమ్యూనిస్టు ఉద్యమాచరణకు అంకితం కావడాన్ని కానీ ఎవరూ తోసిపుచ్చలేరు. తన సొంత ప్రతిభాపాటవాలపై ఆధారపడి ఎదిగివచ్చిన రాజా అందరి ప్రశంసలకు అర్హుడు.

తన సైద్ధాంతిక భూమికను వదులుకోకుండానే ఏ సామాజిక బృందంతోనైనా చర్చించగల, వ్యవహరించగల నిఖార్సయిన నేత డి. రాజా. ప్రత్యేకించి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాల్లో స్పష్టంగా కనిపించే ఒంటెత్తువాదానికి ఆయన చాలా దూరం. పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలు, బృందాలను ఐక్యపరచి నేపాల్ తరహా పంథాలో భారతదేశాన్ని నడిపించగల పరిపూర్ణ వ్యక్తిత్వం ఆయనది. కమ్యూనిస్టు ఉద్యమంలో సానుకూల మార్పులను తీసుకురావడానికి సీపీఎం కూడా ఈ అవకాశాన్ని తప్పక ఉపయోగించుకుంటుందని ఆశిద్దాం.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### అంతేగా..



"స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ రమాదేవిని ఉద్దేశించి ఎంపీ అజంఖాన్ చేసిన వ్యాఖ్యలు అవమానకరం. ఎటువంటి లింగవివక్ష వ్యాఖ్యలు చేసినా తప్పించుకోగలనని ఆయన అనుకుంటున్నాడు. ఎందుకంటే, ఎప్పుడూ తమ నేత అఖిలేశ్ యాదవ్ తనని కాపాడతాడని నమ్మకం. ఎంపీ జయప్రద గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఎంపీని మనం ఎన్నుకున్నప్పుడు అతడు మరో మహిళను అవమానించడం తప్ప ఏం చేస్తాడు?"

– సాక్షి జోషి, జర్నలిస్ట్

### కృతజ్ఞత



"కేన్సర్‌ను జయించి ఏడేళ్లయ్యింది. ఆరోగ్యంగా ఉన్నా. నాలోని సృజనాత్మకతను సంతృప్తి పరిచేలా ఎన్నో పనులు చేయాలనుకుంటున్నాను. నాపట్ల ఎంతో ప్రేమను, ఆప్యాయతను చూపించిన సమాజానికి తిరిగి ప్రేమను పంచడం నా బాధ్యత. కృతజ్ఞతను చూపకుండా ఎలా ఉంటాను?"

– మనీషా కోయిరాలా, హీరోయిన్

### స్ఫూర్తి



"అయాన్ ర్యాండ్ లాంటివారు రాసిన అనేక స్ఫూర్తిదాయక కథనాలు చదివిన తరువాతే నేను సినిమా పరిశ్రమలోకి వచ్చాను. తటస్థ వైఖరితో పనిచేసుకుంటూ పోవడమే నాకు ఇష్టమైన పద్ధతి. ఇప్పుడు నాపైనే అటు వంటి స్ఫూర్తిదాయక కథనం రావడం సంతోషంగా ఉంది"

– పూరీ జగన్నాథ్, దర్శకుడు

### పనితీరు



"పాకిస్తాన్ ప్రజలను పాలించడానికి ఎన్నికైన ప్రభుత్వపు ఏడాది పని తీరును ఓసారి సమీక్షించుకుందాం. నిజం గొంతు నొక్కేశారు, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది, రాజకీయ ప్రత్యర్థులను జైలులో పెట్టారు. జర్నలిస్టులు ఉద్యోగాలు కోల్పోయారు, ఉన్నత విద్య ఎవరి దయవల్లనో కొనసాగుతోంది"

– అయిమా ఖోసా, జర్నలిస్ట్

### దాడి



"భారతీయ స్నేహితులతో కూడిన ఒక వాట్సాప్ గ్రూప్‌లో మా అమ్మ కూడా ఉంది. ఆ గ్రూప్‌లోని వాళ్లంతా వివిధ నేపథ్యాలకు చెందినవారు. వారిలో క్రైస్తవులు, పార్శీలు, హిందువులు, ముస్లింలు కూడా ఉన్నారు. మూకదాడులను ఖండిస్తూ ఒక క్రైస్తవ స్నేహితురాలు ఒక పోస్ట్ షేర్ చేసింది. వెంటనే ముగ్గురు హిందూ స్నేహితులు ఆమెపై దాడి చేయడం ప్రారంభించారు. ఏళ్ల తరబడి స్నేహం ఉన్నవారి మధ్య ద్వేషం ఆశ్చర్యంగా ఉంది"

– నీర్జ గొగోయ్, లౌకికవాది

# ఆర్టీఐకి మరణశాసనం

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

ప్రధానమంత్రి మోదీ పారదర్శకత అంటే చాలా ఇష్టపడతారు. అవినీతిని సహించేది లేదని పదేపదే చెప్పారు. గుజరాత్‌లో అనేక సార్లు, కేంద్రంలో ప్రధానిగా రెండుసార్లు గెలిపించారంటే మోదీ మాటను జనం పూర్తిగా నమ్మారని నమ్మక తప్పదు. పారదర్శకతను పెంచడానికి మాత్రమే ఆర్టీఐని సవరిస్తున్నానని మంత్రిగారు, బీజేపీ అధికార ప్రతినిధులు నమ్మబలుకుతూనే ఉన్నారు. ప్రభుత్వం దగ్గర దాచుకోవడానికి ఏమీ లేదని, గుట్టు దాచడంకన్న విప్పి చెప్పడంలోనే వారి శ్రేయస్సు ఉందని మనం అనుకుంటున్నాం. కానీ, పదిరూపాయలు పడేసి ఆర్టీఐ కింద ఓ దరఖాస్తు రాసేసి మాప్రాణం తీస్తున్నారని ప్రభుత్వ పెద్దలు కోప్పడుతున్నారు. సమాచార హక్కు చట్టాన్ని నిస్తేజం చేయడానికి కేంద్రం దాదాపు తొమ్మిది నెలల నుంచి ప్రయత్నిస్తూనే ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ ప్రతిపాదనకు తీవ్రమైన వ్యతిరేకత రావడంతో కాస్త వెనుకంజ వేసింది. తరువాత మే నెలలో జరిగిన ఎన్నికలలో ప్రజలు అద్భుతమైన రీతిలో విజయం కట్టబెట్టడంతో తాము ఏం చేసినా చెల్లుతుందనే సాహసిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ సవరణ తంతు పూర్తి చేసి సమాచార కమిషనర్లను తమ కింది స్థాయి ఉద్యోగులుగా మార్చడానికి అన్నీ సిద్ధం చేసుకుంటున్నది. లోక్‌సభలో, రాజ్యసభలో కూడా ఆమోదం పొందింది. రాష్ట్రపతి అయినా దీని మీద సంతకం పెట్టకుండా ఆపుతారేమోననుకుంటే అది దింపుడు కళ్లం ఆశేనేమో.

ఇప్పుడు కేంద్రంలో ఎన్నికల కమిషన్‌తో సమాచార కమిషనర్‌కు సమాన స్థాయి, హోదా, అధికారం వేతనం ఉండాలని చట్టం నిర్దేశించింది. ఎన్నికల కమిషనర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమాన హోదా కలిగి ఉంటారు. అయిదేళ్లు లేదా 65 సంవత్సరాల వయసు ఏది ముందైతే ఆ కాలానికి పదవి ముగుస్తుందని చట్టంలో చేర్చారు. అంటే ప్రభుత్వ ఇష్టాయిష్టాలపై కమిషనర్ మనుగడ ఆధారపడదు. కనుక ప్రభుత్వ పెద్దల ఆగ్రహానుగ్రహాలతో సంబంధం లేకుండా సొంతంగా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద పెద్ద అధికారులు తీసుకున్న నిర్ణయాల సమాచారాన్ని పౌరుడు ఈ చట్టం కింద తెలుసుకునే హక్కు పొందాడు. నిజానికి ఈ సమాచారం వెల్లడికావడం వల్ల ఎవరికీ హాని ఉండదు. కానీ వెల్లడైన ఈ సమాచారం ద్వారా అందాకా దాగిన రహస్యాలు బయట పడితే జైలుకు పోయే ప్రమాదం కూడా వస్తుందని ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారు. ఈ భయం ఆర్టీఐకి ఎసరుగా మారింది. ఆర్టీఐ పూర్తిగా తీసివేయడానికి కూడా ఈ పాలకులకు భయమే. కనుక ఆర్టీఐ కోరలు పీకాలి. కాటేయడానికి వీల్లేని పాముగా మార్చి, వారి నాగస్వరానికి నాట్యం చేసే బానిసగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్నికల కమిషన్ స్థాయిని సమాచార కమిషనర్‌కు ఇవ్వడం తప్పు కనుక తగ్గిస్తాం అని చట్టం లక్ష్యాల ప్రకటనలో పేర్కొన్నారు. తగ్గించనీ అనుకుందాం. ఏ స్థాయికి తగ్గిస్తారు? ఆ విషయం రహస్యం. పోనీ తగ్గించే జీతం ఎంత? అయిదేళ్ల పదవీకాలాన్ని ఎంత కాలానికి తగ్గిస్తారు? అదీ చెప్పరు. మామూలు జనాలకే కాదు, పార్లమెంటు సభ్యులకు కూడా చెప్పడం లేదు. సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకత పెంచడం కోసం సవరిస్తున్నామని చెబుతూ, సవరణ చట్టం ద్వారా ఏం సవరిస్తున్నారో పార్లమెంటుకు కూడా చెప్పకుండా దాచడమే పారదర్శకత పెంచడమా? తాము నిర్దేశించబోయే నియమాలకు అనుగుణంగా కమిషనర్ స్థాయి నిర్ణయిస్తామని చేర్చడమే ఈ చట్టం సవరణ. అంటే స్థిరంగా ఒక పాలసీ లేదు. ప్రభుత్వంలో ఎవరుంటే వారి ఇష్టం వచ్చిన రీతిలో స్థాయిని నిర్ణయించుకోవచ్చు అని దీని అర్థం. ఉదా॥కు... ఓసారి ఇద్దరు కమిషనర్లను నియమించాలనుకుంటే అప్పుడు కొన్ని సూత్రాలు కనిపెడతారు. ఓ రెండేళ్ల పదవీకాలం, జాయింట్ సెక్రటరీ హోదా అని, ఆ తరువాత రెండేళ్లకు వచ్చే ఖాళీలు పూరించడానికి పూనుకున్నప్పుడు మూడేళ్ల పదవీకాలం, డిప్యూటీ సెక్రటరీ హోదా అని కూడా అనవచ్చు. రాష్ట్రాలు నియమించే కమిషనర్లకు కూడా కేంద్రమే హోదాను, వేతనాన్ని, పదవీకాలాన్ని నిర్ణయిస్తుందట. జనం అడిగిన సమాచారం ప్రభుత్వానికి ఇబ్బందికరమైతే ఇవ్వకూడదు అన్నది పైకి చెప్పని ఆదేశం. బహిరంగ రహస్యం. కాగితాల మీద కనిపించదు.

సమాచార హక్కు సవరణను కనుక రెండు సభలు ఆమోదిస్తే, ఇక మళ్లీ సవరించే అవసరం లేదు. ఆ చట్టంలో మిగిలేది ఏమీ ఉండదు కనుక. ఈ బిల్లును అత్యంత రహస్యంగా కాపాడి, సభ్యులు చదువుకుని మార్పులు ప్రతిపాదించే వీలు లేకుండా బిల్లు ప్రవేశ పెట్టడానికి కొన్ని గంటల ముందు మాత్రమే చెప్పి, హడావుడిగా ముందుకు తోశారు. ఈ హక్కును అమలులో నీరుగార్చేందుకు, అనేక ప్రభుత్వ విభాగాలలో ఒకదానిగా మార్చి అనుబంధ శాఖగా మార్చేందుకు వేసిన పకడ్బందీ ప్రణాళిక అని స్పష్టంగా విశదమవుతూ ఉన్నది. పార్లమెంటు నుంచి అధికారాన్ని గుంజుకునే సవరణ ఇది. ఇది ఆర్టీఐ కమిషనర్ వ్యవస్థకు మరణశాసనం.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# ఇంటింటి పేరు ఇంద్రగంటి

ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారిని తలచుకున్నప్పుడు ఆకాశవాణిలో పాటకూ మాటకూ పట్టంకట్టిన అక్షర మాంత్రికుడు కళ్లెదుట సాక్షాత్కరిస్తాడు. పదాల సంగీతం తెలిసినవాడు, గురులఘువుల నడక తెలిసినవాడు శర్మ. పత్రికలలో పని చేసినన్నాళ్లూ కథలకీ, కవిత్వానికీ, పుస్తక సమీక్షలకీ మాత్రమే పరిమితమై ఉన్న శర్మగారి మూర్తిమత్వం 1976లో రేడియోలో చేరాక వేయింతలుగా పరిఢవిల్లింది. యక్షగానాలు, రూపకాలు, శ్రవ్య నాటకాలు, పాటలు ఇలా అన్ని ప్రక్రియలను సమర్థంగా నిర్వహించారు. రేడియోలో అవసరార్థం అప్పటికప్పుడు చేయవలసిన రచనలు అనేకం ఉంటాయి. అలా రాయగలిగిన సిద్ధహస్తులూ ఉంటారు. కానీ శర్మగారు ఆ స్థాయి మనిషి కాదు. అంతకన్నా పైస్థాయి ఆయనది.

శర్మగారు రేడియోకి రాసిన మొట్టమొదటి రూపకం చైతన్య లహరి. ప్రముఖ సంగీత విద్వాంసులు ఓలేటి వేంకటేశ్వర్లుగారు ఆ రూపకానికి సంగీతం సమకూర్చారు. అది ఆరంభం. అప్పటి నుంచి శర్మగారు రేడియో రూపక రచనా విధానాన్నే పూర్తిగా మార్చేశారు. ఒకరిద్దరు నెరేటర్లో సూత్రధారులో కథ చెబుతూ వుంటే మధ్యమధ్యన నాలుగైదు పాటలు చొప్పించి ప్రసారం చేసే పాత పద్ధతి పోయి పాట–మాట లయబద్ధంగా సాగుతూ వాటి చుట్టూరా సంగీతం అల్లుకుని అదేదో అద్భుత శబ్ద చిత్రం అనిపించేలా రూపకాలు రూపుదిద్దుకోడం ప్రారంభించాయి. నేపథ్య సంగీతాలు, ఇంటర్‌లూడ్‌లు వచ్చాయి. స్వరపుష్పాల్లా భాసించాయి. శర్మగారు సారస్వత ప్రియులే కాదు, స్నేహ ప్రియులు కూడా. నాకు సంగీతమూ తెలీదు, సాహిత్యమూ తెలీదు. కానీ నేను ఆయన స్నేహాన్ని అగ్గలంగా అనుభవించాను.

రేడియోలో మాతోపాటు పని చేసిన శిష్టా భాస్కర శ్రీరామమూర్తి (రామం), కలగా కృష్ణమోహన్, మల్లాది సూరిబాబు లాంటి వాళ్లతో ఆయనకు చిక్కోటి మైత్రీ బంధం ఉండేది. 1986–96 మధ్య



నివాళి

శర్మగారు 15 రూపకాలు రాస్తే వాటిలో పదకొండు ఆకాశవాణి జాతీయ స్థాయిలో నిర్వహించే వార్షిక పోటీల్లో మొదటి బహుమతులు గెలుచుకున్నాయి. శర్మగారు రాసిన 'వర్షానందిని' సంగీత రూపకానికి 1986లో ప్రథమ బహుమతి లభించింది. కలగా కృష్ణమోహన్ సంగీతం. విశేషమేమిటంటే ప్రముఖ సంగీత విద్వాంసులు కొన్నెకుడి వైద్యనాథన్ చెన్నయ్ ఆకాశవాణి కేంద్రం నుంచి పంపిన ఎంట్రీకి ఆ ఏడాది రెండవ బహుమతి లభించింది. 1987లో శర్మగారు రచించిన 'గంగావతరణం', 88లో 'మాట మౌనం', తరువాత 'తలుపు', 'ఈ చీకటికి అవతల' బహుమతులు గెలుచుకున్నాయి.

ఇక శర్మగారి పాటల సంగతికొస్తే సూరిబాబు ఎంత పులకరిస్తూ చెబుతాడో. శర్మ వెళ్లిపోయాడురా అంటే–అతను మాట్లాడలే, పాటలే పాడాడు. 'ఈ హాయిలో ఎదడోలలూగి..', 'శ్రావణాన మధురమైన వలపుతలపు తేనెసోన..', 'వలపంతా పులకింత చెప్పవేలనే కాంత..', 'తెరుపు మరపు మనసులో విరజాజి వెన్నెల నీడలో..' ఆపడే, కన్నీళ్లూ పాటా కలగలిసి వస్తున్నాయి. 1977లోనో, 78లోనో ఎం.ఎస్. శ్రీరామ్ సినిమా రంగం నుంచి వచ్చి రేడియోలో సంగీత విభాగం అధిపతిగా చేరారు. ఆయన శర్మగారికి రెండు ట్యూన్ లిచ్చి పాటలు రాయమన్నారు. అప్పుడు రాసిన పాటలలో ఒకటి 'తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా' అన్నది. బహుళ జనాదరణ పొందిన దేశభక్తి గీతం. ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం రోజునా పిల్లలు ఈ పాట పాడాల్సిందే. ఇంకో పాట నాకు సరిగా గుర్తు లేదు. 'తిరుణాళ్లకు తరలొచ్చే కన్నె పిల్లలా..'అంటూ మొదలవుతుంది. శర్మగారి పాటలన్నిటిలో అసదృశమైన వశీక రణం ఉంది. పాట వింటున్నంతసేపూ మనల్ని మనం మరచిపోతాం. శర్మగారు ఈ మధ్యకాలంలో తీవ్ర అనారోగ్యంలో వున్నప్పటికీ శారదా శ్రీనివాసన్ కోరిక మేరకు రేడియో కోసం 'ఆమ్రపాలి' నాటకం రాశారు. గత ఏడాది హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారమైంది. 'ఆమ్రపాలి'గా శారదా శ్రీనివాసన్ నటిస్తే రామం ఆ నాటకాన్ని సమర్పించాడు. అది అశేషంగా శ్రోతల అభిమానాన్ని చూరగొంది. శర్మగారి చివరి రచన అది. శర్మగారు ఏది రాసినా దానికి రంగు, రుచి, వాసన ఉంటాయి. 'వెన్నెల'కు నివాళిగా ఉంటుంది.

(గురువారం వేకువజామున కన్నుమూసిన ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ స్మృతిలో...)

ప్రయాగ రామకృష్ణ
మొబైల్ : 98499 90107

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శుక్రవారం
26-7-2019



# లైకా? రాంగా?

**సినీ తారలతో ఫ్యాన్స్‌కు ఉండేది ఆత్మబంధం! పైకి ఏదో అలా సినిమా చూసి వచ్చేసినట్లే ఉంటారు. లోలోపల మాత్రం టెంపుల్స్ కట్టేసుకుంటారు. టెంకాయలు కొట్టేసుకుంటూ ఉంటారు. ఆ అభిమానం ఇప్పుడు కొత్త 'ట్రోల్స్' తొక్కుతోంది. ఎవరైనా తమ 'దేవత'ను ఒక మాటంటే ఒప్పుకోనట్లే.. మాట అనిపించుకునేలా ఆ దేవత ఉన్నా.. అంగీకరించడం లేదు! ఈ ధోరణికి మనం లైక్ కొట్టాలా? రాంగ్ కొట్టాలా?**

● దీపికా పదుకోన్ ● భూమి ఫడ్నేకర్ ● ప్రియాంక చోప్రా ● తాప్సీ ● రష్మిక

సందర్భ శుద్ధి గల ఒక బుద్ధి లేని ప్రశ్న.

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్నా.. రిలేషన్‌లో ఉన్నారా?

బుద్ధిహీనతకు అకేషన్ అక్కర్లేదు. ఈరోజు 'డియర్ కామ్రేడ్' విడుదల అవుతోంది కాబట్టి, అర్థం పర్థం లేని ఈ ప్రశ్న సందర్భోచితం అయింది.

విజయ్ మోస్ట్ డిజైరబుల్ ఇప్పుడు. అమ్మాయిలు అతడి కోసం పడి చస్తున్నారు. రశ్మిక మోస్ట్ వాంటెడ్. అబ్బాయిలు ఆమె సినిమాల కోసం పడిగాపులు కాస్తున్నారు. విజయ్–రశ్మిక కంబైండ్‌గా మోస్ట్ అసూయబుల్. విజయ్‌ని రశ్మికతో చూస్తున్న అమ్మాయిలు, రశ్మికను విజయ్‌తో చూస్తున్న అబ్బాయిలు.. గుండెలు బద్దలు చేసుకుంటున్నారు. ఒకవేళ నిజంగానే విజయ్, రశ్మికల మధ్య రిలేషన్ ఉంటే.. రెండు జండర్‌లలో కొన్ని గుండెలు ఆగిపోతాయా!

ఆగబోయే గుండెల్ని విజయ్, రశ్మిక కలిసి 'మా మధ్య అలాంటిదేమీ లేదు' అనే ఒక్క స్టేట్‌మెంట్‌తో ఆపగలరు. అయితే 'డియర్ కామ్రేడ్' సినిమాను బాయ్‌కాట్ చెయ్యాలని కర్ణాటకలో మూడు రోజులుగా జరుగుతున్న ఉద్యమాన్ని ఆపడం మాత్రం ఒక్క రశ్మిక చేతుల్లోనే ఉంది.. చిన్న అపాలజీ స్టేట్‌మెంట్‌తో! అపాలజీనా? ఏం చేశారావిడ?

## 'కన్నడం కష్టం' అన్నందుకు!



● 'గీత గోవిందం' చిత్రంలో విజయ్ దేవరకొండ, రశ్మిక

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం.. ఒకే రోజు నాలుగు భాషల్లో ఇవాళ స్క్రీన్‌ల మీదికి వస్తోంది 'డియర్ కామ్రేడ్'. 'అర్జున్‌రెడ్డి'తో విజయ్ దేవరకొండ, 'గీత గోవిందం' తో రశ్మిక మందన్నా దక్షిణాదికి హార్ట్ బీట్ అయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో నెంబర్ వన్ హీరోయిన్ రశ్మిక ఇప్పుడు. మహేశ్ బాబు, అల్లు అర్జున్‌తో కూడా నటించబోతున్నారు. సినిమాలు తప్ప ఆమె మనసులో ఏమీ లేవు. దేవరకొండ అసలే లేడు. బాగా నటించాలి. అంతవరకే. 'విజయ్ దేవరకొండ సినిమా అనగానే ఒప్పేసుకున్నారా' అని మనవాళ్లు అడగ్గానే, 'అంతలేదు' అని రశ్మిక వెంటనే చెప్పేయలేదా? ఆమె క్లియర్‌గానే ఉన్నారు. భాష తెలియకపోయినా, భాష రాకపోయినా! సినిమా ప్రమోషన్‌కి చెన్నై వెళ్లినప్పుడు తమిళ్ వాళ్లు అడిగారు.. 'డబ్బింగ్ కష్టం కాలేదా?' అని. 'అంత తేలిక అయితే కాదు' అని చెప్పారు రశ్మిక. ఆ ప్రశ్నకు ముందు వాళ్లు వేసిన ప్రశ్న ఇంకొకటి ఉంది. 'మిగతా మూడు భాషలతో కంపేర్ చేస్తే మీ మాతృభాష కన్నడలో మీకు డబ్బింగ్ ఈజీ అయి ఉంటుంది కదా' అని. అది తమిళ్ ఇంటర్వ్యూ కనుక రశ్మిక తమిళ్‌లోనే ఆన్సర్ చేశారు. 'అదు కష్టం. ఎనకు ఏ లాంగ్వేజ్ కరెక్ట్ అగి వరాదూంగా' అన్నారు. 'అది కూడా కష్టమే. నేను ఏ భాషనూ కరెక్టుగా మాట్లాడలేను' అని. కన్నడ ఫ్యాన్స్ ఈ మాటను పట్టుకున్నారు. 'కన్నడ అమ్మాయికి కన్నడం కష్టం అవడమేంటి.. స్టైయిల్ కాకపోతే!' అని సోషల్ మీడియాలో ఆమెను ట్రోల్ చేశారు. 'యాంటీ–కన్నడ కామెంట్స్ చేసినందుకు నిరసనగా రశ్మిక నటించిన 'డియర్ కామ్రేడ్' సినిమాను బాయ్‌కాట్ చెయ్యాలని ట్విట్టర్‌లో పెద్ద ఉద్యమమే లేవదీశారు. రక్షిత్‌శెట్టితో రశ్మిక విడిపోయినప్పుడు కూడా ఇలాంటి ఉద్యమమే కొన్నాళ్లు నడిచింది.

రక్షిత్ కన్నడ నటుడు. సినీ నిర్మాత. స్క్రీన్ రైటర్. రశ్మిత తొలి సినిమా 'కిరిక్ పార్టీ' (2016) నిర్మాత అతడే. ఆ సినిమా తీస్తున్నప్పుడు రక్షిత్‌కి, రశ్మికకు రిలేషన్ ఏర్పడింది. నిశ్చితార్థం కూడా జరిగింది. తర్వాత ఎందుకనో వద్దనుకున్నారు. అదే టైమ్‌లో ఇక్కడ గీత గోవిందం హిట్ అయింది. తెలుగులో గుర్తింపు వచ్చాక రక్షిత్‌ను వద్దనుకుందని రశ్మికపై రక్షిత్ ఫ్యాన్స్ ట్రోలింగ్ చేశారు. పాపం.. తననేమీ అనొద్దనీ, ఇద్దరం ఇష్టప్రకారమే నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నామని రక్షిత్ తనకై తను చెప్పినా ఫ్యాన్స్ వినలేదు. రశ్మిక కూడా అప్పుడూ ఏం మాట్లాడలేదు. ఇప్పుడూ ఏమీ మాట్లాడలేదు. ఈమధ్య మనవాళ్లెవరో విజయ్ దేవరకొండను అడిగారు.. 'రశ్మిక బ్రేకప్ గురించి కామెంట్ ప్లీజ్' అని! 'ఎందుకు.. సంబంధంలేని వాటి చుట్టూ తిరుగుతారు' అని విజయ్ మందలింపుగా అన్నారు.

## నాట్ మై దీపిక

సినిమాతో సరిపెట్టుకోనివ్వదు అభిమానం. నచ్చిన హీరోనో, హీరోయిన్‌నో కలవాలని తపిస్తుంది. చేయి కలపాలని, ఫొటో తీయించుకోవాలని ప్రయత్నిస్తుంది. అభిమాన సంఘం పెట్టుకుంటుంది. క్షీరాభిషేకం చేస్తుంది. గుడి కట్టిస్తుంది. ఇవన్నీ పాత విధానాలు. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఫాన్స్ ఇప్పుడు డైరెక్టుగా సినీ స్టార్స్‌తో ఇంటరాక్ట్ అవుతోంది. వాళ్ల వ్యక్తిగత జీవితాల్లోకి, వృత్తిపరమైన నిర్ణయాల్లోకి కూడా వెళ్లిపోతోంది. రశ్మికతోపాటు ఇప్పుడీ తరహా అభిమానానికి 'గుర వుతున్న' మరొక నటి దీపికా పదుకోన్. ఈమెకు వ్యతిరేకంగా తాజాగా 'నాట్ మై దీపిక' అనే మూవ్‌మెంట్ నడుస్తోంది! 'నా దీపిక కాదు' అని! ఫ్యాన్స్‌కి ఎందుకి ంతగా ఆవేదన కలిగింది? 'మీటూ' కేసులో నిందితుడిగా ఉన్న బాలీవుడ్ దర్శకుడు లవ్ రంజన్ నెక్స్ట్ సినిమాలో దీపిక నటించడం వారికి ఇష్టం లేదు. లవ్ రంజన్ తీసే సినిమాలు వెరైటీగా ఉంటాయి. 'ప్యార్ కా పంచనామా', 'లైఫ్ సహీ హై' ఆయన డైరెక్ట్ చేసిన సినిమాలే. ఇవి కాక, మరికొన్ని సినిమాలకు నిర్మాత కూడా. దీపిక ఈ మధ్య రణ్‌బీర్ కపూర్‌తో కలిసి లవ్ రంజన్ ఇంటికి వెళ్లి వస్తూ మీడియా కంటపడ్డారు. అంతే. ఇక వీళ్లిద్దరూ లవ్ రంజన్ కొత్త ప్రాజెక్టులో నటించబోతున్నారని వార్తలు వచ్చాయి. ఆ వార్తల్ని చూసిన అభిమానులు.. 'చస్తే ఆ పని చెయ్యొద్దు' అని దీపికకు ట్వీట్‌లు పెట్టారు. ''స్త్రీలను లైంగికంగా వేధించే ఒక నీచుడి ప్రాజెక్టులో మీరు నటిస్తున్నట్లయితే మీటూకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఎందరో మహిళలకు మీరు అన్యాయం చేసినట్లే. మీరు మీ గౌరవాన్ని కూడా కోల్పోతారు'' అని ఒక అభిమాని ట్వీట్ చేశారు. ఆ తర్వాత కొద్ది గంటలకే 'నాట్ మై దీపిక' అనే హ్యాష్‌టాగ్ ఆవిర్భవించింది. లవ్ రంజన్ ప్రాజెక్టులో దీపిక నటించకూడదని కోరుకుంటున్న, ఆదేశిస్తున్న, విజ్ఞప్తి చేస్తున్న, ప్రాధేయపడుతున్న, ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఫ్యాన్స్ అంతా కలిసి దీపికపై ఇలా ఒత్తిడి తెస్తున్నారు! 'ప్యార్ కా పంచనామా' (2011) ఆడిషన్‌లలో లవ్ రంజన్ తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని, ఒంటిపై బట్టలన్నీ తీసి నిలబెట్టాడని ఇటీవల ఒక నటి ఆరోపించింది. అలాంటి వ్యక్తితో టై–అప్ కావడం ఏంటని దీపిక ఫ్యాన్స్ ఆమెను ప్రశ్నిస్తున్నారు. అయితే దీనిపై దీపిక ఇంతవరకూ స్పందించలేదు. ఎందుకు స్పందించలేదు అంటే లవ్ రంజన్ సినిమాకు సంతకం చేశానని ఆమె చెప్పినప్పుడు కదా!



● లవ్ రంజన్ ఇంటి నుంచి కారులో వస్తున్న దీపిక; ఇన్‌సెట్‌లో లవ్ రంజన్

## బ్యాడ్ గర్ల్ ప్రియాంక

నిక్ జోనస్‌ని పెళ్లి చేసుకుని వెళ్లిపోయాక కూడా ప్రియాంక చోప్రా అభిమానులు ఆమె ఇంకా తమ మనిషే అనే భావనలోంచి బయటికి వచ్చినట్లే లేదు. ఇటీవల మయామీ బీచ్‌లో ప్రియాంక సిగరెట్ తాగుతున్న ఫొటోను, బికినీలో ఆమె ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి తట్టుకోలేకపోయారు ఫాన్స్. 'ప్రియాంకా.. ఏమిటి నువ్వు చేస్తున్న పని' అని ఆవేదన చెందారు. ఆగ్రహం వ్యక్తం చేశారు! ప్రియాంక గ్లోబల్ స్టార్. ఆ గ్లోబల్ స్టార్ దేశవాళీ స్టార్‌లా ఉండాలని కోరుకోవడం అంటే అభిమానం హద్దులు విధించడమే కదా! జూలై 18న ప్రియాంక బర్త్ డే. ఆమె ఎంతో ముందుగా ప్లాన్ చేసుకున్న రోజు అది. ముంబై నుంచి ప్రియాంక తల్లి మధు చోప్రా, చెల్లి పరిణీతి చోప్రా కూడా మయామీ వచ్చి ప్రియాంక–నిక్‌లతో జాయిన్ అయ్యారు. పరిణీతి అయితే తన అప్‌కమింగ్ మూవీ 'జబరియా జోడీ' ప్రమోషన్ పనులను కూడా పక్కన పెట్టి అక్కకోసం ఆకాశంలో ఎగిరొచ్చారు. ఆ రోజు ప్రియాంక ఎంతో లవ్‌లీగా ఎంజాయ్ చేశారు. యాట్(విలాసవంతమైన నౌక) లో విహరించారు. ఘాటుగా ఉండని మేలు రకం సిగరెట్‌ను ఆస్వాదించారు. దేహానికి బికినీని తగిలించుకుని విహంగంలా మారిపోయారు. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారు. వాటిని చూసి ప్రియాంక ఫ్యాన్స్ విలవిల్లాడిపోయారు. 'ది స్కయ్ ఈజ్ పింక్' సినిమాలో (అదింకా మన దేశంలో విడుదల కాలేదు) ఒక తల్లిగా ప్రియాంక చెప్పిన నీతులేమిటి? ఇప్పుడు చేస్తున్నదేమిటి?' అని ఒకరు ట్వీట్ పెట్టారు. ఇంకొకరు మరికాస్త ముందుకు వెళ్లి.. 'అల్లుడి పక్కన అత్తగారు అలా నేనా కూర్చోవడం! అసలు ప్రియాంక ఎలా చూస్తూ ఊరుకుంది? భారతీయ సంప్రదాయం ఏమిటో ఆ తల్లి మర్చిపోయినా, ఈ కూతురు గుర్తు చెయ్యొద్దా' అని ట్వీట్ చేశారు. మరికొందరైతే.. 'ప్రియాంక తన లవింగ్ హస్బెండ్‌తో, లవింగ్ మదర్‌తో, బ్యూటిఫుల్ బికినీతో ఉన్న ఫొటోలు నాకేమీ సంతోషం కలిగించడం లేదు. ధ్వని లేకుండా దీపావళిని సెలబ్రేట్ చేసుకొమ్మనీ, కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలిని పీల్చుకొమ్మని, మూగజీవుల పట్ల మానవత్వంతో మెలగమని ఇక ముందు కూడా చెప్పేందుకు ప్రియాంక ఎలా ధైర్యం చేయగలుగుతారు'' అని ఒక అభిమాని వాపోయారు. రశ్మిక, దీపిక లానే ప్రియాంక ఏమీ స్పందించ లేదు. తను చేసింది తప్పు అనుకుంటే తన ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టుకోరు కదా.



● బర్త్‌డే పార్టీలో ప్రియాంక : బికినీలో విహరిస్తూ.. స్మోక్ చేస్తూ..

## 'ఎక్కడ తల్లీ నీ బ్రెయిన్?'

భూమి పడ్నేకర్ నాలుగేళ్లుగా బాలీవుడ్‌లో ఉన్నారు. మంచి సినిమాలు చేశారు. 'టాయ్‌లెట్ : ఏక్ ప్రేమ్ కథ'లో మంచి రోల్ చేశారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. తన డైలీ రొటీన్ ఫొటోలను తరచు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటారు. ఈమధ్య జిమ్‌కి వెళ్లినప్పుడు అక్కడ తీసుకున్న సెల్ఫీని కూడా అలాగే పోస్ట్ చేశారు. ఆ యాంగిల్‌లో (బ్రెస్ట్ ఎలివేట్ అయ్యేలా) తీసుకున్న ఫొటో ఆమె అభిమానులకు నచ్చలేదు. 'భూమి ఏంటి? ఇలా కనిపించడం ఏంటి?' అనుకున్నారు. ఒకరైతే చాలా బ్యాడ్‌గా కామెంట్ పెట్టారు. 'నీ బ్రెయిన్ నీ బ్రెస్ట్‌లో ఉందా?' అని పెట్టారు! ఇలాంటివే చాలా కామెంట్లు. 'నిన్నెంత ఉన్నతంగా ఊహించుకున్నాం. నువ్వేమో ఇలాగా' అని మరొక ఆవేదన. ఆ ఫొటోలో భూమిక 'పీస్ ఆఫ్ మైండ్'తో ఉన్నట్లు కనిపిస్తున్నారు. దానిపైనే ఎక్కువ కామెంట్లు వచ్చాయి.

'పీస్ ఆఫ్ మైండ్' (పి.ఐ.ఇ.సి.ఇ.)

'అందరికీ మీడియా అటెన్షన్ కావాలి'.

'నీ పీస్ ఆఫ్ మైండ్ నీ బ్రాలో ఉన్నట్లుంది'.

'ఇలాంటి యాంగిల్‌ను ఇంతవరకు ఎవరూ కనిపెట్టలేదు'.

'రెండు పెద్ద పీస్ ఆఫ్ మైండ్‌లు'.

'నువ్వేం చూపించదలచుకున్నావ్?'

ఇలా ఉన్నాయి కామెంట్లన్నీ. తన వర్క్‌అవుట్ సెల్ఫీ తన ఫ్యాన్స్ మనసును ఇంతగా విరిచేస్తుందని ఆమె ఊహించినట్లు లేరు. కానీ తనేం తప్పు చేయలేదు కదా. ఎందుకు రెస్పాండ్ అవడం అని అనుకున్నట్లున్నారేమో.. కామ్‌గా ఉండిపోయారు భూమి పడ్నేకర్.



● భూమి పడ్నేకర్ జిమ్ సెల్ఫీ

• • •

తాప్సీ పన్నుది ఇంకో స్టోరీ. పై వాటికి పూర్తి భిన్నమైనది. ఆమెను ట్రోల్ చేసింది ఫాన్స్ కాదు. ఎవరో ముక్కూముఖం తెలియని వ్యక్తి. బాలీవుడ్ దర్శకుడు అనుభవ్ సిన్హాతో కలిసి భోంచేస్తూ ఆ ఫొటోను ట్విట్టర్‌లో పెట్టారు తాప్సీ. 'మంచి ఆహారంతో ఒక కొత్త ప్రారంభం. ఎంతో కాలం నుంచి నేను ఎదురు చూస్తున్న ఒక పాత్ర దొరికిన ఆనందాన్ని నేను ఇలా షేర్ చేసుకుంటున్నాను' అని దానికి కామెంట్ పెట్టారు. దీనిపై ఆ వ్యక్తి ట్వీట్ చేస్తూ, 'అనుభవ్ సార్.. మీరు ఇంకెవర్నయినా వెతుక్కోవాలని నేను భావిస్తున్నాను. ఎందుకంటే తాప్సీకి యాక్టింగ్ రాదు' అని ట్రోల్ చేశాడు. తాప్సీ దానిని ఇగ్నోర్ చెయ్యొచ్చు. చెయ్యాల్సిన ట్వీట్ కూడా. అయితే ఆమె సమాధానం ఇచ్చారు. 'సారీ యార్, ఇప్పటికే మొత్తం సంతకాలయి పోయాయి. ఒక పని చెయ్యి, తర్వాతి దానికోసం వేచివుండు, బహుశా అది కూడా పూర్తి చేసేస్తా' అని చాలా కూల్‌గా, బ్రైట్‌గా ఇచ్చారు.



● అనుభవ్ సిన్హాతో తాప్సీ

సినీ హీరోయిన్‌లపై చచ్చేంత అభిమానంతో వారిని ట్రోల్ చేసేవారు ఉన్నట్లే.. వాళ్లని పిచ్చిపిచ్చి కామెంట్‌లతో ట్రోల్ చేసేవారూ ఉంటారు. వీటన్నిటికీ సమాధానం ఇవ్వడం ఇవ్వక పోవడం వాళ్లిష్టం. ట్రోల్ చేసేవాళ్లే ఆలోచించుకోవాలి తమ అభిమానం గానీ, ద్వేషం గానీ, హద్దులు మీరడం లేదు కదా అని.

---

**నివాళి**

# తల్లిదండ్రుల అభిప్రాయాలు పిల్లలపై రుద్దడం సరికాదు

**ప్రముఖ కవి, రచయిత, సంపాదకులు, సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గురువారం (నిన్న) తెల్లవారు జామున మృతి చెందారు. గతంలో వారు సాక్షికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలోని విశేషాలను ఈ సందర్భంగా పాఠకులకు మరోసారి గుర్తుచేస్తున్నాం.**

''ఫలానా పుస్తకం చదవద్దు, ఫలానా ఛానల్ చూడద్దు, ఆ సినిమా చూడద్దు, ఆ సైట్ జోలికి వెళ్లద్దు అని పిల్లలకు ఆంక్షలు విధించడం వల్ల మేలుకంటే కీడే ఎక్కువ జరుగుతుంది. ఎందుకంటే మనం గుప్పిట మూసి ఉంచినప్పుడు పిల్లలకు అందులో ఏముందో చూడాలన్న కుతూహలం పెరుగుతుంది. అదే ఓపెన్‌గా ఉంచితే ఆ గొడవే ఉండదు'' అంటారు సుప్రసిద్ధ కవి, కథారచయిత ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. 'అలా పెంచాం' కోసం ఆ దంపతులను కలిసినప్పుడు తమ పిల్లల చదువుల విషయం, తాము వారిని పెంచిన తీరుతెన్నులూ వివరించారిలా!

''మాకు ఇద్దరు పిల్లలు. మా అమ్మాయి కిరణ్మయి టొరెంటోలోని యార్క్ యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేసింది. ఆ తర్వాత ఇంగ్లండ్‌లోని నాటింగ్‌హామ్ యూనివర్శిటీలో ఫిలిమ్ స్టడీస్‌లో పీహెచ్‌డీ చేసింది. ప్రస్తుతం రాఫ్ట్‌లో ఫాకల్టీ మెంబర్‌గా పని చేస్తోంది.

అబ్బాయి మోహనకృష్ణ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎం.ఎ. ఇంగ్లీష్ లిటరేచర్ చేసిన తర్వాత ఎం.ఫిల్ చేశాడు. కెనడాలో ఎం.ఎఫ్.ఎ. చేశాడు. అక్కడే పీహెచ్‌డీ చేస్తూ ఉంటే అకడమిక్‌గా ఎదగడమే తప్ప మనం నేర్చుకున్నదానిని అమలు చేయడానికి వీలు కాదనే ఉద్దేశ్యంతో 2001లో ఇండియా వచ్చేశాడు. చలంగారి 'దోషగుణం' అనే కథ ఆధారంగా 'గ్రహణం' సినిమాకు దర్శకత్వం వహించాడు. ఆ చిత్రానికి ఇందిరాగాంధీ జాతీయ పురస్కారం లభించింది. ఆ తర్వాత అష్టాచెమ్మా, మాయాబజార్, గోల్కొండ హైస్కూల్ చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం చేతిలో ఇంకొన్ని సినిమాలతో బిజీగా ఉన్నాడు.

**నమ్మాము... ఆచరించాము**

మా పిల్లల బాల్యం అంతా విజయవాడలోనే గడిచింది. వారి చదువులు అయిపోయాకనే మేము హైదరాబాద్ వచ్చాము. మేమిద్దరం మా పిల్లలు ఏం చదువుకుంటామంటే అదే చదువుకోనిచ్చాము. నచ్చిన పుస్తకాలు చదువుకోమన్నాము. వాళ్ల పర్సనల్ విషయాలలో జోక్యం చేసుకోలేదు. ఎందుకంటే మా ఇద్దరి ఫిలాసఫీ ఒకటే... పిల్లలు తమకు నచ్చిన చదువులు చదువుకోవాలి, ఇష్టమైన ఉద్యోగం చేయాలి. ఇష్టపడ్డవారిని పెళ్లి చేసుకోవాలి. వాళ్లు మనకు పిల్లలుగా పుట్టినంత మాత్రాన తల్లిదండ్రుల అభిప్రాయాలను వాళ్లపై రుద్దడం సబబు కాదని మా ఉద్దేశ్యం. వారి జీవితం వారిది. వాళ్లకు ఎన్నేళ్లొచ్చినా ప్రతిదీ మన ఇష్టప్రకారమే నడుచుకోవాలనుకోవడం వల్ల వారు స్వతంత్రంగా ఎదగలేరు! వాళ్లు ఏదైనా విషయంలో నిర్ణయం తీసుకోలేనప్పుడు మాత్రం మన సహాయ సహకారాలు అందించాలి. మేము నమ్మిన ఈ సూత్రాలను అక్షరాలా పాటించాము. మా పిల్లలు మంచి పుస్తకాలు చదివారు, మంచి సినిమాలు చూశారు. మంచి సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. సంగీతంలో, పాటలలో కూడా మంచి అభినివేశం ఉండేది. వక్తృత్వం, వ్యాసరచన... వంటి పోటీలలో ఉత్సాహంగా పాల్గొనేవారు.

> "పిల్లలు ఎంత లావుగా ఉన్నారన్నది కాదు, ఎంత బలంగా, ఆరోగ్యంగా ఉన్నారన్నదే ప్రధానం. మా పిల్లలకు మేము ఇన్నిసార్లు తినిపిస్తున్నామని గొప్పలు చెప్పుకునే తల్లిదండ్రులు పిల్లలను అసలు విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నామో లేదో ఆత్మవిమర్శ చేసుకోవాలి"

**ఎలా జరిగిందన్నది కాదు...**

పెళ్లిళ్ల విషయంలో కూడా మేం వారిని నిర్బంధించలేదు. వాళ్లు ఎవరిని ఇష్టపడ్డారో వాళ్లనే చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.

మా అమ్మాయిది కులాంతర వివాహం. 'మేమిద్దరం ఒకరినొకరం ఇష్టపడుతున్నాం, జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నాం' అని చెప్పినప్పుడు నేనేమీ కంగారుపడలేదు. పైగా రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సింపుల్‌గా జరిగిన వారి పెళ్లికి నేనే వెళ్లి సాక్షి సంతకం పెట్టివచ్చాను కూడా! ఎందుకంటే సాధారణంగా మేము ఫలానా వారిని ఇష్టపడుతున్నాము, వారినే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాము అని పిల్లలు చెప్పడం, తల్లిదండ్రులు అందుకు అభ్యంతరాలు పెట్టడం, వద్దని బతిమాలడం, బెదిరించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. అలాగని వారు ఏం చేస్తే అది కళ్లు మూసుకుని ఆమోదించాలని ఉద్దేశ్యం కాదు. వాళ్లకి అందులోని మంచి చెడులను వివరించాలి. అప్పుడు వాళ్లంతట వాళ్లే తమకు ఏది మంచో గ్రహిస్తారు. అలాగే పెళ్లి ఎవరితో, ఎలా జరిగిందన్నది సమస్య కానే కాదు, వారి వైవాహిక జీవితం ఎంత బాగున్నది, ఎంత ఫలప్రదంగా ఉన్నదనేది ప్రధానం. జీవితాంతం కలిసి ఉండేదీ, కాపురం చేయవలసినదీ వాళ్లే కదా! మా అబ్బాయి మోహనకృష్ణదీ ప్రేమవివాహమే! తన క్లాస్‌మేట్‌నే ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మా ఇద్దరు పిల్లలూ సుఖంగా కాపురం చేసుకుంటున్నారు. వారిని చూసి మాకు ఆనందంగా ఉంది.

''అసలు పెద్దవాళ్లకూ, పెళ్లయిన తర్వాత పిల్లలకూ భేదాభిప్రాయాలు వచ్చే సందర్భం ప్రధానంగా డబ్బు విషయంలోనే ఎదురవుతుంది. పిల్లలు ఎడాపెడా ఖర్చు పెడుతున్నారని, దుబారా చేస్తున్నారని తిట్టడం సరికాదు. అలాగే కోడలు తాను సంపాదిస్తోంది కదా అని కొడుకును నిర్లక్ష్యం చేస్తోందని అత్తమామలు అనుకోవడం, అదే విషయాన్ని పదే పదే కొడుకుతో అంటుండటం మూలాన వారిద్దరి మధ్య భేదాభిప్రాయాలు కలగడం మినహా ప్రయోజనం ఏముంటుంది? ''

సంభాషణ: డి.వి.ఆర్. భాస్కర్



ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

సాక్షి ఫ్యామిలీ సినిమా

నల్లగొండ ॥ శుక్రవారం
26-7-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్.! పెళ్ళి కాక ముందు సంధ్యారాణి అనే అమ్మాయిని లవ్ చేశాను. తనూ నన్ను లవ్ చేసింది. గవర్నమెంట్ జాబ్ వచ్చాక పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం. తన చదువుకి సంబంధించి ఫీజు కట్టాను. తను కూడా బాగా కష్టపడి చదివి నాలుగు జాబ్స్‌కి సెలెక్ట్ అయ్యింది. అప్పటిదాకా బాగానే ఉన్నాం. కానీ ఒక సంవత్సరం క్రితం తనకి, నాకు మధ్య చిన్న చిన్న గొడవలై, నేను కోపంలో వేరే జాబ్ కోసం హైదరాబాద్ వదిలేశాను. తర్వాత నాకు పెళ్ళి కుదిరింది. నా పెళ్లికి పది రోజుల ముందు.. తను నన్ను కలిసి 'పెళ్ళి చేసుకుందాం' అంది. 'నాకు పెళ్ళి కుదిరింది, ఇప్పుడు నేను చేసుకునే అమ్మాయి వాళ్ళు చాలా పూర్ ఫ్యామిలీ. వాళ్లకున్న లాండ్ అమ్మి 10 లక్షల కట్నం ఇస్తున్నారు. ఇప్పుడు పెళ్ళి ఆగిపోతే.. చాలా గొడవలవుతాయి'' అని చెప్పేశాను. ''సరే చేసుకో. నేను మాత్రం పెళ్ళి చేసుకోను'' అని కోపంతో వెళ్లిపోయింది. నా పెళ్ళి అయ్యాక మామూలుగా తనకి ఫోన్ చేశాను. తను బాగా ఏడ్చింది. ''నువ్వు నాకు కావాలి.. నీ ప్లేస్‌లో మరొకరిని ఊహించుకోలేను. నీకు పెళ్ళి అయినా సరే మనం పెళ్లి చేసుకుందాం. ముగ్గురం రెండు ఫ్యామిలీలు కలిసే ఉందాం. నీ ఆస్తి నాకేం వద్దు.. నువ్వు కావాలి. నేను జాబ్ చేస్తున్నానుగా.. నేనే మిమ్మల్నిద్దరినీ పోషిస్తాను. హ్యాపీగా ఉందాం'' అని చెబుతోంది. తను చాలా నిజాయితీపరురాలు. 'మీరు పెళ్లి చేస్తారా? నన్ను చేసుకోమంటారా?' అని వాళ్ల నాన్న, అన్నయ్యలతో గొడవ పడుతోంది. ఇప్పుడు నేను ఏం చేయాలో చెప్పండి సార్?

– వీరు

నీలూ.. బుర్ర వేడెక్కిపోయింది!!

*'సింపుల్ సార్ .. సంధ్యారాణి జీవితం తీర్చి దిద్ది.. ఖర్చులు పెట్టుకుని మరీ ఉద్యోగ సామర్థ్యం కలిగించి.. మనోడు 10 లక్షల కోసం ఇంకో అమ్మాయికి సంతలో అమ్ముడుపోయాడు. ఇప్పుడు 10 లక్షలూ బ్యాంక్‌లో ఉన్నాయి కాబట్టి నెక్స్ట్ ఫిట్టింగ్ సెట్ చేసుకుంటున్నాడు. పెళ్లయ్యాక కూడా సంధ్యారాణిని అలాగే లైన్‌లో ఉంచాడు. ఇప్పుడు ఉన్న వైఫ్ పాపం పూర్ ఫ్యామిలీ కాబట్టి.. ఉన్నదంతా ఊడ్చిపెట్టి వీడికి తగలెట్టింది కాబట్టి.. వేరే మార్గం లేక సంధ్యారాణితో ఈ మహానుభావుడిని షేర్ చేసుకోక ఇంకేం చేస్తుందన్న కిర్రాక్ ఐడియా వేసుకుని.. చచ్చినోడు మోసం చేయాలనుకుంటున్నాడు సార్!''*

మరి నేనేమి చెప్పాలి నీలూ???

*'అలా వెర్రి మొఖం వేసుకుని నన్ను అడుగుతారేంటి సార్??? ఇప్పుడు మీరు కూడా వీడిని త్యాగశీలుడనీ.. బలి చక్రవర్తి బాబనీ సింపతీ చూపిస్తే.. మీ ఆన్సర్‌ని వైఫ్‌కి చూపించి.. సెకెండ్ సెటప్ సెట్ చేసుకుందామని అనుకుంటున్నాడు సార్!!''*

ఓరి నాయనో!!!

*'మీరు అసలే ఇన్నోసెంట్. వీడి ట్రాప్‌లో పడతారని ఊహించాను సార్!! వీడు రెండో పెళ్లి.. రెండో సెటప్ అని పెంట పనులు చేస్తే.. మీ చెల్లెలు సంధ్యారాణిని పోలీస్ కంప్లైంట్ ఇవ్వమనండి సార్! ఏంటి సార్ అంత డల్‌గా అయిపోయారు..? ఇలాంటి ట్రాప్‌లు ఉంటాయని ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు కదా సార్? ఇవాళ మీరు రెస్ట్ తీసుకోండి సార్! నేను ఇచ్చిన ఆన్సర్ ఫైనల్ చేద్దాం!!'*

నీలూ.. నన్నూ నా చెల్లెలు సంధ్యారాణినీ కాపాడినందుకు థాంక్యూ!!

lovedoctorram@sakshi.com

# కాపీ కొట్టాల్సిన అవసరం నాకు లేదు

– నాగార్జున


అజిత్, నాగార్జున, రాహుల్ రవీంద్రన్

'అద్భుతం.. అమోఘం.. ఇటువంటి పథకం శ్రీకృష్ణుడు కూడా మహాభారతంలో వేయలేదు' అంటూ నాగార్జున డైలాగ్‌తో 'మన్మథుడు 2' ట్రైలర్ విడుదలైంది. నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్ జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మన్మథుడు 2'. వయాకామ్ 18 స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, పి.కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 9న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ– ''వయాకామ్‌తో అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యం కావడం ఇదే తొలిసారి. ఏ సమస్యా లేకుండా సినిమా చాలా స్మూత్‌గా పూర్తయింది. వయాకామ్ ప్రతినిధి అజిత్ మాకు కొండంత ధైర్యం ఇచ్చారు. నిర్మాతలతోపాటు డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్ అందరూ సంతోషంగా ఉండాలని ముందు నుంచి ప్రణాళికతో ఈ సినిమా చేసుకుంటూ వచ్చాం. త్వరలో జరగనున్న 'మన్మథుడు జర్నీ' ప్రోగ్రామ్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడతాం'' అన్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు నాగార్జున సమాధానం ఇస్తూ – ''మన్మథుడు' సినిమా వచ్చి 17 సంవత్సరాలు అయింది. ఇప్పుడు 'మన్మథుడు 2' వస్తోంది. ఈ రెండిటిలో ఏది ఎక్కువగా ఎంజాయ్ చేశానంటే చెప్పలేను. విజయ్ భాస్కర్‌గారితో చేసిన 'మన్మథుడు' చాలా ఈజీగా, హ్యాపీగా ఎలా సాగిందో ఈ సినిమాకు కూడా అంతే ఎంజాయ్ చేశాం. ఈ చిత్రంలో సమంత నటిస్తుందని రాహుల్ చెప్పేవరకు నాకు తెలియదు. తనతో 'మనం, రాజుగారి గది 2' సినిమాలు చేశాను. తను నా కోడలైన తర్వాత మరింత జాగ్రత్తగా చూసుకుంటున్నాను. ఇది 'మన్మథుడు' సీక్వెల్ కాదు. ఆ పాత్రలకు, కథకు ఎక్కడా సంబంధం లేదు. అందులో, ఇందులో నేనే హీరో కాబట్టి టైటిల్ మాత్రం వాడుకున్నాం. 'అన్‌టచబుల్స్' అనే ఫ్రెంచ్ సినిమా హక్కులు కొని 'ఊపిరి'గా రీమేక్ చేశాం. స్టూడియో కెనాల్‌లో వారు నిర్మించిన ఓ ఫ్రెంచ్ సినిమా హక్కులు కొని 'మన్మథుడు 2' చేశాం. అంతేకానీ, ఎవరి కష్టాన్నో కాపీ కొట్టాల్సిన అవసరం నాకు లేదు. 90 శాతం వినోదాత్మకంగా ఉండే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన్మథుడు 2'. ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు.. అందుకు నాది గ్యారంటీ. 'బంగార్రాజు' కథ దాదాపు పూర్తి కావొచ్చింది. కల్యాణ్ కృష్ణ ఎప్పుడు రెడీ అంటే అప్పుడు షూటింగ్ మొదలుపెడతాం'' అన్నారు.

**బిగ్ బాస్ చేయడం హ్యాపీ**

'బిగ్ బాస్' షో చేయడం చాలా బాగుంది. 'మీలో ఎవరు కోటీశ్వరుడు' చేస్తున్నప్పుడు బిగుసుకుని కూర్చొని, కొంచెం హుందాగా ప్రవర్తించాల్సి వచ్చేది. కానీ 'బిగ్ బాస్' మాత్రం చాలా సరదాగా ఉంది. ఈ షో 15 దేశాల్లో జరుగుతోంది. వివాదాలు అనేవి గాల్లో కూడా పుట్టించొచ్చు. 'బిగ్ బాస్ 3' సీజన్‌పై కొందరు వివాదాలు చేశారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, తెలంగాణ పోలీసులు నిజాయతీగా విచారణ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు.

**రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ–** ''ఈ సినిమాకు 'మన్మథుడు' కరెక్ట్ టైటిల్. కానీ, నాగ్ సార్ హీరోగా చేస్తున్నారు కాబట్టి 'మన్మథుడు 2' అని పెట్టాం. షూటింగ్ స్టార్ట్ చేయడానికి ముందే టైటిల్ ఫిక్స్ చేశాం. మూడు తరాలుగా పోర్చుగల్‌లో స్థిరపడిన ఓ తెలుగు కుటుంబం కథ ఇది. కుటుంబ ప్రేక్షకులంతా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఇందులో సమంత అతిథి పాత్ర చేశారు'' అన్నారు.

**వయాకామ్ ప్రతినిధి అజిత్ మాట్లాడుతూ–** ''హాలీవుడ్ సినిమాలు తీసే మీరు తెలుగు చిత్రాలు చేస్తున్నారేంటి? అని కొందరన్నారు. ఇక్కడ ఎందుకు తీయకూడదు? అనిపించింది. ఈ ఏడాది బాలీవుడ్‌లో హిట్ అయిన చిత్రం ఓ తెలుగు రీమేకే. మరో తెలుగు సినిమా కూడా త్వరలోనే హిందీలో పెద్ద మూవీగా నిలవబోతోంది. ఇక్కడి ప్రేక్షకులు సినిమా స్టార్స్‌ని, సినిమాను ఎక్కువగా ప్రేమిస్తారు. అందుకే టాలీవుడ్‌లో అడుగుపెట్టాం. అన్నపూర్ణ సంస్థలో నాగార్జున గారితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ బంధం భవిష్యత్‌లోనూ కొనసాగుతుంది. కథ నచ్చితే ఇతర సంస్థలతోనూ కలిసి చేస్తాం'' అన్నారు.



# పంద్రాగస్టుకు ట్రైలర్?

● ప్రభాస్, శ్రద్ధా కపూర్

'సాహో' ప్రమోషన్స్ మస్త్ స్పీడ్ మీద ఉన్నాయి. రోజుల వ్యవధిలో కొత్త పోస్టర్స్‌ను విడుదల చేస్తూ 'సాహో' సందడి మొదలుపెట్టింది చిత్రబృందం. తాజాగా 'సాహో' చిత్రానికి సంబంధించి మరో కొత్త యాక్షన్ పోస్టర్‌ను విడుదల చేశారు ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించారు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్రమ్‌లు నిర్మించారు. గతంలో 'షేడ్స్ ఆఫ్ సాహో ఛాప్టర్ 1', 'షేడ్స్ ఆఫ్ సాహో చాప్టర్ 2'లతో పాటు టీజర్‌ను కూడా 'సాహో' చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను పంద్రాగస్టుకు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. జాకీ ష్రాఫ్, నీల్‌నితిన్ ముఖేష్, అరుణ్ విజయ్, 'వెన్నెల' కిశోర్, ప్రకాష్ బెల్వాది తదితరులు నటించిన ఈ చిత్రం ఆగస్టు 30న విడుదల కానుంది.

# నా డియర్ కామ్రేడ్స్‌కి అంకితం

– విజయ్ దేవరకొండ


● చెర్రి, రష్మిక, భరత్ కమ్మ, విజయ్ దేవరకొండ, నవీన్ ఎర్నేని, యశ్ రంగినేని, రవిశంకర్

''నేను నటుణ్ణి అయినప్పటి నుంచి ఇప్పటివరకు ఎక్కడికెళ్లినా మీరు (ఫ్యాన్స్) సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. 'డియర్ కామ్రేడ్ మ్యూజిక్ ఫెస్టివల్స్' సక్సెస్ అయ్యాయి. నేను నాలా ఉండటమే మీ అందరికీ నచ్చుతుంది'' అని విజయ్‌దేవరకొండ అన్నారు. భరత్ కమ్మ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, రష్మికా మండన్నా జంటగా తెరకెక్కిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం), యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''భరత్ నాకు చాలా కాలంగా తెలుసు. మూడేళ్లుగా నా సక్సెస్‌లు, ఫెయిల్యూర్స్ చూశాడు. ఇప్పుడు ఒక అందమైన సినిమా నాకు ఇచ్చాడు. తను ఒక బ్రిలియంట్ డైరెక్టర్ అవుతాడు. ఈ సినిమా నా డియర్ కామ్రేడ్స్ అందరికీ, భరత్ కమ్మ వాళ్ల నాన్నగారికి అంకితం. లిల్లీ పాత్రలో రష్మిక ఎంత కష్టపడిందో సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు. ''ప్రతి ఒక్కరూ మా సినిమాని ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నా'' అన్నారు వై. రవిశంకర్. ''భరత్ కమ్మ అండ్ టీమ్ ఒకటిన్నర సంవత్సరం ఎంతో కష్టపడి ఈ సినిమాను తెరకెక్కించినందుకు థ్యాంక్స్'' అన్నారు యష్ రంగినేని. ''మా సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. '2017లో ఎడిట్ రూమ్‌లో 'పెళ్ళిచూపులు' సినిమా చూశాను.. చాలా నచ్చింది. 'అర్జున్ రెడ్డి' టైమ్‌లో 'డియర్ కామ్రేడ్' కథ చెప్పాను. ఈ ప్రాజెక్టు స్టార్ట్ అవడానికి కారణం విజయ్ వాళ్ల నాన్నగారు. 'డియర్ కామ్రేడ్' తప్పకుండా మంచి హిట్ అవుతుంది'' అని భరత్ కమ్మ అన్నారు. ''భరత్ సార్ పంపిన ఈ కథ పిచ్చిగా నచ్చింది. మా పేరెంట్స్ వద్దన్నా ఈ సినిమా కోసం పెద్ద ఫైట్ చేయాల్సి వచ్చింది. క్రికెట్ ప్రాక్టీస్ చేసేటప్పుడు ఎన్నో గాయాలైనా లెక్క చేయకుండా ఈ సినిమా చేశా. విజయ్ అమేజింగ్ యాక్టర్'' అన్నారు రష్మికా మండన్న.


● షారుక్ ఖాన్

## లుంగీ కడతారా?

రజనీకాంత్ ఫ్యాన్స్ కోసం లుంగీ కట్టి లుంగీ డ్యాన్స్ చేశారు షారుక్ ఖాన్. 'చెన్నై ఎక్స్‌ప్రెస్' ప్రమోషన్‌లో భాగంగా ఇలా చేశారాయన. ఇప్పుడు మరోసారి లుంగీ కట్టనున్నారని బాలీవుడ్ గాసిప్. 2014లో వచ్చిన అజిత్ 'వీరమ్' చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నారు. ఫర్హాద్ సంజీ దర్శకుడు. దీనికి 'లాల్' (ల్యాండ్ ఆఫ్ లుంగీ) అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ సినిమా తొలుత అక్షయ్ కుమార్ దగ్గరకు వెళ్లింది. ఆ తర్వాత విక్కీ కౌశాల్ దగ్గరకు వెళ్లింది. డేట్స్ లేని కారణంగానే ఈ హీరోలు లుంగీ కట్టే చాన్స్ మిస్ అయ్యారు. ఇప్పుడు షారుక్ ఖాన్ ఈ రీమేక్‌లో హీరోగా కనిపిస్తారని తెలిసింది. దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి.


● సల్మాన్ ఖాన్

## నాకెవ్వరూ ప్రపోజ్ చేయలేదు!

వయసు 53. అయినప్పటికీ 'బాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లిస్ట్'లో కండలు తిప్పుకుంటూ ముందు వరుసలో ఉంటారు సల్మాన్ ఖాన్. బ్యాచిలర్ కాబట్టి బుట్టల కొద్దీ మ్యారేజ్ ప్రపోజల్స్ వస్తుంటాయి అనుకోవచ్చు. కానీ అలాంటిదేం ఇప్పటివరకూ జరగలేదట. ''సినిమాల్లో హీరోయిన్లు నా ప్రేమ కోసం వెనకబడ్డ సందర్భాలున్నాయి. పెళ్లి చేసుకోమని అడిగిన సీన్లూ ఉన్నాయి. కానీ నిజజీవితంలో ఇప్పటివరకూ ఒక్క అమ్మాయి కూడా నా దగ్గరకు పెళ్లి ప్రపోజల్ తీసుకురాలేదు' అన్నారు సల్మాన్ ఖాన్. దానికి ఓ కారణం కూడా చెప్పారు. ''నేను క్యాండిల్ లైట్ డిన్నర్‌లు చేయలేను. ఎందుకంటే.. ఆ కొవ్వొత్తుల వెలుతురులో తినడానికి చాలా తంటాలు పడుతుంటాను. 'ఇప్పటివరకూ నాకెవరూ ప్రపోజ్ చేయలేదే?' అని అప్పుడప్పుడు ఫీల్ అవుతుంటాను' అని ఫీల్ అయ్యారు భాయ్.

# రచనల్లో జీవించే ఉంటారు


● ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

రొమాంటిక్ సాంగ్ రాయాలంటే మంచి వయసులో ఉండాలా? ఉంటేనే రాయగలుగుతారా? అలాంటిదేం లేదు. మనసులో భావాలు మెండుగా ఉండాలే కానీ ఏ వయసులోనైనా ప్రేమ పాటలు రాయొచ్చు. అందుకు ఉదాహరణగా నిలిచినవాళ్లల్లో ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ఒకరు. 74 ఏళ్ల వయసులో ఆయన కలం నుంచి 'మనసైనదేదో..' అనే ప్రేమ పాట కాగితం మీదకు వచ్చింది. ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. ఆరోగ్యం సరిగ్గా లేని సమయంలోనూ 'సమ్మోహనం' కోసం ఆయన ఈ పాట రాయడం విశేషం. ఇదే శ్రీకాంత శర్మ రాసిన చివరిపాట. ఎన్నో అద్భుతమైన రచనలను మిగిల్చి, ఎప్పటికీ రచనల్లో గుర్తుండిపోయే ప్రముఖ కవి, సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గురువారం తెల్లవారుఝామున తుది శ్వాస విడిచారు. ఏడాది కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శ్రీకాంత శర్మ తన స్వగృహంలోనే నిద్రలో కన్ను మూశారు. 1944, మే 29న తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జన్మించారాయన. శ్రీకాంతశర్మ తండ్రి ఇంద్రగంటి హనమచ్ఛాస్త్రి మహా పండితులు. తండ్రి బాటలోనే సాహిత్య రంగంపై తనదైన ముద్రవేశారు. కవిత్వం, లలిత గీతం, చలన చిత్రం, యక్షగానం, కథ, నవల, నాటిక, వ్యాసం, పత్రికా రచన ఇలా బహు రూపాలుగా శ్రీకాంత శర్మ ప్రతిభ వికసించింది. జర్నలిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన శ్రీకాంత శర్మ 1976లో ఆలిండియా రేడియో విజయవాడలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరారు. ఆ తర్వాత సినీ కవిగా మారారు. 'కృష్ణావతారం' సినీ రచయితగా ఆయన తొలి సినిమా. అలాగే జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన నెలవంక, రావు – గోపాలరావు, రెండు జళ్ల సీత, పుత్తడి బొమ్మ వంటి సినిమాల్లో పాటలను రాశారు శ్రీకాంత శర్మ. ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహన కృష్ణ ఈయన తనయుడే. మోహన కృష్ణ తెరకెక్కించిన 'గోల్కొండ హైస్కూల్, 'అంతకుముందు ఆ తర్వాత', సమ్మోహనం' సినిమాల్లోనూ పాటలు రాశారాయన. 'ఇంటిపేరు ఇంద్రగంటి' పేరుతో తన ఆత్మకథను 2018లో విడుదల చేశారు. తన సాహిత్య జీవితం, కుటుంబ విశేషాలు, రచయితగా తన అనుభవాలు ఇందులో పొందుపరిచారు. శ్రీకాంత శర్మ మృతి పట్ల పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

### బంగారు పూలతో అభిషేకం చేశాను

– తనికెళ్ల భరణి



అనుభూతి కవిత్వం అనేది ఒక ప్రక్రియ. 'అనుభూతి గీతాలు' టైటిల్‌తో శ్రీకాంత శర్మగారు రాశారు. కవి, పండితుడు, సంస్కృతం బాగా చదువుకున్నవాడు. ఆయనది ఒక శకం. సాహిత్యంలో ఏ డౌట్ వచ్చినా ఆయన్నే అడిగేవాణ్ణి. 'కవికి కనకాభిషేకం' పేరుతో నేను ఆయనకు బంగారు పూలతో అభిషేకించుకునే అవకాశం లభించింది. 50 వేల రూపాయిల బంగారం పూలతోటి వారికి అభిషేకం చేయడం ఒక పండగ. అక్కినేని నాగేశ్వరరావు కూడా వచ్చారు. నా జీవితంలో అది బెస్ట్ మూమెంట్. మర్చిపోలేనిది. ఆయన అర్భుడు. ఇవాళ ఉదయం (గురువారం) వాళ్ల ఇంటికి వెళ్లి నమస్కరించుకొని వచ్చాను. వాళ్ల కుటుంబమంతా పండితుల సమూహం. వాళ్ల తండ్రి, భార్య, కుమారుడు అందరూ సాహితీవేత్తలే. తెలుగు సాహిత్యం గురించి ఆయన ఎంత గొప్పగా చెప్పగలరో సంస్కృత సాహిత్యం గురించీ అంతే గొప్పగా చెప్పగలరు. సంస్కృత కావ్యాలు కొన్ని తెలుగులోకి అనువదించారు. సంస్కృత కావ్యాల మీద నాకు ఆసక్తి కలగడానికి కారణం పరోక్షంగా ఆయనే. తెలుగు కావ్యాలనుంచి గొప్ప సాహిత్య సంపదను పరిచయం చేశారు. శ్రీకాంత శర్మగారు ఎంతో గొప్ప జీవితాన్ని అనుభవించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలి.

## నో కట్స్


● కార్తికేయ

ఒక్క కట్ కూడా లేకుండానే 'గుణ' సెన్సార్ పరీక్ష పాస్ అయి రిలీజ్‌కు రెడీ అయ్యాడు. కార్తికేయ హీరోగా నూతన దర్శకుడు అర్జున్ జంధ్యాల రూపొందించిన చిత్రం 'గుణ 369'. అనఘ కథానాయిక. అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. నిర్మాతలు మాట్లాడుతూ – ''సెన్సార్ బోర్డ్ వారు ఒక్క కట్ కూడా చెప్పలేదు. మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది. ట్రైలర్ చూసిన వాళ్లందరూ గ్యారెంటీ హిట్ అంటున్నారు. పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది'' అన్నారు. ''నాలుగు గోడల మధ్య రాసిన కథ కాదిది. యథార్థ గాథే మా చిత్రం ముడిసరుకు. సహజంగా ఉంటుంది. కథలో ఉన్న సహజత్వం ప్రేక్షకుడి గుండెను తాకుతుంది'' అన్నారు అర్జున్ జంధ్యాల. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సత్య కిశోర్, శివ మల్లాల.


● రాఘవా లారెన్స్

## త్రీడీ సూపర్ హీరో

'కాంచన 3' సూపర్ సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్నారు రాఘవా లారెన్స్. ప్రస్తుతం తన సూపర్ హిట్ చిత్రం 'కాంచ న' సినిమాను అక్షయ్ కుమార్‌తో 'లక్ష్మీ బాంబ్'గా రీమేక్ చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత సూపర్ హీరోగా లారెన్స్ ఓ చిత్రం చేయనున్నారని తెలిసింది. ఈ చిత్రాన్ని 3డీలో తెరకెక్కించే ఆలోచనలో లారెన్స్ ఉన్నారట. భారీ బడ్జెట్‌తో తెరకెక్కబోయే ఈ సూపర్ హీరో సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తుందని సమాచారం.

# సమంతలా నటించలేకపోయేదాన్నేమో!


● అనుపమా పరమేశ్వరన్

''రాక్షసుడు' కథ నచ్చింది. ఇది తమిళ 'రాక్షసన్' సినిమాకి రీమేక్. నేను తమిళ సినిమా చూడలేదు. మా నాన్నగారు చూసి 'రాక్షసన్' చాలా బాగుంది.. చూడమంటే చూశా. కథ అద్భుతంగా ఉంది'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించారు. అభిషేక్ నామా ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా అనుపమా పరమేశ్వరన్ పంచుకున్న విశేషాలు.

- క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. నాకు థ్రిల్లర్ సినిమాలంటే ఇష్టం. అందుకే ఈ కథకి బాగా కనెక్ట్ అయ్యాను. ఇందులో నేను టీచర్ పాత్రలో కనిపిస్తాను. సినిమాలో ఎక్కువ భాగం చీరలో ఉండటం సౌకర్యంగానే అనిపించింది. ఎందుకంటే ఐదో తరగతి నుంచే నాకు చీరలు కట్టుకోవడం అలవాటు. డ్యాన్స్, ఇతర ప్రోగ్రామ్స్ టైమ్‌లో చీరలో ఉండేదాన్ని. సినిమాలో నన్ను చూసి ప్రేక్షకులు ఎలా ఫీల్ అవుతారో అనే టెన్షన్ ఉంది.
- తమిళ 'రాక్షసన్'లో అమలా పాల్ చేశారు. ఆమె కళ్లు చాలా బాగుంటాయి. అమలా పాల్ పాత్ర నేను చేయడం హ్యాపీగా ఉంది. అయితే ఆమెలా కాకుండా నా శైలిలో నటించాను. ఈ సినిమాకి నేనే డబ్బింగ్ చెప్పాను. ఆ సమయంలో నా వాయిస్ బాగాలేదు. ఎవరితోనైనా డబ్బింగ్ చెప్పించమని రమేష్ వర్మగారితో అంటే, ఆయన నేనే చెప్పాలనడంతో చెప్పాను.
- దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్న ఓ మలయాళ సినిమాకి డైరెక్టర్ శ్యాంసు జ్యభ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. ఓ సినిమా కోసం యూనిట్ పడే కష్టం ఏంటో తెలుసుకోవాలి.. అప్పుడే వృత్తిపై నాకు మరింత గౌరవం పెరుగుతుందని అసిస్టెంట్‌గా చేశా. వైవిధ్యమైన అనుభూతి కలిగింది. భవిష్యత్తులో దర్శకత్వం చేస్తా. కొన్ని ఐడియాలు ఉన్నాయి. నేను దర్శకత్వం వహించే సినిమాల్లో జీవితం కనిపించాలి.
- నా మాతృభాష మలయాళం అయినా తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేశాను కాబట్టి ఇక్కడే నాకు ఎక్కువ సౌకర్యంగా ఉంటుంది. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నాకు రెండో ఇల్లు లాంటిది. నటిగా సంతృప్తి ఉండదు. మంచి సినిమాలు, పాత్రలు వస్తున్నాయి. కానీ, ఇప్పటి వరకూ నాకు చాలెంజింగ్ పాత్ర రాలేదు. తెలుగు 'నిన్ను కోరి' తమిళ్ రీమేక్‌లో నటిస్తున్నా. నివేదా థామస్ పాత్రను నా శైలిలో చేయనున్నా. ఇది నాకు చాలెంజిగ్ పాత్ర అనుకుంటున్నా. 'ఫిదా' సినిమాలో సాయిపల్లవి, 'మహానటి'లో కీర్తి సురేశ్ చేసిన పాత్రలంటే చాలా ఇష్టం. నటిగా నేనేంటో నిరూపించుకునే అలాంటి పాత్రలు చేయాలనుంది. 'రంగస్థలం' సినిమా అవకాశం కోల్పోవడం కొంచెం బాధగానే ఉంది. అయితే ఆ పాత్రలో సమంతకంటే నేను బాగా చేయలేనేమో? అనిపించింది.

# రాణి నందిని


● ఐశ్వర్యా రాయ్

ఎందరో తమిళ దర్శకులు 'పొన్నియిన్ సెల్వన్' నవలను స్క్రీన్ మీద చూపించాలని అనుకున్నారు. కానీ మణిరత్నం ఫైనల్‌గా ఆ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిస్తున్నారు. ఈ భారీ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యా రాయ్, కీర్తీ సురేశ్, అమలాపాల్ నటించనున్నారని సమాచారం. మోహన్‌బాబుని కూడా ఓ కీలక పాత్రకు మణిరత్నం సంప్రదించారు. ఇక ఈ సినిమాలో చేస్తున్నాను అని ఐష్ స్పష్టం చేశారు. అయితే తన పాత్ర ఎలా ఉండబోతోందో మాత్రం ఆమె బయటపెట్టలేదు. ఈ సినిమాలో ఐష్ నెగటివ్ షేడ్స్‌లో కనిపిస్తారని సమాచారం. చోళరాజ్యానికి చెందిన కోశాధికారి పెరియ పళువెట్టారియార్ భార్య నందిని పాత్రలో కనిపిస్తారట ఐష్. అధికార దాహంతో చోళ రాజ్యం కుప్పకూలిపోవడానికి భర్తను తప్పుదోవలో నడిపించారట నందిని. మరి నందినీగా ఐష్ నటిస్తే ఆమె భర్తగా నటించేది ఎవరు? అంటే.. ఆ పాత్రను మోహన్‌బాబు చేయనున్నారట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 8 | 1 | | 6 | 9 | 3 |
| 8 | | 9 | | | | 5 | 7 | 1 |
| | 1 | | 5 | 9 | | | 4 | |
| 4 | 3 | | 7 | | | | | 6 |
| | | | | 2 | | | | |
| 6 | | | | | 9 | | 2 | 4 |
| | 2 | | | 7 | 8 | | 6 | |
| 3 | 5 | 8 | | | | 7 | | 9 |
| 1 | 7 | 6 | | 3 | 5 | | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 2 | 4 | 6 | 1 | 5 | 9 | 8 | 7 |
| 1 | 5 | 8 | 3 | 9 | 7 | 2 | 6 | 4 |
| 6 | 7 | 9 | 8 | 2 | 4 | 1 | 5 | 3 |
| 4 | 3 | 2 | 1 | 5 | 8 | 6 | 7 | 9 |
| 5 | 1 | 6 | 7 | 4 | 9 | 3 | 2 | 8 |
| 8 | 9 | 7 | 2 | 6 | 3 | 5 | 4 | 1 |
| 2 | 4 | 3 | 5 | 7 | 1 | 8 | 9 | 6 |
| 9 | 8 | 5 | 4 | 3 | 6 | 7 | 1 | 2 |
| 7 | 6 | 1 | 9 | 8 | 2 | 4 | 3 | 5 |

ఫ్యాషన్

# కుచ్చిళ్ల కుర్తా

మన నాయనమ్మ వాళ్ల అమ్మమ్మ చీర ఇలాగే కట్టుకునేది
ఒక ఐదారు తరాల తరువాత
మన నాయనమ్మ మనవరాలి మనవరాలు
అలాగే కడుతుంది.
కుచ్చిళ్లు.. కుర్తాకి తగిలించారహో..!



కుర్తీ ధరిస్తే కలిగే కంఫర్ట్ మరే డ్రెస్ వల్ల రాదు. అందుకే ఎన్ని డిజైనర్ డ్రెస్సులు వచ్చినా కుర్తీ మాత్రం తన అగ్రస్థానాన్ని వీడడం లేదు. కుర్తీలోనే ఎన్నో డిజైన్స్ వచ్చాయి. వాటిలో ఇప్పుడు కుచ్చిళ్లుగా అమరే 'డ్రేప్డ్ కుర్తీ'లు మరింత అందంగా ఆకట్టుకుంటున్నాయి. అంచుల భాగంలో కుచ్చిళ్లుగా అమర్చి కుర్తీకే సెట్ చేస్తున్నారు. ఈ డిజైనర్ కుర్తీలను చూస్తుంటే బామ్మల కాలంలోని చీర కట్టును తలపిస్తోంది. క్యాజువల్ వేర్‌గానూ, పార్టీ వేర్‌గానూ అమరే ఈ డిజైనర్ కుర్తీలు సిల్క్‌లోనే కాకుండా లినెన్, ఖాదీ కాటన్‌లలోనూ లభిస్తున్నాయి.

నిర్వహణ:
**నిర్మలారెడ్డి**

ఆభరణం



## వేళ్లకు లతలు

సొగసుగా ఉండే వేళ్లకు మరింత సొగసుగా ఉండే ఉంగరాలు అమరితే ఎంత అందంగా ఉంటాయో కదా! లతల్లా వేళ్లను అల్లుకుపోయి, పువ్వుల సోయగాలతో అలరిస్తున్న ఈ ఫింగర్ రింగ్స్‌ను ప్రముఖ ఆభరణాల నిపుణురాలు సుహాని పిట్టి డిజైన్ చేసినవి. ఆధునిక వస్త్రాల మీదకే కాదు సంప్రదాయ చీరకట్టుకూ ఈ వినూత్న డిజైన్ ఉంగరాలు, హ్యాండ్ కఫ్స్ చక్కగా అమరుతాయి. ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతాయి.



**సుహాని పిట్టి**
ఆభరణాల నిపుణులు

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

## ఫైబ్రాయిడ్స్ మళ్లీ రాకుండా తగ్గించవచ్చా?

**నా వయసు 43 ఏళ్లు. గత కొంతకాలంగా గర్భాశయంలోని ఫైబ్రాయిడ్స్ సమస్యతో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించాలని చెప్పారు. అయితే భవిష్యత్తులో అవి మళ్లీ వచ్చే అవకాశం ఉందని అన్నారు. హోమియో చికిత్సతో ఈ సమస్య మళ్లీ తిరగబెట్టకుండా పూర్తిగా నయం చేసే అవకాశం ఉందా?**

**- డి. జ్యోతిర్మయి, ఏలూరు**

గర్భాశయంలో ఏర్పడే కణుతులను యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ అంటారు. వీటి బారిన పడిన కొంత మంది స్త్రీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ఇవి గర్భాశయంలో ఒకటిగా లేదా చిన్న చిన్న నీటితిత్తులుగా కొన్ని సెంటీమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంటుంది. వీటి ఎదుగుదల కొందరిలో వేగంగానూ, మరికొందరిలో నిదానంగా ఉంటుంది. ఇంకొందరిలో నిదానంగా, నిలకడగా, స్వల్ప పరిమాణంలో ఉంటూ ఎలాంటి లక్షణాలనూ కనబరచకపోవచ్చు. గర్భాశయంలో వీటిని ఉనికి, పరిమాణరీత్యా ఈ యుటెరైన్ ఫైబ్రాయిడ్స్‌ను మూడు రకాలుగా విభజించవచ్చు.

1) సబ్‌సీరోజల్ ఫైబ్రాయిడ్స్ 2) ఇంట్రామ్యూరల్ ఫైబ్రాయిడ్స్ 3) మ్యూకోజల్ ఫైబ్రాయిడ్స్.

కారణాలు : ఈ ఫైబ్రాయిడ్స్ ఏ కారణం చేత ఏర్పడతాయనే విషయం పట్ల ఇంతవరకు స్పష్టత లేదు. కానీ కొన్ని హార్మోన్లు... ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రోజెస్టెరాన్ హార్మోన్ల ప్రభావం వల్ల ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం ఎక్కువ. రుతుచక్ర సమయంలో, గర్భధారణ సమయంలో ఇవి ఎక్కువగా ఏర్పడతాయి. నెలసరి ఆగిపోయిన స్త్రీలలో ఈ హార్మోన్ల ఉత్పాదన చాలావరకు తగ్గడంతో పాటు ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. స్థూలకాయం, వంశపారంపర్యత వంటి అంశాల వల్ల కూడా గర్భాశయ కణుతులు ఏర్పడతాయి.

**లక్షణాలు:** గర్భాశయ కణుతులు ఏర్పడ్డ ప్రదేశం, పరిణామం, సంఖ్యను బట్టి అవి ఏర్పడతాయి. అధిక రుతుస్రావం, రెండు రుతుచక్రాల మధ్య వ్యవధి ఎక్కువ రోజులు కొనసాగడం, పొత్తికడుపులో నొప్పి, నడుము నొప్పి, ఫైబ్రాయిడ్స్ వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడినట్లే తరచూ మూత్రానికి వెళ్లాలని అనిపిస్తూ ఉండటం, పేగులపై ఒత్తిడి పడితే మలబద్దకం, కడుపుబ్బరం వంటి లక్షణాలను గమనించవచ్చు.

**చికిత్స:** జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతి ద్వారా హోమియో విధానంలో యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు. ఈ చికిత్స ద్వారా గర్భాశయపు కణుతులను పూర్తిగా తొలగించడమే గాకుండా, శరీరంలోని హార్మోన్లను అసమతౌల్యతను సరిచేయడం వల్ల సమస్యను తేలిగ్గా పరిష్కరించవచ్చు. మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.





**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
సీఎండీ,
హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

## మూత్ర విసర్జన సమయంలో మంట... ఎందుకిలా?

**నా వయసు 32 ఏళ్లు. ఇటీవల మూత్రం వెంటవెంటనే వస్తోంది. అంతే కాదు విసర్జన సమయంలో చాలా మంటగానూ ఉంటోంది. ఎందుకిలా జరుగుతోంది? నా సమస్యకు పరిష్కారం సూచించండి.**

**- ఆర్. శ్రీవల్లి, ఖమ్మం**

మూత్ర విసర్జక వ్యవస్థలో వచ్చే ఇన్ఫెక్షన్లను యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌గా పేర్కొంటారు. ఇవి మహిళల్లో చాలా ఎక్కువే. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

**అప్పర్ యూరినరీ టాక్ట్ ఇన్ఫెక్షన్స్:** ఇందులో మూత్రపిండాలు, మూత్రనాళాలకు ఇన్ఫెక్షన్ వస్తుంది. మూత్రపిండాలకు వచ్చే ఇన్ఫెక్షన్‌ను పైలోనెఫ్రైటిస్ అంటారు. విపరీతమైన జ్వరం, చలి, వికారం, వాంతులు దీని లక్షణాలు.

**లోవర్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్:** ఇందులో మూత్రాశయం, యురెథ్రాలు ఉంటాయి. మూత్రాశయం ఇన్ఫెక్షన్‌ను సిస్టయిటిస్ అంటారు. యురెథ్రా ఇన్ఫెక్షన్‌ను యురెథ్రయిటిస్ అంటారు.

**కారణాలు:** యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్‌లోని దాదాపు 90 శాతం కేసుల్లో ఈ సమస్యకు ప్రధానంగా కారణం ఈ–కొలై అనే బ్యాక్టీరియా. ఇది పేగుల్లో, మలద్వారం వద్ద పరాన్నజీవిగా జీవిస్తూ ఉంటుంది. సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించనివారిలో ఈ–కొలై బ్యాక్టీరియా పైపైకి పాకుతూ మూత్రకోశ ఇన్ఫెక్షన్స్‌కు దారితీస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఉండటం కూడా మూత్రవిసర్జనకు ప్రధాన అడ్డంకిగా మారి, దీనివల్ల కూడా బ్యాక్టీరియా త్వరగా అభివృద్ధి చెంది ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చు. రోగనిరోధకశక్తి తగ్గినవారిలో తరచూ యురినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ రావచ్చు.

**లక్షణాలు:** మూత్రవిసర్జనకు ముందుగానీ, తర్వాతగానీ విపరీతమైన మంట ఉండటం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం, మూత్రంలో రక్తం పడటం, పొత్తికడుపు వద్ద నొప్పి, చలిజ్వరం, వాంతులు, వికారం

**చికిత్స:** హోమియోలో వ్యాధిలక్షణాలను పరిగణనలోకి తీసుకొని, వ్యక్తి తత్వాన్ని బట్టి మందులను సూచిస్తారు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌ను నయం చేయడానికి హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో, క్రమం తప్పకుండా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి.





**డాక్టర్ ఎ.ఎం. రెడ్డి,** సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

## సోరియాసిస్‌కు చికిత్స ఉందా?

**నా వయసు 42 ఏళ్లు. చాలా రోజుల నుంచి సోరియాసిస్‌తో బాధపడుతున్నాను. ఎన్ని మందులు వాడినా సమస్య పూర్తిగా తగ్గడం లేదు. మళ్లీ మళ్లీ వస్తోంది. దీనికి హోమియోపతిలో చికిత్స ఉందా?**

**- బి. రామారావు, సదాశివపేట**

సోరియాసిస్ అనేది ఒక దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ సమస్య. ఇది చర్మ సమస్యే అయినా ఇది మన రోగనిరోధక శక్తి మనకు ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్యగా పరిగణించాలి. ఈ వ్యాధి వచ్చిన వారిలో చర్మ కణాలు అత్యంత వేగంగా వృద్ధిచెందడంతో పాటు ఆ కణాలు అనేక పొరలుగా ఏర్పడి, అవి వెండి రంగు పొలుసులుగా రాలిపోతుంటాయి. తర్వాత చర్మంపై రక్తంతో కూడిన చిన్న చిన్న దద్దుర్ల వంటివీ ఏర్పడతాయి. దురద కూడా ఎక్కువ. చిరాకుగా ఉంటుంది.

సోరియాసిస్ వ్యాధి ఎక్కువగా మోచేతులు, మోకాళ్లు, తల, వీపు, అరచేతులు, అరికాళ్లు, ఉదరం, మెడ, నుదురు, చెవులు మొదలైన ప్రాంతాల్లో వ్యాపిస్తుంది. సోరియాసిస్‌తో బాధపడుతున్న 15 శాతం మందిలో ఆర్థరైటిస్ లక్షణాలు కూడా కనిపిస్తాయి. దీనినే 'సోరియాటిక్ ఆర్థరైటిస్' అంటారు.

**కారణాలు:** ● వంశపారంపర్యం ● మానసిక ఒత్తిడి, ఆందోళన ● శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో ఏర్పడే అస్తవ్యస్తత ● దీర్ఘకాలికంగా కొన్ని రకాల మందులు ఎక్కువగా వాడటం.

**లక్షణాలు:** ● చర్మం ఎర్రబారడం ● తీవ్రమైన దురద ● జుట్టు రాలిపోవడం ● కీళ్లనొప్పులు ● చర్మం పొడిబారినప్పుడు పగుళ్లు ఏర్పడి రక్తస్రావమూ అవుతుంది.



**నిర్ధారణ పరీక్షలు:** స్కిన్ బయాప్సీ, ఈఎస్ఆర్, సీబీపీ, ఎక్స్–రే పరీక్షలు.

**చికిత్స:** సోరియాసిస్ నివారణ/చికిత్సలకు హోమియోలో సమర్థమైన మార్గాలు ఉన్నాయి. అయితే సోరియాసిస్‌ను వెంటనే దీన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం అవసరం. లక్షణాలను బట్టి ఈ సమస్యనుంచి విముక్తి కోసం సాధారణంగా ఆర్సెనికం ఆల్బమ్, సల్ఫర్, కాలీకార్బ్, సొరినమ్, పెట్రోలియం మొదలైన మందులతో చికిత్స చేస్తారు. అయితే ఈ మందులను అనుభవజ్ఞులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో వాడాలి.



**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

పరి పరిశోధన

## కదిలే కారు టైరుతో విద్యుత్తు!



కదిలే కారు టైరుతో విద్యుదుత్పత్తి జరిగితే.. ఆ విద్యుత్తుతో కారులోని ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేస్తే ఎలా ఉంటుంది? ఈ అద్భుతాన్ని సాధించేందుకు జపనీస్ టైర్ల కంపెనీ సుమిమోటో రబ్బర్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం వీరు కన్సాయ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలతో కలిసి ఒక పరికరాన్ని తయారు చేశారు. ఎలక్ట్రోడ్‌లతో కూడిన రెండు రబ్బరు పొరలు ఉండే ఈ పరికరంలో ఒక ధనాత్మక, ఒక రుణాత్మక పట్టీలు కూడా ఉంటాయి. ఈ పరికరాన్ని టైర్ లోపలి భాగంలో ఉంచుతారు. చక్రం తిరిగినప్పుడు అది నేలకు అతుక్కుపోవడం వల్ల అక్కడ కొంత స్థిర విద్యుత్తు పుడుతుంది. ఒకరకమైన ప్లాస్టిక్ కాగితాన్ని నలిపేస్తే పుట్టే విద్యుత్తు మాదిరిదన్నమాట. ఈ విద్యుత్తును కాస్తా టైర్ లోపలిభాగంలో ఉండే పరికరం సాధారణ కరెంటుగా మారుస్తుంది. డాష్‌బోర్డు లైట్లతోపాటు రేడియో వంటి వాటిని నడపించేందుకు ఈ విద్యుత్తు సరిపోతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. 2015లో విస్కాన్సిన్–మేడిసన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు కూడా ఇలాంటి పరికరాన్ని అభివద్ధి చేసింది. ప్రస్తుతానికి తాము ఈ పరికరాన్ని వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేయడం లేదని కానీ విద్యుత్తు ఉత్పత్తిని పెంచగలిగితే దీన్ని వాహనంలో అనేక పనులకు వాడుకోవచ్చునని సుమిమోటో రబ్బర్ అంటోంది.

## మందులు విడుదల చేసే యంత్రం



మందులు సమయానికి వేసుకోకపోతే ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. కాకపోతే మతిమరపు అనండి.. లేదా ఇంకో కారణం చెప్పండి. మనలో చాలామంది కొన్నిసార్లు సమయానికి మందులు వేసుకోము. ఇలా కాకుండా.. ఎవరూ గుర్తు చేయకుండా.. సమయానికి తగ్గట్టుగా శరీరంలోకి మందులు వెళ్లిపోతూంటే.. ఈ ఆలోచనకు ప్రతిరూపం... ఫొటోలో కనిస్తున్న యంత్రం. ఓపాయిడ్ మందుల ఓవర్ డోసింగ్ సమస్యకు విరుగుడుగా పర్‌డ్యూ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన ఈ యంత్రంలో ప్రధానంగా మూడు భాగాలు ఉంటాయి. అయస్కాంత పట్టీ, ఈకేజీ సెన్సర్, నాలోక్సిన్ అనే మందు తాలూకూ క్యాప్సూల్. నొప్పిని తగ్గించేందుకు వాడే ఓపాయిడ్ మందులను అధిక డోసుల్లో వాడటం వల్ల అమెరికాలో చాలామంది మరణిస్తున్న సంగతి తెలిసిందే. ఈ యంత్రాన్ని బిగించుకుంటే.. ఈకేజీ సెన్సర్ ఊపిరి వేగం తగ్గిపోవడాన్ని గుర్తించి క్యాప్సూల్‌లో ఉన్న మందును విడుదల చేస్తుంది. అయస్కాంత పట్టీ ద్వారా విద్యుత్తు ప్రవహించి.. క్యాప్సూల్ అడుగున ఉన్న స్టీల్ పట్టీని వేడి చేయడం.. ఆ వేడికి క్యాప్సూల్‌లోని మందు విడుదల కావడం పది సెకన్ల కాలంలో జరిగిపోతుంది. ఈ యంత్రాన్ని వేరే సందర్భాల్లోనూ వాడేలా చేసేందుకు ప్రస్తుతం తాము ప్రయత్నాలు చేస్తున్నామని హ్యాగ్ లీ అనే శాస్త్రవేత్త చెప్పారు.

## బాక్సర్ గౌరవ్‌కు పతకం ఖాయం



ప్రెసిడెంట్స్ కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత గౌరవ్ బిధురీకి పతకం ఖాయమైంది. పురుషుల 56 కేజీల విభాగంలో పోటీ పడుతున్న గౌరవ్ బుధవారం ఫిలిప్పీన్స్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అఫ్గానిస్తాన్‌కు చెందిన వారిస్ కరిమిపై గెలిచి సెమీస్ చేరాడు. మరోవైపు భారత్ దిగ్గజ మహిళా బాక్సర్ మేరీకోమ్ (51 కేజీలు), జమున బోరో (54 కేజీలు) సెమీస్‌కు చేరగా.. మోనిక (48 కేజీలు) ఫైనల్స్‌లో అడుగు పెట్టింది.




# ధోని.. సైన్యంలో చేరిపోయాడు

**శిక్షణ ప్రారంభించిన టీమిండియా దిగ్గజం**

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తన రెండు నెలల సైనిక శిక్షణను ప్రారంభించాడు. పారాచూట్ రెజిమెంట్‌లో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న ధోని... బెంగళూరులోని బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేశాడు. అతడు ఈ నెల 31 నుంచి ఆగస్ట్ 19 వరకు బెటాలియన్‌తో ఉంటాడు. విక్టర్ ఫోర్స్‌లో భాగంగా దీని యూనిట్ కశ్మీర్ లోయలో విధులు నిర్వర్తిస్తోంది. సైన్యం ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి వచ్చాక ధోని... పహారా, గార్డ్, సెంట్రీ పోస్ట్, దళంలో భాగమవడం తదితర బాధ్యతలు చేపడతాడు. 'ధోనిలాంటి భారత క్రికెట్ దిగ్గజం తీసుకున్న నిర్ణయం.. దేశ యువతలో సైన్యంలో పని చేయాలన్న స్ఫూర్తిని కలిగిస్తుంది. అతడు కోరుకునేది కూడా అదే' అని ఓ అధికారి తెలిపాడు. వైమానిక దళ విమానం నుంచి ఐదు పారాచూట్ జంపింగ్‌లు చేయడం ద్వారా ధోని 2015లోనే పారాట్రూపర్‌గా అర్హత సాధించాడు.




# ఒప్పందం నుంచి తప్పుకుంది

- టీమిండియా ప్రధాన స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలిగిన ఒప్పొ
- కొత్త స్పాన్సర్‌గా బైజూస్
- సెప్టెంబరు నుంచి భారత క్రికెటర్ల దుస్తులపై బైజూస్ లోగో

**న్యూఢిల్లీ:** వచ్చే సెప్టెంబరు నుంచి భారత జాతీయ క్రికెట్ జట్టు సభ్యుల దుస్తులపై కొత్త లోగో రానుంది. ప్రస్తుతం భారత జట్టుకు ప్రధాన స్పాన్సర్‌గా ఉన్న చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ ఒప్పొ తప్పుకోవాలని నిర్ణయించుకుంది. దీని స్థానంలో బెంగళూరు ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆన్‌లైన్ ట్యుటోరియల్ సంస్థ 'బైజూస్'... కాంట్రాక్టును చేపట్టనున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 'భారత అగ్రగామి విద్యా సంబంధిత యాప్ బైజూస్‌కు స్వాగతం' అని బోర్డు పేర్కొంది. ఒప్పొ... మరో మొబైల్ సంస్థ వివో (రూ.768 కోట్లు)ను వెనక్కు నెట్టి 2017 మార్చిలో టీమిండియా స్పాన్సర్‌షిప్‌ను ఐదేళ్ల కాల వ్యవధికి రూ.1,079 కోట్లకు దక్కించుకుంది. రెండున్నరేళ్లు పైనే గడువున్నా... 'చాలా వ్యయ భారంతో కూడిన', 'కొనసాగించలేని' పరిస్థితుల్లో వైదొలగుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో టీమిండియా జెర్సీలపై ఒప్పొ లోగోకు ప్రస్తుత వెస్టిండీస్ సిరీసే ఆఖరుది కానుంది. బైజూస్ ఒప్పందం సెప్టెంబరు 5 నుంచి అమల్లోకి వస్తుంది.

భారత్‌లో సెప్టెంబరు 15 నుంచి దక్షిణాఫ్రికా పర్యటన ప్రారంభం కానుంది. మిగతా మొత్తాన్ని భరిస్తూ ఈ సంస్థ 2022 మార్చి 31 వరకు ఒప్పందంలో ఉంటుంది. ఈ మేరకు గురువారం ఒప్పొ, బైజూస్, బీసీసీఐ మధ్య అంగీకారం కుదిరింది. బీసీసీఐకి ఒప్పొ ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఒక్క మ్యాచ్‌కు రూ.4.61 కోట్లు, ఐసీసీ టోర్నీల్లోని మ్యాచ్‌కు రూ.1.56 కోట్లు చెల్లిస్తోంది. దీనికిముందు కాంట్రాక్టులో ఉన్న స్టార్ ఇండియా వరుసగా రూ.1.92 కోట్లు, రూ.61 లక్షలే చెల్లించడం గమనార్హం. 'మార్పిడి ప్రక్రియపై ఆ రెండు సంస్థలు మాట్లాడుకుని మాకు తెలిపాయి. ఈ మేరకు బీసీసీఐ నిబంధనలు అనుమతిస్తాయి. దీనిపై క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ)కి మేం సమాచారం ఇచ్చాం. కొత్త సంస్థ పాతవారు చెల్లించినంత ఇస్తుంది. లావాదేవీల వివరాలు గోప్యం. బీసీసీఐకి నష్టమేం లేదు' అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరో అధికారి మాత్రం ఈ పరిణామాలతో బీసీసీఐకి అదనంగా 10 శాతం నగదు వచ్చే వీలుందని పేర్కొన్నారు. అయితే, ఇందులోనూ బీసీసీఐ ఆఫీస్ బేరర్లను విశ్వాసంలోకి తీసుకోకుండా సీఓఏ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ కప్ జరుగుతుండగా జూన్ 7నే సీఓఏ... ఒప్పంద వ్యవహారాన్ని న్యాయ విభాగానికి నివేదించినట్లు సమాచారం. ఈ తీరును బీసీసీఐలోని కొందరు గట్టిగా ప్రశ్నిస్తున్నారు. అసలు మొత్తం ఒప్పందాన్నే రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు పిలిస్తే మరింత ఎక్కువ మొత్తం వస్తుందని, తద్వారా ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఒప్పందం నుంచి వైదొలగాలంటే... ఆరు నెలల నోటీసు ఇవ్వాలన్న నిబంధన ఏమైందని ప్రస్తావిస్తున్నారు.

## 'ఆమ్రపాలి' గ్రూప్ నుంచి మనోహర్‌కు రూ.36 లక్షలు!



**న్యూఢిల్లీ:** ఆర్థిక అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న రియల్టీ దిగ్గజం ఆమ్రపాలి గ్రూప్ కేసులో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ శశాంక్ మనోహర్ పేరు బయటకు వచ్చింది. గ్రూప్ సీఎండీ అనిల్ కుమార్ శర్మ... గృహ కొనుగోలుదారులు చెల్లించిన నిధుల నుంచి రూ.36 లక్షలను దారిమళ్లించి మనోహర్ ఖాతాలో వేసినట్లు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. 'ఆమ్రపాలి' డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు కుమ్మక్కై నిధులను దుబారా, దుర్వినియోగం చేసిన వ్యవహారంలో సుప్రీం ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఆదేశించింది. సుప్రీం తీర్పులో... దారిమళ్లిన నిధులను పొందినట్లు, అనిల్‌కుమార్ శర్మ చెల్లింపులు చేసినవారి జాబితాలో మనోహర్ పేరు రెండుసార్లుంది. దీనిపై ఆయన స్పందిస్తూ... ఈ కేసులో నాలుగేళ్ల క్రితమే తాను పట్నా హైకోర్టులో హాజరైనట్లు తెలిపారు. తనకేం సంబంధం లేదని పేర్కొన్నారు.

## నదీమ్‌కు ఐదు వికెట్లు

**విండీస్ 'ఎ' 228 ఆలౌట్**



**నార్త్‌సౌండ్:** భారత స్పిన్నర్ షాబాజ్ నదీమ్ (5/62) వెస్టిండీస్ 'ఎ' బ్యాట్స్‌మెన్‌ను తిప్పేశాడు. దీంతో తొలి అనధికారిక టెస్టులో విండీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 228 పరుగులకే కుప్పకూలింది. కార్న్‌వాల్ (59; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), బ్లాక్‌వుడ్ (53; 6 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. హైదరాబాదీ పేసర్ సిరాజ్ 2 కీలక వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' వర్షంతో ఆట నిలిచే సమయానికి 55.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి (23 బ్యాటింగ్), సాహా (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

# రాణించిన లీచ్, రాయ్

- ఇంగ్లండ్‌కు 181 పరుగుల ఆధిక్యం
- ఐర్లాండ్‌తో నాలుగు రోజుల టెస్టు

**లండన్:** తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను కుప్పకూల్చిన ఐర్లాండ్ బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌లో పట్టువిడిచారు. ఫలితంగా ఇక్కడి లార్డ్స్‌లో జరుగుతున్న నాలుగు రోజుల టెస్టులో ఆతిథ్య జట్టు ప్రత్యర్థికి కాస్త క్లిష్టమైన లక్ష్యాన్ని విధించే దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 0/0తో గురువారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ వెలుతురు లేని కారణంగా ఆట నిలిపివేసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. మరో వికెట్ చేతిలో ఉండగా ఆ జట్టు 181 పరుగుల ఆధిక్యంలో ఉంది. నైట్ వాచ్‌మన్–ఓపెనర్‌గా వచ్చిన స్పిన్నర్ జాక్ లీచ్ (162 బంతుల్లో 92; 16 ఫోర్లు), వన్‌డౌన్‌లో దిగిన జేసన్ రాయ్ (72 బంతుల్లో 78; 10 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు.


లీచ్

రెండో వికెట్‌కు వీరు 145 పరుగులు జోడించారు. ఈ ఇద్దరితో పాటు డెన్లీ (10), కెప్టెన్ రూట్ (31), బెయిర్ స్టో (0)లను త్వరతరగా ఔట్ చేసి ఐర్లాండ్ పైచేయి సాధించింది. లోయరార్డర్‌లో సామ్ కరన్ (37), స్టువర్ట్ బ్రాడ్ (21 బ్యాటింగ్) దూకుడుగా ఆడి ఆధిక్యాన్ని పెంచారు. అడైర్ (3/66), రాన్‌కిన్ (2/86), థాంప్సన్ (2/44) రాణించారు. మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన ఐర్లాండ్‌కు నాలుగో ఇన్నింగ్స్‌లో దాదాపు 200 పరుగుల లక్ష్య ఛేదన మాత్రం కష్టమే. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 85 పరుగులకు, ఐర్లాండ్ 207 ఆలౌటయ్యాయి.


తమిళ్ తలైవాస్ స్టార్ రైడర్ రాహుల్ చౌదరిని పట్టేసిన దబంగ్ ఢిల్లీ ఆటగాళ్లు

# దబంగ్‌ను గెలిపించిన నవీన్

**చావో రేవో రైడ్‌తో ఢిల్లీ గెలుపు • పాయింట్ తేడాతో తలైవాస్ ఓటమి**

**సాక్షి, హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో మరో హోరాహోరీ సమరం ప్రేక్షకుల్ని మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరి నిమిషాల్లో అనూహ్యంగా ఢిల్లీ దూసుకొచ్చింది. ఎంతో దూరంలో ఉన్న స్కోరును క్షణాల వ్యవధిలోనే సమం చేసింది. చివరికి ఒకే ఒక్క పాయింట్‌తో తలైవాస్ గెలుపు తలుపుల్ని మూసేసింది. అప్పటిదాకా తొడగొట్టిన తమిళ్ తలైవాస్‌ను చావోరేవో రైడింగ్‌లో నవీన్ కుమార్ పడగొట్టాడు. దీంతో దబంగ్ ఢిల్లీ 30–29 స్కోరుతో తలైవాస్‌పై విజయం సాధించింది. రైడర్ నవీన్ కుమార్ 8 పాయింట్లు సాధించాడు. తొలి అర్ధభాగం ముగిసేసమయానికి తలైవాస్ 18–11తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో కూడా ఆధిక్యాన్ని కొనసాగించింది. 28–11తో గెలుపుబాటలో పయనించింది. అనూహ్యంగా ఆఖరి 4 నిమిషాలు తలైవాస్‌ను ముంచాయి. ఢిల్లీ రైడర్ నవీన్ కుమార్ సూపర్ రైడ్ చేయడంతో మూడు పాయింట్లు వచ్చాయి. దీంతో దబంగ్ 27–29తో పోటీలో పడింది. మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. మరో రెండు నిమిషాల్లో 29–29తో స్కోరు సమమైంది. చావోరేవో (డు ఆర్ డై) రైడింగ్‌కు వెళ్లిన నవీన్... మంజీత్‌ను ఔట్ చేసి ఢిల్లీని గెలిపించాడు. తమిళ్ తలైవాస్ జట్టులో స్టార్ రైడర్ రాహుల్ చౌదరి 7 పాయింట్లు చేసినప్పటికీ రైడింగ్‌లో నాలుగుసార్లే సఫలమయ్యాడు. మరో రైడర్ అజయ్ కుమార్ 16 సార్లు కూతకెళ్లి 5 పాయింట్లు తెచ్చాడు. డిఫెండర్ మంజీత్ చిల్లర్ (5) రాణించగా, మిగతా వారిలో అజిత్, మోహిత్ చిల్లర్ చెరో 2 పాయింట్లు చేశారు. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధతో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్; పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడతాయి.**



# సింగమలింగై

ఇటీవలి వన్డే ప్రపంచ కప్‌లో స్టార్క్, బుమ్రా, బౌల్ట్‌లు యార్కర్లతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌పై విరుచుకుపడ్డారు. కానీ ఫలితం వద్దకు వచ్చేసరికి మాత్రం యార్కర్లకు 'తాత'లాంటివాడే అగ్రస్థానంలో నిలిచాడు. అవును, ఈ మెగా టోర్నీలో యార్కర్ల ద్వారా ఎక్కువ (ఐదు) వికెట్లు తీసిన బౌలర్ 38 ఏళ్ల లసిత్ మలింగ. ఎక్కడా తగ్గని వేగం, కొంచెం కూడా అటూ ఇటూ కాకుండా 'బ్లాక్‌హోల్'లో బంతిని విసరగల కచ్చితత్వం, తనకే సాధ్యమైన ప్రత్యేక యాక్షన్‌తో కలిసొచ్చే అదనపు ప్రయోజనంతో మలింగ యార్కర్లు బ్యాట్స్‌మెన్‌ను ప్రమాద స్థితిలోకి పడేశాయి. ఇప్పుడు ఈ యార్కర్లకు వన్డే వేదికపై విశ్రాంతినిచ్చే సమయం వచ్చింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం జరిగే తొలి మ్యాచ్ తర్వాత వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు మలింగ ప్రకటించడంతో ఒక అధ్యాయం ముగుస్తున్నట్లయింది.

**నేడు చివరి వన్డే ఆడనున్న శ్రీలంక స్టార్ బౌలర్ • ప్రపంచ క్రికెట్‌పై ప్రత్యేక ముద్ర**

సాక్షి క్రీడా విభాగం

'శుక్రవారం నేను ఆఖరి వన్డే ఆడబోతున్నాను. మీకు వీలైతే వచ్చి మ్యాచ్ చూడండి'... అంటూ లసిత్ మలింగ తన అభిమానులను ప్రేమదాస స్టేడియానికి ఆహ్వానించాడు. వన్డేల్లో శ్రీలంక తరఫున మురళీధరన్ (523 వికెట్లు), చమిందా వాస్ (399 వికెట్లు) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా మలింగ తన కెరీర్‌ను ముగించబోతున్నాడు. బంగ్లాదేశ్‌తో సిరీస్ మొత్తానికి అతడిని ఎంపిక చేసినా ఒక్క వన్డేకే పరిమితం కావాలని నిర్ణయించుకున్నాడు. నిజానికి వరల్డ్‌కప్‌తోనే రిటైర్ అవుతాడని అంతా భావించినా... 13 వికెట్లతో అతను లంక జట్టు టాపర్‌గా నిలవడంతో సెలక్టర్లు కొనసాగించక తప్పని పరిస్థితి ఏర్పడింది. టి20 క్రికెట్‌లో మాత్రం కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు మలింగ చెప్పాడు.

**టెస్టులతో మొదలు...**

బౌలర్ వేస్తున్న బంతి అర్థం కాక అంపైర్ల టై, ప్యాంట్‌లు మార్చమని ఆటగాళ్లు అడిగే పరిస్థితి మైదానంలో తలెత్తిందంటే అందుకు మలింగనే కారణం! 2005లో స్వదేశంలో లంకతో జరిగిన టెస్టులో న్యూజిలాండ్‌కు ఈ సమస్య ఎదురైంది. మలింగకే సొంతమైన 'రౌండ్ ఆర్మ్ యాక్షన్'లో బంతి మరీ కిందనుంచి వస్తుంది. అది అంపైర్ల దుస్తుల్లో కలిసిపోయి బ్యాట్స్‌మెన్‌కు కనిపించకపోయేది. దాంతో వారు ఒకసారి టై రంగు మార్చమని, రెండోసారి ప్యాంట్‌లనే మార్చమని కూడా కోరారు. ఈ టెస్టులో మలింగ తీసిన 9 వికెట్లలో 7 బౌల్డ్ లేదా ఎల్బీ కావడం విశేషం. అప్పుడే తొలిసారిగా ప్రపంచ క్రికెట్ దృష్టి మలింగపై పడింది. అతని ఇన్‌స్వింగింగ్ యార్కర్లు, స్లో బాల్, బౌన్సర్లు ప్రమాదకరంగా మారి బ్యాట్స్‌మెన్‌ను వణికించాయి. గాయాలతో టెస్టు కెరీర్ 30 మ్యాచ్‌లకే పరిమితం కాగా, అతనిలోని అసలు ప్రతిభ వన్డే క్రికెట్‌లో పదునెక్కింది.

**ఒంటి చేత్తో...**

సరిగ్గా 15 ఏళ్ల క్రితం తొలి వన్డే ఆడిన మలింగ వచ్చి రాగానే అద్భుతాలేమీ చేయలేదు. అయితే 2006లో లీడ్స్‌లో ఇంగ్లండ్‌పై అద్భుత బౌలింగ్‌తో జట్టును గెలిపించడంతో అతని సత్తా అందరికీ తెలిసింది. 2007 ప్రపంచ కప్ నుంచి 2015 ప్రపంచ కప్ వరకు శ్రీలంక జట్టు నిలకడగా సాధించిన విజయాల్లో బౌలర్‌గా మలింగదే కీలక పాత్ర. సంగక్కర, జయవర్ధనేవంటి దిగ్గజాలతో పాటు దిల్షాన్ ఎక్కువ భాగం బ్యాటింగ్ భారం మోయగా... మ్యాచ్ ఆరంభంలోనే మలింగ అందించిన వికెట్లు లంక విజయానికి బాటలు వేసేవి. మలింగ వన్డే ప్రదర్శన అనగానే అందరికీ గుర్తొచ్చేది 2007 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్. ఇందులో వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు తీసి 'హ్యాట్రిక్ ప్లస్' నమోదు చేసిన అతను క్రికెట్ ప్రపంచంలో మరెవరికీ సాధ్యం కాని అరుదైన ఘనతను సాధించాడు. 2007, 2011 రెండు ప్రపంచ కప్ ఫైనల్‌లు కూడా ఆడి ఓటమి పక్షానే నిలిచిన మలింగ 2015 వరల్డ్ కప్‌కు వచ్చేసరికి ఫిట్‌నెస్ కోల్పోయి రాణించలేకపోయాడు. ఆ తర్వాతా కొనసాగిన ఫిట్‌నెస్ సమస్యలు, బోర్డుతో వివాదం నేపథ్యంలో చాలా రోజుల క్రితమే మలింగ కెరీర్ ముగిసినట్లే అనిపించింది. అయితే లంక జట్టులో అనుభవలేమి, వరుస వైఫల్యాల తర్వాత సీనియర్ మార్గనిర్దేశనం అవసరమై అతను మరో ప్రపంచ కప్ వరకు తన ప్రస్థానాన్ని కొనసాగించగలిగాడు. కెప్టెన్‌గా శ్రీలంకకు 2014 టి20 ప్రపంచ కప్‌ను అందించిన 'స్లింగ'పొట్టి ఫార్మాట్‌లో కూడా ఎంత కాలం ఆడగలడో చూడాలి.

> 'రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం. చాలా సంతోషంగా నిష్క్రమిస్తున్నా. కుర్రాళ్లకు ఇది చక్కని అవకాశంగా భావిస్తున్నా. నా వీడ్కోలుపై రెండేళ్ల క్రితం సెలక్టర్లకు సమాచారమిచ్చాను. ఈ ప్రపంచకప్ కోసమే కష్టపడ్డాను. వన్డేలకు గుడ్‌బై చెబుతున్నప్పటికీ పొట్టి ఫార్మాట్‌లో కొనసాగుతాను. ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ దాకా క్రికెట్ ఆడతా' – మలింగ

# క్వార్టర్స్‌లో సింధు, సాయిప్రణీత్

**జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**





**టోక్యో:** మరోసారి సాధికారిక ఆటతీరును ప్రదర్శించిన భారత బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, భమిడిపాటి సాయిప్రణీత్ జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు 11–21, 21–10, 21–13తో ప్రపంచ 20వ ర్యాంకర్ అయా ఒహోరి (జపాన్)పై గెలుపొందగా... పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్ 21–13, 21–16తో ప్రపంచ 17వ ర్యాంకర్ కాంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. రాస్‌ముస్ గెమ్కే (డెన్మార్క్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 9–21, 15–21తో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ శెట్టి (భారత్) జంట 15–21, 21–11, 21–19తో హువాంగ్ కాయ్ జాంగ్– లియు చెంగ్ (చైనా) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–అశ్విని పొన్నప్ప (భారత్) ద్వయం 16–21, 17–21తో దెచాపోల్–సప్‌సిరి (థాయ్‌లాండ్) జోడీ చేతిలో ఓడింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో అకానె యామగుచి (జపాన్)తో సింధు; సుగియార్తో (ఇండోనేసియా)తో సాయిప్రణీత్; తకెషి–కీగో సొనోడా (జపాన్)లతో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి తలపడతారు.

# మన్‌ప్రీత్, శ్రీజేష్‌లకు విశ్రాంతి

**టోక్యో ఒలింపిక్స్ టెస్ట్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టు ప్రకటన**

**న్యూఢిల్లీ:** రెగ్యులర్ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్, మాజీ కెప్టెన్, గోల్ కీపర్ శ్రీజేశ్‌లకు విశ్రాంతి కల్పిస్తూ... ఆగస్టు 17 నుంచి 21 వరకు జరిగే టోక్యో ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్‌లో పాల్గొనే 18 మంది సభ్యులతో కూడిన భారత హాకీ జట్టును హాకీ ఇండియా గురువారం ప్రకటించింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్‌కు తాత్కాలిక సారథ్య బాధ్యతలను అప్పగించింది. అతనికి డిప్యూటీగా మన్‌దీప్ సింగ్ వ్యవహరించనున్నారు. నవంబర్‌లో జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చినట్టు జట్టు కోచ్ గ్రాహమ్ రీడ్ తెలిపారు. సీనియర్ల గైర్హాజరీలో ఆశిస్ టోప్నో, షంషేర్ సింగ్‌లు తొలి సారిగా జాతీయ జట్టుకు ఎంపికయ్యారు.



**భారత జట్టు:** హర్మన్ ప్రీత్ సింగ్ (కెప్టెన్), మన్‌దీప్ సింగ్ (వైస్ కెప్టెన్), క్రిషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కెర, గురీందర్ సింగ్, కొత్తాజిత్ సింగ్, హార్దిక్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్, జస్కరణ్ సింగ్, గుర్‌సాహిబ్జిత్ సింగ్, నీలమ్ సంజీప్, జర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్ కుమార్, ఆశిస్ టోప్నో, ఎస్వీ సునీల్, గుర్జంత్ సింగ్, షంషేర్ సింగ్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
26-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 17 ▼ | 19 ▼ |
| 37,831 | 11,252 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30గం.లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,245 | ▼ | 76 |
| డోజోన్స్ | 27,096 | ▼ | 174 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,489 | ▼ | 12 |
| డాక్స్ | 12,362 | ▼ | 161 |
| షాంఘై | 2,937 | ▲ | 14 |
| నిక్కీ | 21,756 | ▲ | 47 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.25 | 69.89 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.63 | 87.71 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.42 | 78.28 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.67 | 65.07 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.26 | 49.45 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.73 | 51.48 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.78 | 19.20 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.19 | 19.52 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.52 | 10.64 |

# బీఓబీ లాభం రూ.826 కోట్లు



- రూ. 22,057 కోట్లకు మొత్తం ఆదాయం
- నికర వడ్డీ మార్జిన్ 2.73 శాతం
- 21% వృద్ధి చెందిన రిటైల్ రుణాలు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌కు రూ.826 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.646 కోట్ల నికర లాభం ఆర్జించామని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. దేనా బ్యాంక్, విజయ బ్యాంక్‌ల విలీనం తర్వాత తాము వెల్లడిస్తున్న తొలి ఆర్థిక ఫలితాలు ఇవని, అందుకని గత క్యూ1, ఈ క్యూ1 ఆర్థిక ఫలితాలను పోల్చడానికి లేదని పేర్కొంది. గత క్యూ1లో రూ.13,730 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ1లో రూ.22,057 కోట్లకు పెరిగిందని పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం వృద్ధితో రూ.6,496 కోట్లకు పెరిగిందని తెలిపింది. గత క్యూ4లో 2.78 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ1లో 2.73 శాతానికి తగ్గిందని పేర్కొంది.

**4 శాతం పెరిగిన నిర్వహణ లాభం**

స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, ఈ క్యూ1లో నికర లాభం రూ.709 కోట్లు, మొత్తం ఆదాయం రూ.20,861 కోట్లని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. గత క్యూ1లో రూ.528 కోట్ల నికర లాభం, రూ.12,788 కోట్ల ఆదాయం వచ్చాయని పేర్కొంది. స్టాండ్‌అలోన్ నిర్వహణ లాభం 4 శాతం వృద్ధితో రూ.4,276 కోట్లకు పెరిగిందని పేర్కొంది. సీక్వెన్షియల్‌గా చూస్తే, 34 శాతం వృద్ధి సాధించామని పేర్కొంది.

**తగ్గిన తాజా మొండి బకాయిలు....**

ఈ క్యూ1లో స్థూల మొండి బకాయిలు 10.28 శాతంగా, నికర మొండిబకాయిలు 3.95 శాతంగా ఉన్నాయని బ్యాంక్ తెలిపింది. గత క్యూ1లో స్థూల మొండి బకాయిలు 12.46 శాతమని, నికర మొండి బకాయిలు 5.4 శాతమని వెల్లడించింది. ఈ క్యూ1లో తాజా మొండి బకాయిలు రూ.5,583 కోట్లని, సీక్వెన్షియల్‌గా చూస్తే, తాజా మొండి బకాయిలు తగ్గాయని తెలిపింది. ఈ క్యూ1లో రూ.3,168 కోట్ల కేటాయింపులు జరిపామని తెలిపింది. రిటైల్ రుణాలు 21 శాతం వృద్ధి చెందడంతో మొత్తం రుణాలు 5 శాతం ఎగసి రూ.5.33 లక్షల కోట్లకు పెరిగాయని పేర్కొంది. దేశీయ డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ.7.85 లక్షల కోట్లకు చేరాయని తెలిపింది.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్ 0.68 శాతం నష్టంతో రూ.110 వద్ద ముగిసింది.

# 31న మేడిన్ ఇండియా 'సెల్టోస్'

- అనంతపూర్ ప్లాంట్లో ఆవిష్కరించనున్న కియా
- ధర రూ. 11–18 లక్షలు
- ఆంధ్రప్రదేశ్ ప్లాంటులోనే కారు తయారీ



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా సంస్థ కియా మోటార్స్.. మేడిన్ ఇండియా తొలి కారు విడుదలకు ముహూర్తం ఖరారు చేసింది. జూలై 31న స్పోర్ట్ యుటిలిటీ వెహికల్ 'సెల్టోస్' మోడల్ కారును ఆవిష్కరించనుంది. ధర వేరియంట్‌ను బట్టి ఎక్స్‌షోరూంలో రూ.11–18 లక్షలు ఉంటుందని కంపెనీ అధికారి ఒకరు సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధికి తెలిపారు. ప్రపంచంలో వాహన తయారీలో ఎనిమిదవ అతిపెద్ద కంపెనీ అయిన కియా.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో కార్ల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 536 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్లాంటు వార్షిక సామర్థ్యం 3,00,000 యూనిట్లు. ఈ ఏడాది జనవరిలో ట్రయల్ ప్రొడక్షన్‌ను కంపెనీ ప్రారంభించింది. ఆరు నెలల్లోనే తుది ఉత్పాదనను విడుదలకు సిద్ధం చేసింది. ఆన్‌లైన్‌తోపాటు 206 విక్రయ కేంద్రాల్లో జూలై 16 నుంచి ప్రీ బుకింగ్స్‌ను కంపెనీ ప్రారంభించింది. తొలి రోజే 6 వేల పైచిలుకు బుకింగ్స్ నమోదు కావడం విశేషం. రూ.25,000 చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. బీఎస్–6 ప్రమాణాలతో మూడు వేరియంట్లలో సెల్టోస్ రూపుదిద్దుకుంది. మైలేజీ మోడల్‌ను బట్టి లీటరుకు 16.1–20.8 కిలోమీటర్లు అని కంపెనీ తెలిపింది.

**హ్యుందాయ్ కార్లు కూడా..**

సెల్టోస్ సహా వచ్చే రెండేళ్లలో నాలుగు మోడళ్లను కియా అనంతపూర్ ప్లాంటులో ఉత్పత్తి చేయనుంది. కంపెనీ ఇప్పటి వరకు దేశంలో రూ.13,800 కోట్లను వెచ్చించింది. ఇందులో ప్లాంటు కోసం సుమారు రూ.7,600 కోట్లు పెట్టుబడి చేసింది. హ్యుందాయ్ మోటార్ అనుబంధ కంపెనీయే కియా మోటార్స్. అనంతపూర్ ప్లాంటును భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలని హ్యుందాయ్ భావిస్తోంది. కారణమేమంటే తమిళనాడులో ఉన్న ఈ కంపెనీకి చెందిన రెండు తయారీ కేంద్రాలు దాదాపు పూర్తి స్థాయి సామర్థ్యంతో నడుస్తున్నాయి. అలాగే కొత్త ప్లాంటు ఏర్పాటు భారీ పెట్టుబడితో కూడుకున్నది. భారత ప్యాసింజర్ కార్ మార్కెట్ ప్రస్తుతం బలహీనంగా ఉంది. తమిళనాడు ప్లాంట్ల కెపాసిటీ 7.2 లక్షల యూనిట్లు. 2018–19లో కంపెనీ 7.11 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త పెట్టుబడికి బదులు అనంతపూర్ కియా ప్లాంటును సద్వినియోగం చేసుకోవడమే మేలు అనే భావనకు హ్యుందాయ్ వచ్చిందని సమాచారం. కియా కేంద్రంలో మరో 1 లక్ష యూనిట్ల సామర్థ్యాన్ని జోడించేంతగా స్థలం ఉంది.

## ఎగుమతులకు తనిఖీ నిబంధనలో వెసులుబాటు

నూరు శాతం తనిఖీ నుంచి క్రమంగా సడలింపు: సీబీఐసీ



**న్యూఢిల్లీ:** ఎగుమతులకు సంబంధించి నూరు శాతం భౌతిక తనిఖీ నిబంధనను క్రమంగా సడలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతకుముందు తనిఖీల్లో ఎటువంటి లోపాలు వెలుగు చూడని రిస్కీ ఎగుమతిదారుల విషయంలో ఈ వెసులుబాటు లభించనుంది. పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర మండలి(సీబీఐసీ) గత నెలలో బోగస్ ఇన్‌వాయిస్‌లతో జీఎస్టీ రిఫండ్స్ కోసం క్లెయిమ్ చేసుకున్న 5,106 మంది రిస్కీ ఎగుమతిదారులను గుర్తించింది. దీంతో ఈ తరహా ఎగుమతిదారులు చేసే అన్ని రకాల ఎగుమతి సరుకులను నూరు శాతం తనిఖీ చేయడాన్ని తప్పనిసరి చేసింది. అయితే, ఎగమతిదారులు, సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, లేవనెత్తిన అంశాల నేపథ్యంలో క్రితం తనిఖీల్లో ఎటువంటి లోపాలు కనిపించిన వారికి నూరు శాతం భౌతిక తనిఖీ నిబంధనను క్రమంగా సడలించనున్నట్లు సీబీఐసీ తెలిపింది.

# జెట్ రేసులో ఇండిగో!

- టీపీజీ క్యాపిటల్‌తో కలసి బిడ్ వేసే యోచన
- రంగంలోకి అమెరికా పీఈ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్



**న్యూఢిల్లీ:** జెట్ ఎయిర్‌వేస్‌కు మళ్లీ మంచి రోజులు వచ్చేట్టున్నాయి. రుణాలు తీర్చలేక, చేతిలో చిల్లిగవ్వ లేక ఈ సంస్థ కార్యకలాపాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ సంస్థకు రూ.8,000 కోట్లకు పైగా రుణాలు ఇచ్చిన బ్యాంకులు వాటిని వసూలు చేసుకునేందుకు మార్గంగా జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేయడం తెలిసిందే. ఓ పరిష్కార నిపుణుడిని నియమించి, 90 రోజుల్లోపు దీనికి పరిష్కారం కనుగొనాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు కూడా జారీ చేసింది. దీంతో ఎన్‌సీఎల్‌టీ ముంగిటకు చేరిన జెట్ ఎయిర్‌వేస్‌పై పలు సంస్థలు ఆసక్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. దేశీయంగా విమానయానంలో అతిపెద్ద వాటా కలిగిన ఇండిగో దివాలా దశకు చేరిన జెట్ ఎయిర్‌వేస్‌ను సొంతం చేసుకోవాలన్న ఆలోచనతో ఉంది. ఇందుకోసం ప్రైవేటు ఈక్విటీ సంస్థ టీపీజీ క్యాపిటల్‌తో కలసి దివాలా చట్టం (ఐబీసీ) కింద జెట్‌ఎయిర్‌వేస్‌కు బిడ్ వేయనున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. అమెరికాకు చెందిన మరో ప్రైవేటు ఈక్విటీ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సైతం జెట్ కొనుగోలుకు ముందుకొస్తోంది ఆసక్తిగల ఇతర ఇన్వెస్టర్లతో కలసి జెట్ ఎయిర్‌వేస్‌కు బిడ్ వేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. సమస్యాత్మక కంపెనీల్లో పెట్టుబడులకు అపోలో గ్లోబల్ ప్రసిద్ధి చెందిన సంస్థ. ఇప్పటికే జెట్ ఎయిర్‌వేస్ ఉద్యోగుల కన్సార్షియంను సంప్రదించినట్టు తెలిసింది. ఈ సంస్థ నిర్వహణలో 280 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి.

**ప్రాథమిక చర్చలు జరిగాయి...**

''ఇండిగో, టీపీజీ క్యాపిటల్ జెట్ ఎయిర్‌వేస్ పట్ల ఆసక్తిగా ఉన్నాయి. లీడ్ బ్యాంకర్ అయిన ఎస్‌బీఐతో ఇటీవలే ప్రాథమిక చర్చలు కూడా నిర్వహించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న దివాలా ప్రక్రియ కింద ఈ రెండు సంస్థలు సంయుక్తంగా బిడ్ వేసే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన దేశీయ, అంతర్జాతీయ స్లాట్లపై ఇండిగో ఆసక్తిగా ఉంది. తద్వారా తన మార్కెట్ వాటాను కాపాడుకోవాలని భావిస్తోంది. జెట్ ప్రివిలేజ్ ప్రైవేటు లిమిటెడ్ (జేపీపీఎల్) పట్ల టీపీజీ క్యాపిటల్ ఎక్కువ ఆసక్తితో ఉంది. ఎందుకంటే జెట్ ఎయిర్‌వేస్‌తో పోలిస్తే జేపీపీఎల్ ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండడమే కాకుండా, గతంలో లాభాలు కూడా చవిచూసింది. స్వతంత్ర సంస్థ అయిన జేపీపీఎల్ దివాలా చర్యల్లో భాగంగా లేకపోవడమే ఉన్న అడ్డంకి. ఈ బిడ్డింగ్ ప్రక్రియలో జేపీపీఎల్‌ను కూడా భాగం చేయవచ్చా అన్నదానిపై ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని రుణదాతల కన్సార్షియం కీలకమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది'' అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. జేపీపీఎల్ అన్నది జెట్ ఎయిర్‌వేస్ సర్వీసుల్లో తరచుగా ప్రయాణించే వారి కోసం ఉద్దేశించిన లాయల్టీ ప్రోగ్రామ్. 2012లో జెట్ సొంత విభాగంగా ఏర్పాటవ్వగా, 2014లో స్వతంత్ర సంస్థగా మార్చారు. ఆ ఏడాది ఎతిహాద్ ఎయిర్‌వేస్ 150 మిలియన్ డాలర్లతో 50.1 శాతం వాటా తీసుకుంది. మిగిలిన వాటా జెట్ చేతుల్లో ఉంది. జేపీపీఎల్ విలువ రూ.7,300 కోట్లు ఉంటుందని ఆన్ పాయింట్ లాయల్టీ అనే సంస్థ అంచనా కట్టింది. ఇక, అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సైతం జెట్ ఎయిర్‌వేస్ ఉద్యోగుల కన్సార్షియంతో ఇటీవలే సమావేశమైందని, వ్యాల్యూ ఇన్వెస్టర్లుగా జెట్ ఎయిర్‌వేస్‌లో మంచి అవకాశం కోసం చూస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జెట్ రుణదాతల కన్సార్షియం ఈ నెల 16న తొలిసారి సమావేశమై చర్చలు కూడా నిర్వహించింది. ఈ వారాంతంలోపు జెట్ ఎయిర్‌వేస్‌కు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణలకు ఆహ్వానం పలకొచ్చని, బిడ్లు వేసేందుకు ఆగస్ట్ మొదటి వారం వరకు గడువు ఇవ్వొచ్చని భావిస్తున్నారు.

## కంపెనీల చట్టం సవరణ బిల్లు లోక్‌సభ ముందుకు




**న్యూఢిల్లీ:** నిబంధనల మేరకు కంపెనీలు సామాజిక కార్యక్రమాల కోసం(సీఎస్ఆర్) ఖర్చు చేయని నిధులను ప్రత్యేక ఖాతాకు బదిలీ చేయడం, తద్వారా నిబంధనల ఉల్లంఘనలను తగ్గించి ప్రత్యేక కోర్టులపై భారం తగ్గించే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం కంపెనీల చట్టం సవరణ బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కంపెనీల చట్టం 2013లో మొత్తం 16 సెక్షన్లలో సవరణలను ప్రభుత్వం ప్రతిపాదించింది. చట్ట ప్రకారం వ్యాపార కార్యకలాపాలు నిర్వహించని కంపెనీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు కల్పించడం కూడా ఇందులో ఉంది. సెక్షన్ 135 కింద సీఎస్ఆర్ నిబంధనల్లో సవరణలను పొందుపరిచింది. తమ లాభాల్లో కంపెనీలు 2%(అంతకుముందు మూడేళ్ల సగటు లాభంలో) ఒక ఆర్థిక సంవత్సరంలో సీఎస్ఆర్ కింద వెచ్చించాల్సి ఉంటుంది. ఇలా ఓ ఆర్థిక సంవత్సరంలో నిబంధనల మేరకు చేయాల్సిన వ్యయాల్లో మిగులుంటే ప్రత్యేక ఖాతాకు బదిలీ చేసి 3 ఆర్థిక సంవత్సరాల్లో ఖర్చు చేయాలన్నది సవరణ ప్రతిపాదన. అప్పటికీ మిగిలిపోతే షెడ్యూల్ 7లో పేర్కొన్న ఏదేనీ నిధికి బదలాయించడం జరుగుతుంది.

## డిసెంబర్ నాటికి వాట్సాప్ పేమెంట్ సేవలు

మెసేజ్ పంపినంత సులువుగా నగదు బదిలీ



**న్యూఢిల్లీ:** మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఈ ఏడాది ఆఖరు నాటికల్లా నగదు చెల్లింపుల సేవలను దేశవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు సంస్థ గ్లోబల్ హెడ్ విల్ కాథ్‌కార్ట్ వెల్లడించారు. మెసేజ్ పంపినంత సులువుగా నగదు బదిలీ ప్రక్రియను సులభతరం చేయాలన్నది తమ లక్ష్యమని ఆయన వివరించారు. 'యూపీఐ ప్రాతిపదికన భారతీయ బ్యాంకులతో కలిసి పేమెంట్స్ వ్యవస్థను రూపొందించాం. దీన్ని సరిగ్గా అమలు చేయగలిగితే భారత్‌లో మరింత మందిని ఆర్థిక సేవల పరిధిలోకి తేవొచ్చు. అలాగే డిజిటల్ ఎకానమీలోకి భాగంగా చేయొచ్చు. ఈ ఏడాది ఆఖర్లోగా పేమెంట్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అని గురువారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా విల్ చెప్పారు. అయితే, దీనికి నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు వచ్చాయా లేదా అన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం ఫేస్‌బుక్‌లో భాగమైన వాట్సాప్..చెల్లింపుల సేవల విషయంలో పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే తదితర సంస్థలతో పోటీపడాల్సి ఉంటోంది. ప్రస్తుతం వాట్సాప్ ప్రయోగాత్మకంగా కొంత మంది యూజర్లకు మాత్రమే పేమెంట్ సేవలను ప్రయోగాత్మకంగా అందిస్తోంది. భారతీయ యూజర్ల చెల్లింపుల డేటాను భారత్‌లోనే భద్రపర్చాలన్న నిబంధనను పాటించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇటీవలే సంస్థ వెల్లడించింది. జూలైలో ట్రయల్ రన్ పూర్తవుతుందని, రిజర్వ్ బ్యాంక్ అనుమతులన్నీ వచ్చాకే పూర్తి స్థాయిలో సేవలను ప్రారంభిస్తామని ఈ ఏడాది మే లో సుప్రీం కోర్టుకు తెలియజేసింది. 2017 నాటి గణాంకాల ప్రకారం వాట్సాప్‌కు భారత్‌లో 20 కోట్ల మంది పైగా యూజర్లు ఉన్నారు.

## బయోకాన్ లాభంలో 72 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ:** ఫార్మా కంపెనీ బయోకాన్ జూన్ త్రైమాసికానికి సంబంధించి మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం 72 శాతం పెరిగి రూ.206 కోట్లకు చేరింది. ఆదాయం రూ.1,490 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.1,192 కోట్లు, లాభం 120 కోట్లుగా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. బయోలాజిక్స్, చిన్న మాలిక్యూల్స్ విభాగం మంచి పనితీరు కారణంగా క్యూ1లో 25% వృద్ధిని నమోదు చేయగలిగినట్టు కంపెనీ సీఎండీ కిరణ్ మజుందార్ షా తెలిపారు.




## మార్కెట్లోకి 'బీఎండబ్ల్యూ ఎస్‌యూవీ ఎక్స్7'

- ప్రారంభ ధర రూ.98.9 లక్షలు
- 6.1 సెకన్లలో సున్నా నుంచి 100కి.మీ వేగం



**గురుగ్రామ్:** జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'బీఎండబ్ల్యూ' తాజాగా తన ఫ్లాగ్‌షిప్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) 'ఎక్స్7'ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.98.9 లక్షలు (ఎక్స్–షోరూం). పెట్రోల్, డీజిల్ ఇంజిన్ వేరియంట్లలో ఈ నూతన ఎస్‌యూవీ లభిస్తుండగా.. పెట్రోల్ వేరియంట్ కేవలం 6.1 సెకన్ల సమయంలోనే సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. డీజిల్ వేరియంట్ ఏడు సెకన్ల వ్యవధిలో వంద కి.మీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ ప్రకటించింది. ఎయిర్ సస్పెన్షన్‌లో మార్పులు చేయడం ద్వారా కారు ఎత్తును పెంచడం, తగ్గించడం.. ఫైవ్ జోన్ ఆటోమేటిక్ ఎయిర్ కండిషనింగ్ వంటి అధునాతన సౌకర్యాలు ఈ ఎస్‌యూవీలో ప్రత్యేకతలుగా వివరించింది. ఈ సందర్భంగా సంస్థ ఇండియా ప్రెసిడెంట్ హాన్స్ క్రిస్టియన్ బార్టెలెస్ మాట్లాడుతూ.. 'విలాసవంతమైన డ్రైవింగ్ అనుభూతిలో ఈకారు ప్రతి క్షణం కొత్త ఆనందాన్ని ఇస్తుందని భావిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు.

**ప్లగ్–ఇన్ హైబ్రిడ్ ధర రూ.2.42 కోట్లు**

ఎక్స్7తో పాటుగా.. బీఎండబ్ల్యూ 7 సిరీస్ సెడాన్ కారును ఇక్కడి మార్కెట్లోకి కంపెనీ విడుదలచేసింది. ఈ మోడల్‌లో ధరల శ్రేణి రూ.1.22 కోట్ల నుంచి రూ.1.34 కోట్లుగా ప్రకటించింది. ఇదే సమయంలో.. ప్లగ్–ఇన్ హైబ్రిడ్ 7 సిరీస్ సెడాన్ కారును ప్రవేశపెట్టింది. పెట్రోల్ వేరియంట్ ధర రూ.1.65 కోట్లు కాగా, డీజిల్ ఇంజిన్ ధర రూ.2.42 కోట్లుగా వెల్లడించింది.

**బీఎండబ్ల్యూ ఎలక్ట్రిక్ కారు..!**

రానున్నకాలంలో మరో ఐదు ఉత్పత్తులను భారత మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్లు హాన్స్ క్రిస్టియన్ ప్రకటించారు. ఇదే క్రమంలో ఇక్కడి వాతావరణానికి సరిపడే విధంగా ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

# టాటా మోటార్స్ నష్టాలు 3,679 కోట్లు

- ఆదాయం రూ.61,467 కోట్లు; 8% డౌన్
- నాలుగు రెట్లు పెరిగిన వడ్డీ వ్యయాలు
- మళ్లీ లాభాల్లోకి వస్తాం: కంపెనీ సీఈఓ
- 4.5 శాతం నష్టపోయిన టాటా మోటార్స్ షేర్




**న్యూఢిల్లీ:** దేశీయ వాహన దిగ్గజం టాటా మోటార్స్‌కు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో భారీగా నికర నష్టాలు వచ్చాయి. గత క్యూ1లో రూ.1,863 కోట్లుగా ఉన్న నికర నష్టాలు(కన్సాలిడేటెడ్) ఈ క్యూ1లో దాదాపు రెట్టింపై రూ.3,680 కోట్లకు పెరిగాయి. చైనాతో పాటు భారత్‌లో కూడా అమ్మకాలు తగ్గడం, మార్కెటింగ్ వ్యయాలు అధికంగా ఉండటం, అమ్మకాలు పెంచుకోవడానికి పెద్ద మొత్తాల్లో డిస్కౌంట్లు ఆఫర్ చేయడంతో ఈ స్థాయి నికర నష్టాలు వచ్చాయని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పి.బి. బాలాజీ తెలిపారు. మొత్తం ఆదాయం రూ.66,701 కోట్ల నుంచి 8 శాతం తగ్గి రూ.61,467 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, గత క్యూ1లో రూ.1,188 కోట్ల నికర లాభం రాగా, ఈ క్యూ1లో రూ.97 కోట్ల నికర నష్టాలు వచ్చాయని వివరించారు. వడ్డీ వ్యయాలు రూ.336 కోట్ల నుంచి నాలుగు రెట్లు పెరిగి రూ.1,712 కోట్లకు చేరాయని తెలిపారు.

**23 శాతం తగ్గిన అమ్మకాలు...**

లగ్జరీ కార్ల విభాగం జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) నికర నష్టాలు గత క్యూ1లో 26 కోట్ల పౌండ్ల నుంచి ఈ క్యూ1లో 39.5 కోట్ల పౌండ్లకు పెరిగాయని టాటా మోటార్స్ కంపెనీ తెలిపింది. ఈ క్యూ1లో జేఎల్ఆర్ విక్రయాలు 12 శాతం తగ్గి 1.28 లక్షలకు తగ్గాయని పేర్కొంది. ఈ క్యూ1లో మొత్తం వాహన విక్రయాలు 23 శాతం క్షీణించి 1.36 లక్షలకు తగ్గాయని తెలిపింది.

**మందగమనం...**

వినియోగదారుల సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, లిక్విడిటీ సమస్య, యాగ్జిల్ లోడ్‌కు సంబంధించిన నిబంధనలు.. వీటన్నింటి కారణంగా డిమాండ్ తగ్గి వాహన పరిశ్రమలో మందగమనం చోటు చేసుకుందని టాటా మోటార్స్ సీఈఓ, ఎమ్‌డీ గుంటర్ బుషెక్ చెప్పారు.

**లాభాల గైడెన్స్ కొనసాగింపు**

ప్రపంచ వ్యాప్తంగా వాహన పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న విషయం తమ ఆర్థిక ఫలితాలు ప్రతిఫలిస్తున్నాయని టాటా మోటార్స్ సీఈఓ, ఎమ్‌డీ గుంటర్ బుషెక్ చెప్పారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, ఈ ఆర్థిక సంవత్సరంలో 250 కోట్ల పౌండ్ల లాభం ఆర్జించగలమన్న గైడెన్స్‌ను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. చైనాలో పరిస్థితులు ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నాయని, కొత్త మోడళ్ల కారణంగా జేఎల్ఆర్ వృద్ధి పుంజుకోగలదన్న ధీమాను వ్యక్తం చేశారు. ఇక దేశీయంగా కూడా పరిస్థితులు మెరుగుపడగలవని పేర్కొన్నారు. రిటైల్ అమ్మకాల వృద్ధిపై దృష్టి పెట్టామని, డీలర్ల లాభదాయకత మెరుగుపడగలదని, డిమాండ్ పుంజుకునే కొత్త ఉత్పత్తులను అందించనున్నామని, పటిష్టమైన వ్యయ నియంత్రణ పద్ధతులు పాటించనున్నామని ఆయన వివరించారు. భారీ మార్పు దశలో టాటా మోటార్స్ ఉందని జేఎల్ఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాల్ఫ్ స్పెత్ వ్యాఖ్యానించారు. కఠినమైన మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకుంటున్నామని, నిర్వహణ సామర్థ్యం పెంచుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సంరంలోనే మళ్లీ లాభాల బాట పడుతామని బుషెక్ ధీమా వ్యక్తం చేశారు.

**ఏడీఆర్ 3 శాతం డౌన్**

మార్కెట్ ముగిసిన తర్వాత టాటా మోటార్స్ ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి. ఈ కంపెనీ భారీగా నష్టాలను ప్రకటిస్తుందనే అంచనాలతో బీఎస్‌ఈలో ఈ షేర్ భారీగా పతనమైంది. బీఎస్‌ఈలో టాటా మోటార్స్ షేర్ 4.5 శాతం నష్టంతో రూ.144 వద్ద ముగిసింది. గత మూడు నెలల కాలంలో ఈ షేరు 35 శాతం పతనమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఈ షేర్ ఏడాది కనిష్ట స్థాయి, రూ.129ను తాకింది. ఇక అమెరికా స్టాక్ మార్కెట్లో టాటా మోటార్స్ ఏడీఆర్ 3 శాతం నష్టంతో 10.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ ప్రభావంతో శుక్రవారం టాటా మోటార్స్‌కు భారీ నష్టాలు తప్పవని నిపుణులు పేర్కొంటున్నారు.

## గార్గ్ ఆకస్మిక బదిలీ... వీఆర్ఎస్‌కు దరఖాస్తు

**న్యూఢిల్లీ:** ఆర్థిక శాఖ కార్యదర్శి పదవిలో ఉన్న సుభాష్‌చంద్రగార్గ్(58)ను కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టుండి విద్యుత్ శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం పెట్టుబడులు, ప్రజా ఆస్తుల విభాగం (దీపమ్) కార్యదర్శిగా ఉన్న అతనూ చక్రవర్తిని నియమించింది. బుధవారం రాత్రి ఈ ఆదేశాలు జారీ చేయడంతో గురువారం గార్గ్ అనూహ్య నిర్ణయం ప్రకటించారు. స్వచ్ఛంద పదవీ విరమణకు (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఈ ఏడాది అక్టోబర్ 31 ఉద్యోగిగా తనకు ఆఖరు పనిదినమని ప్రకటించారు. అంటే, నిబంధనల మేరకు ఆగస్ట్ నుంచి మూడు నెలల పాటు నోటీస్ కాలాన్ని ఆయన పాటించనున్నారు. ఎంతో సీనియర్ ఉద్యోగి అయిన గార్గ్ ఆర్థిక శాఖ కార్యదర్శి హోదాతో ఎకనమిక్ అఫైర్స్ విభాగం(ఈడీఏ) ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇటీవల మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన పెట్టిన 2019–20 బడ్జెట్ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. అలాగే ద్రవ్య పాలసీ, ఆర్‌బీఐ సంబంధిత అంశాలకూ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. అంతేకాదు విదేశీ మార్కెట్ల నుంచి సార్వభౌమ బాండ్ల రూపంలో నిధుల సమీకరణ ప్రణాళిక బాధ్యతలూ చూశారు. అయితే, ఇంత కాలం అత్యున్నత ప్రొఫైల్‌గా భావించే ఆర్థిక శాఖ నుంచి తక్కువ ప్రొఫైల్ అయిన విద్యుత్ శాఖకు మార్చడంతో గార్గ్ నిరాశ చెందినట్టున్నారు. వాస్తవానికి 2020 అక్టోబర్ చివరి వరకు గార్గ్ పదవీ కాలం ఉంది. 1983 రాజస్థాన్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన గార్గ్ 2014లో కేంద్ర సర్వీసులకు వచ్చారు. ప్రపంచ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులై 2017 వరకు బాధ్యతలు నిర్వహించారు. 2019 మార్చిలో ఆర్థిక శాఖ కార్యదర్శి పదవిలోకి వచ్చారు. ఆర్థిక శాఖలో ఆర్థిక సేవల కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, డీఈఏ కార్యదర్శి, వ్యయాల కార్యదర్శి, దీపమ్ కార్యదర్శులు ఉంటారు. కాగా, గురువారం డీఈఏ బాధ్యతలను అతను చక్రవర్తికి గార్గ్ అప్పగించారు.



## అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై కేసీఆర్ స్పందించాలి

### బీజేపీ ఎంపీలు బండి సంజయ్, అరవింద్ డిమాండ్


బండి సంజయ్ అరవింద్

సాక్షి, న్యూఢిల్లీ: హిందువులకు వ్యతిరేకంగా ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలని బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సభలో హిందువులకు వ్యతిరేకంగా అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ స్పందించకపోతే.. ఆయన వ్యాఖ్యలకు మద్దతు ఇచ్చినట్టే అవుతుందన్నారు. బీజేపీ ఎంపీలు గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్, ఎంఐఎం రెండు పార్టీలు కూడా ఒక పథకం ప్రకారం ఓటు బ్యాంకు కోసం కరీంనగర్‌లో మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కరీంనగర్‌లో స్థానికంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచినా కూడా వచ్చే ఎన్నికల్లో కార్పొరేషన్‌ను ఎంఐఎంకు అప్పగించి రాజకీయాలు చేసేందుకు టీఆర్ఎస్ యత్నిస్తోందన్నారు. ఎంఐఎంకు గతంలో డిప్యూటీ మేయర్ పదవి ఇస్తేనే వారు ఎన్ని అరాచకాలు చేశారో ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్న టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం పార్టీ ముస్లింలను మభ్యపెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు.

## అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ హిందువులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు గురువారం ఢిల్లీలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఉద్దేశపూర్వకంగా మతపరమైన రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. గతంలో కూడా హిందువులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన అక్బరుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డిని కోరినట్టు రాంచందర్‌రావు మీడియాకు తెలిపారు.

## ఆర్టీఐ స్వేచ్ఛను దెబ్బతీయదని భావిస్తున్నాం

### టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు



సాక్షి, న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టానికి ప్రతిపాదించిన సవరణల వల్ల దాని స్వేచ్ఛ దెబ్బతినకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు విశ్వాసం వ్యక్తం చేశారు. సమాచార కమిషనర్ల నియామకం, జీతభత్యాల విషయమై సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్టీఐ చట్టం (సవరణ)–2019 బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సవరణలపై తనకున్న సందేహాలను సంబంధిత కేంద్ర మంత్రులు నివృత్తి చేయడంతో బిల్లుకు మద్దతిస్తున్నట్లు తెలిపారు.

## రైల్వే ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించండి

### కేంద్ర మంత్రిని కోరిన టీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాల్సిందిగా కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను టీఆర్ఎస్ ఎంపీలు కోరారు. ఈ మేరకు పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డిలు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల వివరాలు అందజేశారు. సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ మధ్య 113 కి.మీ మార్గంలో డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు ప్రారంభించాలని కోరారు. మునిరాబాద్–మహబూబ్‌నగర్, గద్వాల్–మాచర్ల కొత్త లైన్ల పనులు వేగవంతం చేయాలని, గద్వాల్–రాయ్‌చూర్ ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహబూబ్‌నగర్, దివిటిపల్లి రైల్వే స్టేషన్లను ఆధునీకరించాలన్నారు.

## కూలుతున్న 'చరిత్ర'!




చరిత్రకు గుర్తుగా నిలిచే కట్టడాలను ఇతర దేశాల నుంచి వచ్చి మరీ ఎందరో ఔత్సాహికులు ఆసక్తిగా తిలకిస్తూ ఉంటారు.. వాటిపై పరిశోధనలూ జరుపుతుంటారు.. అయితే మన దగ్గరే ఉన్న అలాంటి కట్టడాలను పరిరక్షించడంలో పురావస్తు శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఫలితంగా చరిత్రకు సజీవ సాక్ష్యాలైన పురాతన కట్టడాలు శిథిలావస్థకు చేరి కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లను నాటి కాకతీయులు నిర్మించారు. అయితే వాటిని ఎవరూ పట్టించుకునే వారు లేకపోవడంతో ఇలా శిథిలావస్థకు చేరుతున్నాయి.

– జి.సంపత్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## ఆ పార్టీలు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం ఎంఐఎం, బీజేపీలు మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని సీపీఐ ఆరోపించింది. రాష్ట్రాన్ని మతం ఆధారంగా విడగొట్టేందుకు ఆ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కరీంనగర్‌లో చేసిన ఉపన్యాసాన్ని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని అక్బరుద్దీన్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.










# విస్కీ, బీర్, జిన్..

- శంషాబాద్‌లో పట్టుబడిన 13 టన్నుల సామగ్రి
- డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో బయటపడిన వైనం
- ధర రూ.52 లక్షల వరకు ఉంటుందని అంచనా
- నైజీరియా నుంచి వచ్చిన పార్సిళ్లు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం కార్గోలో డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో నిషేధిత పదార్థాలు భారీగా పట్టుబడ్డాయి. కార్గోలో ఉన్న ఒక లోపాన్ని అలుసుగా తీసుకున్న నైజీరియన్లు కొంత కాలంగా అనుమతి లేని ఆహార, సౌందర్య సాధనాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ నెల 19న నైజీరియా నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ భారీ పార్సిల్‌ను తనిఖీ చేసిన అధికారులకు విస్మయపరిచే సామగ్రి బయటపడింది. 13 టన్నుల బరువు కలిగిన సౌందర్య సాధనాలు, పామాయిల్, గొడ్డు మాంసం, ఎండు చేపలు, మాంసం, విస్కీ, బీర్, జిన్ వంటి మద్యాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. పార్సిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు నిందితులను విచారిస్తున్నారు. సీజ్ చేసిన సామగ్రి విలువ రూ.52.25 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.

### నైజీరియా, సోమాలియా నుంచి..

విలువైన వస్తువుల అక్రమ రవాణా అనేది దేశం స్వాతంత్ర్యం ముందు నుంచే కొనసాగుతోంది. సౌందర్య, ఆహార పదార్థాల అక్రమ రవాణా విమానాశ్రయ చరిత్రలో తొలిసారి అని పలువురు చెబుతున్నారు. సాధారణంగా ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవాలంటే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏ) ప్లాంట్ క్వారంటైన్, యానిమల్ క్వారంటైన్, రాష్ట్ర ఎక్సైజ్, తూనికలు కొలతల శాఖల అనుమతులు తప్పనిసరి. నైజీరియా, సోమాలియా కేంద్రంగా అక్రమ దందాలు చేసే వ్యాపారులు ఒక పథకం ప్రకారం.. వీరిని ఇండియాకు పంపుతున్నారు. తరువాత మెడికల్, టూరిస్టు, స్టూడెంట్ వీసాలపై వచ్చిన తమ ఏజెంట్ల ద్వారా ఈ దందా సాగిస్తున్నారు.


శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుబడ్డ నైజీరియా నుంచి అక్రమంగా దిగుమతి చేసిన వస్తువులు

### చిన్న లోపాన్ని వాడుకుని..

కస్టమ్స్‌లో ఉన్న చిన్న లోపాన్ని వీరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. కస్టమ్స్‌లో పార్సిళ్లు వ్యక్తి పేరు, చిరునామాతో ఉంటాయి. కానీ వాటిని ఇంటికి డెలివరీ చేయరు. సదరు వ్యక్తులు వచ్చి తగిన పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చు. ఈ లోపాన్ని వాడుకుని వారు ఏదో ఒక పేరు పెట్టి సరుకులను అక్కడ నుంచి పంపుతున్నారు. నగరంలో నైజీరియన్లలో వీరి ఏజెంట్లు వెళ్లి వాటిని క్లెయిమ్ చేసుకుంటున్నారు. పలువురు నైజీరియన్ల పేరుతో వస్తోన్న ఈ పార్సిళ్లపై అధికారులకు మొదటి నుంచి అనుమానంగానే ఉంది. దీనికితోడు రకరకాల పేర్లతో ఈ పార్సిళ్లు వస్తున్నా.. ఆ వ్యక్తులంతా గతంలో హైదరాబాద్‌కు రానివారు కావడంతో అధికారుల అనుమానాలు బలపడ్డాయి. అందుకే వలపన్ని వీరిని పట్టుకున్నారు.

## 'ప్రమాదాల్లో ఏటా 15 వేల మంది మృతి'

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాల్లో ఏటా సుమారు 15 వేల మంది మృతిచెందుతున్నట్టు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 2015లో 1,46,133 మంది, 2016లో 1,50,785 మంది, 2017లో 1,47,913 మంది మృతి చెందారని వివరించారు. ఈ మరణాల్లో మూడో వంతు జాతీయ రహదారుల్లో సంభవించినవేనని తెలిపారు.




# నిండుకుండలా ఆల్మట్టి

- 129 టీఎంసీలకు గానూ 121 టీఎంసీల నిల్వ
- నారాయణపూర్‌లో 37 టీఎంసీలకు 32 టీఎంసీలు
- ప్రాణహిత, గోదావరిలో కనిపించని ప్రవాహాలు..



సాక్షి, హైదరాబాద్: నెల తొలి వారం నుంచి కురిసిన వర్షాలతో ఎగువ కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నిండు కుండను తలపిస్తోంది. ప్రవాహాల ఉధృతి స్థిరంగా కొనసాగడంతో పూర్తి స్థాయి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 129 టీఎంసీలు కాగా ప్రస్తుతం 121 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. మరో 11,413 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకొని జలాశయాన్ని పూర్తిగా నింపకుండా కొంత ఖాళీగా ఉంచనున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై వచ్చే నీటిని వచ్చినట్లుగా విద్యుదుత్పత్తి ద్వారా నారాయణపూర్‌కు విడుదల చేయనున్నారు. ఈ మొత్తం సీజన్‌లో ఆల్మట్టిలోకి 109 టీఎంసీల మేర కొత్త నీరు వచ్చింది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 113 టీఎంసీల మేర మాత్రమే నిల్వలుండగా, ఈ ఏడాది 8 టీఎంసీల మేర ఎక్కువగానే నిల్వలుండటం గమనార్హం.

### నారాయణపూర్‌లోనూ అదేస్థాయిలో..

ఇక నారాయణపూర్ సైతం నిండుగా కనిపిస్తోంది. ప్రాజెక్టులో 37 టీఎంసీలకు గానూ 32 టీఎంసీల నిల్వలున్నాయి. ఎగువ నుంచి ప్రవాహాలు లేకున్నా, ఉన్న నీటిలోంచే 6,751 క్యూసెక్కుల మేర నీటిని సాగు నీటి అవసరాలకై కాల్వలకు వదులుతున్నారు. ఎగువ ఆల్మట్టి నుంచి ఏమాత్రం వరద ఉధృతి పెరిగినా విద్యుదుత్పత్తి ద్వారా నీటిని దిగువ జూరాలకు వదిలే అవకాశం ఉంటుంది.

### రాష్ట్ర ప్రాజెక్టుల్లోకి ప్రవాహాలు అంతంత మాత్రమే..

ఇక తుంగభద్రలోనూ నిన్నామొన్నటితో పోలిస్తే వరద ఉధృతి కొంత పెరిగింది. ప్రస్తుతం 19,644 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తుండగా, 100 టీఎంసీలకు గానూ 20 టీఎంసీల నిల్వలున్నాయి. ఇది మినహాయిస్తే రాష్ట్ర ప్రాజెక్టుల్లోకి ఎక్కడా పెద్దగా ప్రవాహాలు లేవు. నాగార్జునసాగర్‌లోకి కేవలం స్థానిక పరీవాహకం నుంచి 749 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రాజెక్టులో నిల్వ 312 టీఎంసీలకు గానూ 507 అడుగుల మట్టంలో 126 టీఎంసీల నిల్వ ఉంది. ఇక శ్రీశైలంలో 215 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 31 టీఎంసీలు నిల్వలుండగా, 323 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. గోదావరి బేసిన్‌లోని రాష్ట్ర ప్రాజెక్టుల్లో ఎక్కడా చెప్పుకోదగ్గ ప్రవాహాలు కానరావడం లేదు. ఇక ప్రాణహిత నదిలోకి అంతగా ప్రవాహాలు లేవు. నిన్నామొన్నటి వరకు ఇక్కడ 9 వేల క్యూసెక్కులకు పైగా వరద రాగా, ప్రస్తుతం 8 వేల క్యూసెక్కులకు తగ్గిందని నీటి పారుదల వర్గాలు వెల్లడించాయి. దీంతో మేడిగడ్డ బ్యారేజీలో నిల్వ ఉన్న 7 టీఎంసీల నీటినే కన్నెపల్లి పంపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు.

## ఐఎంఎస్ అక్రమాలపై విచారణ

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి గోయల్



సాక్షి, హైదరాబాద్: ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్(ఐఎంఎస్)లో జరిగిన అక్రమాలపై మరింత లోతైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఐఎంఎస్‌లో మందుల కొనుగోలు, పరికరాల కొనుగోలులో భారీగా అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విచారణలో ఆర్థిక పరమైన అంశాలను తేల్చేందుకు ప్రభుత్వం ఏసీబీని రంగంలోకి దింపింది. దీంతో మూడు రోజుల పాటు విచారణ చేపట్టిన ఏసీబీ త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. సమగ్ర విచారణ కోసం సాధారణ పరిపాలన విభాగంలోని కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ (సీఓఐ) సి. సోమిరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఇదివరకే ఆరుగురు అధికారులకు నోటీసులు జారీ చేసింది.

### నోటీసులు అందుకున్నది వీరే

నోటీసులు జారీ అయిన వారిలో ఐఎంఎస్ సంచాలకులు డాక్టర్ సీహెచ్ దేవికారాణి, నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలోని సివిల్ సర్జన్ కే.వసంత ఇందిర, ఐఎంఎస్ డైరెక్టరేట్‌లో జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటస్వామి, తార్నాక ఈఎస్ఐ డిస్పెన్సరీలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ఆశ రామయ్య, నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో గ్రేడ్2 ఫార్మసిస్టు కె.నాగలక్ష్మి, డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 2 ఫార్మసిస్టు హెచ్ఆర్ ఆరాధనదేవి ఉన్నారు. వీరి నుంచి ప్రభుత్వం వివరణ తీసుకుంది. ఇందులో తమ ప్రమేయమేమీ లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలించిన ప్రభుత్వం వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా ఐదుగురు అధికారులకు ఒకే ప్రొసీడింగ్ ఇవ్వనుంది. ఐఎంఎస్ డైరెక్టర్ సీహెచ్.దేవికారాణికి తర్వాత ప్రొసీడింగ్ ఇవ్వనుంది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు పూర్తిస్థాయి పత్రాలు సమర్పించిన తర్వాతే ఆమెకు ప్రొసీడింగ్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రైల్వే ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

### దక్షిణ మధ్య రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సీఎస్ సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టు పనుల వేగాన్ని పెంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి దక్షిణ మధ్య రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సూచించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా ఆధ్వర్యంలోని రైల్వే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలసి గురువారం ఆయన సచివాలయంలో రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. నారాయణపేట్, పెద్దపల్లి, మంచిర్యాల కలెక్టర్లతో మాట్లాడి రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ సమస్యను కొలిక్కి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాల్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. వీటి నిర్మాణాలు పూర్తయిన చోట లెవల్ క్రాసింగ్స్‌ను మూసేయాలన్నారు. భద్రాచలం, సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణ పనులు, మౌలాలి–ఘట్‌కేసర్, తెల్లాపూర్–రామచంద్రాపురం, సనత్‌నగర్–మౌలాలి సెక్షన్ల పనుల పురోగతిని సమీక్షించారు. కాజీపేట పీఓహెచ్ వర్క్‌షాపు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగంగా జరగాలన్నారు. అక్కన్నపేట–మెదక్, మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్ల నిర్మాణాలతో సహా వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని రైల్వే అధికారులు కోరారు. కాజీపేట–విజయవాడ మూడో లైన్ కోసం అవసరమైన భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారుల ను సీఎస్ ఆదేశించారు. ఇలాంటి సమావేశాల ద్వారా రాష్ట్రప్రభుత్వం– రైల్వే శాఖ మధ్యనున్న సమస్యలు తొలగిపోతాయని రైల్వే జీఎం గజానన్ మాల్యా పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సింగరేణి సీఎండీ శ్రీధర్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్ శోభ పాల్గొన్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792